విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త





# చందనోత్సవంలో భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు




# ప్రాజెక్టు సారధి అమలకు కార్యాచరణపై సమీక్ష

## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

విశాఖ నగరంలో చేపట్టబోతున్న ప్రాజెక్టు సారధి (సిస్టమేటిక్ ఆగ్మెంటెడ్ రేడియల్ ట్రాఫిక్ అండ్ హూప్ ఇండక్షన్) అమలకు సంబంధించి కార్యాచరణ పై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సిటీ ఆపరేషన్ సెంటర్ నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీతో, టెండర్ నందు పాల్గొన్న బిడ్డరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విశాఖ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్కును నియంత్రించేందుకు ప్రాజెక్టు సారధిని అమల్లోనికి తీసుకురావడం జరుగుతున్న నేపథ్యంలో ఐటీఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టం) ను 90 జంక్షన్‌లలో ఏర్పాటు చేసేందుకు, అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టంను 101 జంక్షన్‌లలో సిటీ ఆపరేషన్స్ సెంటర్‌కు అనుసంధానం చేసేందుకు టెండర్లను ఆహ్వానించడం జరిగిందన్నారు. టెండర్లలో ముగ్గురు ఏజెన్సీలు పాల్గొనగా ప్రీ క్వాలిఫికేషన్ కు అర్హులయ్యారన్నారు. తదుపరి టెండర్ ప్రక్రియలకు సంబంధించి మూడు ఏజెన్సీలకు ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ చేసేందుకు మూడు జంక్షన్ లను నిర్వహణకు సూచించడం అయినదన్నారు. ఈ నిర్వహణకు సంబంధించి బిడ్డర్ల తదుపరి దశను మంజూరు చేసేందుకుగాను తదుపరి చర్య కోసం జీవీఎంసీ అదనపు కమిషనర్ ఫైనాన్స్ ఎస్ ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీర్ పి వి వి సత్యనారాయణ రాజు, వి ఎం ఆర్ డి ఏ ప్రధాన ఇంజనీరు వినయ్ కుమార్, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు ఏడుకొండలు,అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రవీణ్, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ దుర్గారాణి, పబ్లిక్ హెల్త్ పర్యవేక్షక ఇంజనీర్ కామేశ్వరరావు లతో కలిసి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడమైనదన్నారు. ముగ్గురు ఏజెన్సీలు పొందుపరిచిన వివరాలను, సాంకేతిక ప్రదర్శనను సిటీ ఆపరేషన్స్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన కమిటీ నేడు తిలకించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. టెండర్లు మంజూరు అనంతరం ప్రాజెక్టు సారథి ద్వారా నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు, వాహనాల రాకపోకలకు వీలుగా ఏ టి సి ఎస్ సిస్టం 101 జంక్షన్ లలో అమలు చేయడం జరుగునన్నారు. ఈ సిస్టం ద్వారా ట్రాఫిక్ రద్దీ కి అనుగుణంగా గ్రీన్ సిగ్నల్ ఆటోమేటిక్గా ఇండికేట్ అవుతుందన్నారు. అలాగే వీఐపీ రాకపోకలప్పుడు ట్రాఫిక్‌నకు అంతరాయం 8వ పేజీలో

# ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ కీర్తి కిరీటం విశాఖ

**శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి -విశాఖ పరిసర ప్రాంత అభివృద్ధికి రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఒప్పందాలు కుదుర్చుకున్నామని స్పష్టం - హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో అంతర్జాతీయ స్థాయిగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్న మంత్రి దుర్గేష్**

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో విశాఖపట్నం ఒక కలికుతురాయి అని, దానిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అసెంబ్లీలో స్పష్టం చేశారు. విశాఖ పట్నం దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్. వంశీ కృష్ణ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. నూతన పర్యాటక పాలసీ (2024–29)తో విశాఖను యాంకర్ హబ్‌గా చేస్తూ 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో సింహాచలం, బౌద్ధ, బీచ్, ఎకో టూరిజం థీమాటిక్ సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఇటీవల జరిగిన సీఐఐ సమ్మిట్ ద్వారా రూ. 8,650 కోట్ల విలువైన 50 ఒప్పందాలు కుదిరాయని, తద్వారా ఒబెరాయ్, తాజ్, మేఫెర్, అట్మాస్ఫియర్ కోర్ వంటి ప్రముఖ హోటల్ సంస్థలు విశాఖకు వస్తున్నాయన్నారు. అదే విధంగా స్టేట్ ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ బోర్డులో 16 ప్రాజెక్టులను ప్రభుత్వం 8వ పేజీలో



# 27న ఉపమాక వెంకటేశ్వర స్వామి కళ్యాణం.. ఘనంగా ఏర్పాట్లు

**ఆలయానికి చేరిన స్వామి వారి ఆభరణాలు.. ఆ ఏడుకొండల వాడిని చూసేందుకు సిద్ధమవుతున్న భక్తులు.. ఏర్పాట్లలో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థలు, ఆలయ అధికారులు, కూటమినేతలు..**




# విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలి

**దక్షిణ భారతదేశంలో నెంబర్ వన్ టూరిస్ట్ ప్రాంతం విశాఖ -అసెంబ్లీ వేదికగా పలు అంశాలను ప్రస్తావించిన విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ**




(ప్రభాతవార్త–విశాఖపట్నం)

విశాఖ నగరాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలని విశాఖ దక్షిణ నియోజక వర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మంగళవారం అసెంబ్లీ వేదికగా పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించినందుకు ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. విశాఖలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ మౌళిక సదుపాయాలు సరిగా లేకపోవడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఉన్న ఒకే ఒక టూరిజం రిసార్ట్స్ పడగొట్టి 30 సంవత్సరాల కళను నెరవేర్చుకోవడానికి జగన్ ఒక ప్యాలెస్ కట్టారన్నారు. ఇప్పుడు ఉన్న ఒకే ఒక ఆ రిసార్ట్ కూడా మనకు లేకుండా పోయిందన్నారు. విశాఖలో ఎక్కువ పెట్టుబడులు పెట్టే వారికి సబ్సిడీ ఇవ్వాలన్నారు. సుమారు 10 వరకు మెగా ప్రాజెక్టులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మేగ్లాన్, మేఫేయిర్, ఓబెరాయ్ వంటి సంస్థలు విశాఖ వస్తే అభివృద్ధి జరిగి యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. అరకు ముఖ్యమైన పర్యాటక ప్రదేశమన్నారు. విశాఖ నుంచి అరకు వరకు ఉన్న చిన్న రహదారి మార్గాన్ని పెద్దదిగా విస్తరించాలన్నారు. విశాఖలో వున్న ప్రధాన సమస్య సి.ఆర్.జెడ్ జోన్ అని వివరించారు. ఎండాడ నుండి భీమిలి వరకు ఉన్న సి.ఆర్.జెడ్ జోన్ ప్రాంతంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సిఆర్‌జడ్ నిబంధనల వలన చిన్న చిన్న వ్యాపారస్తులు వ్యాపారాలు 8వ పేజీలో

# పసిబిడ్డ కోసం చింతూరులో పరిమళించిన మానవత్వం




# ఒక్కటైన అల్లూరి జిల్లా జేసి శ్రీపూజ, మేఘాలయ జేసి ఆదిత్యవర్మ

**డెహ్రాడూన్ ముస్సోరిలో ఘనంగా యువ ఐఏఎస్‌ల వివాహ మహోత్సవం**

పాడేరు,ఫిబ్రవరి24,ప్రభాతవార్త

పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి, అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ యువ ఐఏఎస్ మేఘాలయ జాయింట్ కలెక్టర్ యువ ఐఏఎస్ ఆదిత్య వర్మ వివాహం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వివాహ సంప్రదాయ పద్ధతిలో మంగళవారం ఘనంగా జరిగింది. ఇద్దరు యువ ఐఏఎస్‌లు ప్రేమించి పెద్దలు అంగీకారంతో ముందుగా విశాఖ పట్నం రిజిస్టర్ కార్యాలయంలో వివాహం చేసుకున్న విషయం పాఠకులకు విదితమే. అయితే యువ ఐఏఎస్ ఇరు 8వ పేజీలో



# మార్చి 7న ప్రధాని మోదీ నక్కపల్లి రాక !

(అనకాపల్లి, ప్రభాతవార్త)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఐదు గ్రామాలు కలుపుకొని ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్న ఆర్సిల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కి భూమి పూజ కి సంబంధించి భారత ప్రధాని నరేంద్ర మోడీ మార్చి ఏడో తేదీన నక్కపల్లి కి రానున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.! భారత ప్రధాని మొట్టమొదటిసారిగా 8వ పేజీలో



## పని చేయటం ఇష్టం లేకపోతే..

# సెలవు పెట్టి వెళ్లిపోండి..

**టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ అసహనం**



విశాఖపట్టణం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

పని చేయటం ఇష్టం లేకపోతే సెలవు పెట్టి వెళ్లిపోండి.. అంతేగానీ ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించబోను అని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను ఘాటుగా హెచ్చరించారు. గత కొన్ని వారాలుగా పీజీఆర్ఎస్‌లో వస్తున్న వినతులకు సరైన పరిష్కారం చూపటంలో విఫలమవుతున్న పది మంది అధికారులను సోమవారం కలెక్టరేట్ కు పిలిపించి మాట్లాడారు. రెండేసి సార్లు మెమోలు ఇచ్చినప్పటికీ ఎందుకని పనితీరు మారటం లేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపటంలో వెనుకబడడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పునరావృతం 8వ పేజీలో

# 'కమిటీ కుర్రోళ్లు' బెస్ట్ డబ్ల్యు హీరోగా -సందీప్ సరోజ్ అవార్డు




# బీజేపీ చీఫ్ మాధవ్ దృష్టికి ఉక్కు సమస్యలు




# ఎకో-సెన్సిటివ్ జోన్ ముసాయిదా జోనల్ బృహత్ ప్రణాళికపై సమావేశం



విశాఖపట్టణం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

విఎంఆర్డీఎ సమావేశ మందిరంలో మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ అధ్యక్షతన జరిగిన కంబాలకొండ ఎకో–సెన్సిటివ్ జోన్ ముసాయిదా జోనల్ బృహత్ ప్రణాళికపై కీలక భాగస్వాముల సంప్రదింపుల సమావేశంలో మెసర్స్ ఎల్ఈఎ అసోసియేట్స్ సౌత్ ఏసియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన కన్సల్టెంట్లు, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ జారీ చేసిన జు్గా నోటిఫికేషన్ ప్రకారం సిద్ధం చేసిన ముసాయిదా జోనల్ మాస్టర్ ప్లాన్‌ను సమర్పించి, దానిపై సూచనలు మరియు అభిప్రాయాలను కోరారు. సమావేశంలో వీఎంఆర్డీఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ జు్గా నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 30.51 చదరపు కి.మీ. విస్తీర్ణానికి జోనల్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయబడుతోందని, ప్రస్తుత పరిస్థితులు, రహదారుల అనుసంధానత, ప్రతిపాదిత రహదారి నెట్‌వర్క్ వివరాలను బృహత్ ప్రణాళికలో చేర్చాలని సూచించారు. అదేవిధంగా పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రణాళికలో చేర్చాలన్నారు. తదుపరి సమావేశంలో ప్రస్తుతం చర్చించిన సవరణలతో కూడిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని డిఎఫ్ఓ అసోసియేట్స్ ప్రతినిధులను ఆదేశించారు. ఐఖీూ రవీంద్ర ధామా, ఎల్ఈఎ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా ఎకో–టూరిజం కార్యకలాపాలను ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో సమగ్రంగా రూపకల్పన చేయాలన్నారు. ఈ సమావేశానికి 8వ పేజీలో

# లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన "గెట్టం"





## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### -జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ నరేందర్ సింగ్



గాజువాక,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని విశాఖ జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త (డిసిహెచ్ఎస్) డాక్టర్ ఆర్. నరేందర్ సింగ్ వైద్యులకు సూచించారు. తెనాలి నుంచి బదిలీపై వచ్చిన ఆయన, బుధవారం విశాఖ జిల్లా కోఆర్డినేటర్గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అగనంపూడి ఏరియా ఆసుపత్రిని సందర్శించి, అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిరంతరం అభివృద్ధి చెందుతోందని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ గోపికృష్ణ, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి

గాజువాక,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని విశాఖపట్నం కాంటాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. మల్కాపురం గ్రామ మండలిలో సుక్క సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన మంగళవారం యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. వేతనాల పెంపు, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు, సేఫ్టీ యూనిఫాం వంటి సమస్యలపై గత నవంబర్లోనే యాజమాన్యానికి, కాంట్రాక్టర్లకు వినతిపత్రం ఇచ్చామన్నారు. కాంట్రాక్టర్లు అంగీకరించినప్పటికీ, కోరమాండల్ యాజమాన్యం మౌనం వహించడం సరికాదన్నారు. సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంతో చర్చలు జరపాలని సమావేశంలో నిర్ణయించారు. యూనియన్ నాయకులు వి.ఎస్. ప్రకాశ్ రావు, గొందేశి మహాలక్ష్మి, కోలాటి రామ్ శంకర్ పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ దృష్టికి ఉక్కు సమస్యలు



గాజువాక,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పివియన్ మాధవ్ను ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం స్టీల్ ప్లాంట్ పూర్వ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి ముందుగా ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం ఉద్యోగులకు రావలసిన బకాయిల చెల్లింపుల విషయంలో ఉన్న సమస్యలను వివరించారు. అలాగే విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం సహకారంతో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.11,440 కోట్ల నిధులతో ప్లాంట్ పునర్నిర్మాణం జరిగిందని తెలిపారు. పూర్తి స్థాయిలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర బీజేపీ మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి, స్టీల్ ప్లాంట్ కార్మిక నాయకులు బూరాడ కామేశ్వరరావు ,సుంకర సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కంచరపాలెంలో సబ్-వే నిర్మించాలి

### -డీఆర్ఎంకు మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ వినతి

గాజువాక,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త



కంచరపాలెం మెట్టు మధ్య మార్గంలో ఉన్న రైల్వే ట్రాక్ కింద సబ్-వే నిర్మించాలని కోరుతూ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ విశాఖ రైల్వే డీఆర్ఎం లలిత్ బెహరాకు విన్నవించారు. మంగళవారం 56వ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావుతో కలిసి ఆయన డీఆర్ఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. గవర కంచరపాలెం ఆంజనేయస్వామి ఆలయం నుంచి బజార్కు వెళ్లే మార్గంలో సబ్-వే లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఆయన వివరించారు. ఈ మార్గంలో సబ్-వే నిర్మాణం చేపట్టాలని కోరుతూ గ్రామ ప్రజలు సంతకాలతో కూడిన విజ్ఞప్తిని మాజీ ఎమ్మెల్యేకు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీఆర్ఎం.. సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పెంటకోట సురేష్, కంచరపాలెం గ్రామ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షులు మళ్ల బలరాం, ప్రతినిధులు బిశెట్టి నాగరాజు, పిల్లా వెంకట అప్పారావు, పొలంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఎస్-3లో 'ఉక్కు' వెనకడుగు?

### దరఖాస్తులు 700.. ఆమోదం 67 మాత్రమే! ఉత్పత్తి దెబ్బతింటుందనే మేనేజ్మెంట్ ఆందోళన



గాజువాక,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

విశాఖ ఉక్కు కర్మాగారంలో స్వచ్ఛంద పదవీ విరమణ ప్రక్రియ అనూహ్య మలుపు తీసుకుంది. మూడో విడతలో భాగంగా భారీగా సిబ్బందిని తగ్గించుకోవాలని తొలుత భావించిన యాజమాన్యం, ఇప్పుడు ఉత్పత్తి ఎక్కడ ఆగిపోతుందోనన్న భయంతో వెనక్కి తగ్గుతోంది. ఈ విడతలో సుమారు 700 మంది ఉద్యోగులు వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా, యాజమాన్యం కేవలం 67 మందికి మాత్రమే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఇప్పుడు ప్లాంట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో జరిగిన రెండు విడతల్లో (వీఆర్ఎస్-1, వీఆర్ఎస్-2) కలిపి ఇప్పటికే సుమారు 1,590 మంది అనుభవజ్ఞులైన ఉద్యోగులు ప్లాంట్ నుంచి నిష్క్రమించారు. దీనికి తోడు కొత్త నియామకాలు లేకపోవడంతో కీలకమైన విభాగాల్లో సిబ్బంది కొరత తీవ్రమైంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందితోనే బ్లాస్ట్ ఫర్నేస్లను నడపడం కష్టతరమవుతున్న తరుణంలో, మరో 700 మందిని పంపిస్తే ప్లాంట్ చక్రం ఆగిపోయే ప్రమాదం ఉందని సాంకేతిక నిపుణులు హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఒకవైపు వేతనాల చెల్లింపులో జాప్యం, మరోవైపు పెరిగిన పనిభారం వెరసి యువ ఉద్యోగులు సైతం వీఆర్ఎస్ వైపు మొగ్గు చూపారు. అయితే, అడిగిన వారందరికీ అనుమతి ఇస్తే కీలకమైన ఆపరేషన్స్ మరియు మెయింటెనెన్స్ విభాగాల్లో ఖాళీలు ఏర్పడతాయని యాజమాన్యం లెక్కలేస్తోంది.

## సర్క్యులర్ ఎకానమీతో సుస్థిరాభివృద్ధి...

విశాఖపట్టణం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ ద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, "చెత్త నుంచి సంపదను సృష్టించడమే ధ్యేయంగా ప్రత్యేక కార్యాచరణతో పని చేస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆంధ్రప్రదేశ్ను పర్యావరణ హిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు-సీఐఐ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో "సర్క్యులర్ ఎకానమీ ఑ గ్రీన్ కంపెనీస్" అనే అంశంపై మంగళవారం విశాఖపట్టణంలోని గాదిరాజు ప్యాలెస్ లో ఏర్పాటు చేసిన ఒక్క రోజు కాన్ఫరెన్సు లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సర్క్యులర్ ఎకానమీ భవిష్యత్తులో భారత ఆర్థిక వ్యవస్థకు కీలక స్తంభంగా మారనుందని, 2050 నాటికి దేశంలో సర్క్యులర్ ఎకానమీ విలువ సుమారు 2 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశముందని, ఈ రంగం ద్వారా 10 మిలియన్లకు పైగా కొత్త ఉద్యోగాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఆ ఘనత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదే...

దేశంలోనే తొలిసారిగా సమగ్ర సర్క్యులర్ ఎకానమీ పాలసీ, మార్గదర్శకాలను విడుదల చేసిన ఘనత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదేనని పట్టాభి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, సాంకేతికత ఆధారిత పరిపాలన వల్లే ఈ వినూత్న పాలసీ రూపుదిద్దుకుందని చెప్పారు. భవిష్యత్తులో సర్క్యులర్ ఎకానమీ ఒక ప్రధాన పరిశ్రమగా మారుతుందని సీఎం ముందుగానే గుర్తించారని వెల్లడించారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' డాక్యుమెంట్లో పేర్కొన్న 10 కీలక సూత్రాల్లో "స్వచ్ఛాంధ్ర" అత్యంత ప్రాధాన్యమైనదని, ప్రజలు ఆరోగ్యంగా (ఆరోగ్యాంధ్ర) ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ప్రభుత్వం విశ్వసిస్తోందని ఉద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా 5 సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏర్పాటు చేయడం ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. అదనంగా, 107 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తూ, డ్రై వేస్ట్ను ప్లాస్టిక్, గ్లాస్, కార్డ్బోర్డ్, ఈ-వేస్ట్ తదితర దాదాపు 10 రకాలుగా వర్గీకరించి రీసైక్లింగ్ పరిశ్రమలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. కూడా ఆధునిక సాంకేతికతలను వినియోగించి వ్యర్థాల నిర్వహణలో వేగాన్ని పెంచాలని సూచించారు. వ్యాపార నిర్వహణ సౌలభ్యంను మెరుగుపరుస్తూ, వ్యర్థాల నిర్వహణ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సమావేశంలో ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశంలో భాగంగా సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ గన్నమనేని మురళీకృష్ణ, పరిశ్రమల శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎన్. యువరాజ్ (వర్చువల్), సీఐఐ విజయవాడ ఛాప్టర్ పూర్వ చైర్మన్ వి. వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ సర్క్యులర్ ఎకానమీ ప్రాధాన్యత గురించి వివరించారు. దేశ, రాష్ట్ర పురోగతి సాధనలో సర్క్యులర్ ఎకానమీ కీలక భూమిక కానుందని పేర్కొన్నారు.

## పని చేయటం ఇష్టం లేకపోతే..

7వ పేజీ తరువాయి ..

కానీయొద్దని, పునఃపరిశీలన చేసుకొని జాగ్రత్తగా పని చేయాలని, ప్రజల నుంచి అందే వినతులకు సమగ్ర స్థాయిలో, నాణ్యమైన పరిష్కారం చూపాలని హితవు పలికారు.

## 'కమిటీ కుర్రోళ్లు' బెస్ట్ డబ్ల్యు హీరోగా -సందీప్ సరోజ్ అవార్డు

విశాఖపట్నం, ప్రభాతవార్త

వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, ఖారవేల ఎడ్యుకేషనల్, కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్(విశాఖపట్నం జిల్లా కళింగ కమ్యూనిటీ) అధ్యక్షులు పేడాడ నరసింగరావు చిన్న కుమారుడు సందీప్ సరోజ్ (టాలీవుడ్ హీరో గా కమిటీ కుర్రోళ్లు మూవీతో ఎంట్రీ ఇచ్చాడు) కేరళ వేదికగా కొచ్చిన్ నగరంలో జరుగుతోన్న 70వ సౌత్ ఫిల్మ్ఫేర్ అవార్డ్స్ వేడుకలో తెలుగు, కన్నడ, తమిళ మలయాళం సినిమాలకు అవార్డులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా 'కమిటీ కుర్రోళ్లు' బెస్ట్ డెబ్యు హీరోగా -సందీప్ సరోజ్ అవార్డు అందుకున్నాడు. ఈ చిత్రం థియేటర్లో, కమర్షియల్గా మంచి విజయాన్ని సాధించింది. ఈ చిత్రం ఇప్పుడు అనేక వేదికలపై అవార్డుల్ని కొల్లగొట్టేస్తోంది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో 'కమిటీ కుర్రోళ్లు' మూవీకి మంచి గుర్తింపు లభించింది.

## చందనోత్సవంలో భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు

### అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు -అభివృద్ధి పనులు, క్యూ లైన్ల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సింహాచలం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

సింహాచలంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చందనోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఆలయ ఈవో జె.వెంకటరావుతో కలిసి కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులు, క్యూ లైన్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం చందనోత్సవం ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. బారికేడింగ్తో సహా అన్ని సివిల్, నిర్మాణ పనులను మార్చి 31లోపు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సాధారణ భక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ, సంతృప్తికరంగా దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. గతంలో గాలులు, వర్షాల వల్ల ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, క్యూ లైన్ల వెంబడి సాధ్యమైనంత వరకు శాశ్వత షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎలక్ట్రికల్ మరియు ఫైర్ సేఫ్టీ తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సాధారణ భక్తులకు ఉదయం 3 గంటల నుంచి రాత్రి పది, 11 గంటల వరకు దర్శనం కల్పించేలా ప్రణాళిక రూపొందించినట్టు వివరించారు. వీఐపీ/వీవీఐపీ దర్శనాలకు ఉదయం 3 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక టైమ్ స్లాట్లు కేటాయింపునకు మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. ఉదయం 5 గంటలలోపు అంతరాలయ దర్శనాలు ముగించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు వివరించారు. రూ.300, రూ.1000, రూ.1500 దర్శన క్యూ లైన్లు వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రారంభించి, రద్దీ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల రాకపోకల కోసం బస్సుల నిర్వహణ, పికప్, డ్రాప్ పాయింట్లు, పార్కింగ్ ప్రాంతాలపై స్పష్టమైన ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. సమీక్ష అనంతరం స్వామివారిని కలెక్టర్ దర్శించుకున్నారు వీరికి ఆలయ కార్య నిర్వహణ అధికారి జె వెంకటరావు స్వాగతం పలికి ముందుగా కప్పస్తంభమాలింగనము తదుపరి స్వామి వారి దర్శనము అనంతరము వేద పండితుల వేద ఆశీర్వచనము తదుపరి స్వామివారి ప్రసాదాలని అందజేశారు. వీరితో ఆలయం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ సహాయకార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులు, టూరిజం అధికారులు తదితరులు ఉన్నారు.

## ఎకో-సెన్సిటివ్ జోన్ ముసాయిదా జోనల్ బృహత్ ప్రణాళికపై సమావేశం

7వ పేజీ తరువాయి ..

ముఖ్య ప్రణాళికాధికారిణి శిల్పా, ఎస్టేట్ అధికారి దయానిధి, శిరీష, ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ అధికారి ధనుంజయ్, పర్యాటక శాఖ, ఆర్ అండ్ బి శాఖ, వ్యవసాయ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, గనుల శాఖ, జల వనరుల శాఖ, మైన్స్, జియాలజీ తదితర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన "గెట్టం"

నక్కపల్లి, ప్రభాతవార్త

గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ వాల్డర్ మండలంలోని చిన్న దొడ్డుగల్లు గ్రామానికి చెందిన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించారు. ఫోర్ హెచ్ బి పెన్సిల్ తో 6 గంటలు కష్టపడి నాలుగు మీటర్ల ఎత్తు, నాలుగు మీటర్ వెడల్పుతో కూడిన తాజ్ మహల్ ను తయారు చేశాడు. ఈ తయారుచేసిన తాజ్ మహల్ కు లింకా బుక్ ఆఫ్ రికార్డ్ లో చోటు దక్కింది. డాక్టర్ గెట్టం వెంకటేష్ ఈ రికార్డు సాధించడం పట్ల అభినందించారు.

## ప్రాజెక్టు సారథి అమలకు కార్యాచరణపై సమీక్ష

7వ పేజీ తరువాయి ..

లేకుండా గ్రీన్ సిగ్నల్ వచ్చేలాగా సిఓసి ద్వారా ఆపరేషన్ కూడా జరుగుతుందన్నారు. అలాగే ఎ ఐ బేస్డ్ ఐటీఎంఎస్ సిస్టం 90 జంక్షన్లో ఏర్పాటు చేస్తున్నామని , ఏ ఎన్ పి ఆర్ ఑ ఆర్ ఎల్ వి డి కెమెరాల ద్వారా ట్రాఫిక్ వైలేషన్ డిటెక్షన్ చేసి ఆటోమేటిగ్గా ఫైన్ ఇంపోజ్ కు సంబంధించి చలానా జనరేట్ చెంది వాహన యజమానికి అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు పీవీ సత్యనారాయణ రాజు, విఎమ్ఆర్డిఏ ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, జీవీఎంసీ పరివేక్షక ఇంజనీర్ ఏడుకొండలు, ట్రాఫిక్ సిఐ నరసింహారావు, ఏయూ ప్రొఫెసర్ దుర్గారాణి, కెవిన్ రవి, పాల్గొన్నారు.

## ఒక్కటైన అల్లూరి జిల్లా జేసి శ్రీపూజ, మేఘాలయ జేసి ఆదిత్యవర్మ

7వ పేజీ తరువాయి ..

కుటుంబ సభ్యులు అంగీకారంతో ఈ నెల 24న ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడున్ జిల్లా ముస్సోరి ది సవాయ్ ఫంక్షన్ హాలులో ఘనంగా యువ ఐఏఎస్ వివాహం పెద్దలు సమక్షంలో జరిగింది.యువ ఐఏఎస్ లు జంట ఒక్కటయ్యారు. ఉత్తర ప్రదేశ్ లక్నో వాస్తవ్యులు సంజయ్ కుమార్ వర్మ ఐపిఎస్ డాక్టర్ నీలం రాయ్ ప్రథమ పుత్రుడు మేఘాలయ జాయింట్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఆదిత్య వర్మ ఐఏఎస్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కు చెందిన తిరుమాని సత్యనారాయణ,వీరుల వెంకమ్మ కుమార్తె యువ ఐఏఎస్ తిరుమాని శ్రీపూజ ప్రేమించి వివాహం జరుపుకన్నారు.మంగళవారం రాత్రి వివాహం పెద్దలు సమక్షంలో జరగగా రిసెప్షన్ భీమవరం పేద అమిరం నిర్మలాదేవి ఫంక్షన్ హాలులో ఈ నెల 28 న జరగనుంది.యువ ఐఏఎస్ ల ప్రేమ వివాహం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

## విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలి

7వ పేజీ తరువాయి ..

చేసుకోలేకపోతున్నారన్నారు. దళారులు కేసులు వేసి చిన్న వ్యాపారస్తులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. సిఆర్జెడ్ జోన్ నిబంధనలు జోన్ 3 నుంచి జోన్ 2కి తీసుకురావాలని మంత్రిని సభాపక్షంగా కోరారు. బీచ్ రోడ్ ఆధునీకరణకు ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, మౌళిక సదుపాయాలు సరిగా లేకపోవడం వలన విశాఖ రావలసిన టూరిస్టులు బ్యాంకాక్, గోవా, వియత్నాం వంటి ప్రాంతాలకు వెళ్లిపోతున్నారన్నారు. పర్యాటకంగా బీచ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి అద్భుతమైన బీచ్లను అభివృద్ధి చేయాలన్నారు. రానున్న రోజుల్లో విశాఖ అద్భుతమైన సిటీగా మారనుందన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు టూరిజంకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. విశాఖలో మౌళిక సదుపాయాలు పెరిగితే టూరిస్టులు విశాఖ వైపు చూస్తారన్నారు. దక్షిణ భారతదేశంలో విశాఖ నెంబర్ వన్ టూరిస్ట్ ప్రదేశంగా ఉందన్నారు. పర్యాటకంగా విశాఖను మరింత అభివృద్ధి చేయాలన్నారు. మన ఆదాయ వనరులు లాంటి పర్యాటకులు వియత్నాం వంటి ఇతర దేశాలకు వెళ్ళిపోతున్నాయన్నారు. ఇతర దేశాలకు వెళ్లిపోతున్న పర్యాటకులను తిరిగి రప్పించేందుకు బీచ్ లో సమయాన్ని పెంచి, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు.

## మార్చి 7న ప్రధాని మోదీ నక్కపల్లి రాక !

7వ పేజీ తరువాయి ..

గ్రామీణ ప్రాంతమైన పాయకరావుపేట నియోజక వర్గం నక్కపల్లి మండలానికి రానున్న నేపథ్యంలో ఆయన పర్యటన జయప్రదం చేసేందుకు అన్ని వర్గాలు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే జిల్లా పోలీస్ అధికారులు, ఇతర అధికారులు నక్కపల్లి మండలంలోని బుచ్చిరాజుపేట ,చందనాడ, అమలాపురం, వేంపాడు, డి ఎల్ పురం ప్రాంతాలను కలుపుకొని ఏ ప్రాంతంలో సభ అనుకూలంగా ఉంటాది.. హెలికాప్టర్స్ ఎక్కడ దిగేందుకు అవకాశాలుంటాయి అనేది ఉన్నత స్థాయి బృందం క్షుణ్ణంగా పరిశీలించి వెళ్లిన విషయం తెలిసినదే. ఇంకా పూర్తిస్థాయి సమాచారం అధికార వర్గాల ద్వారా తెలియజేయాల్సి ఉంది.

## పలువురు ఎస్డీసీలకు బదిలీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల(ఎస్డీసీల)కు బదిలీలు చేపడుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్(వీసీఐసీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్గా జి.విజయలక్ష్మిని నియామకం చేశారు. సీసీఎల్ఎలో అసిస్టెంట్ సెక్రటరీగా కొనసాగుతున్న డి.పుష్పమణిని విశాఖ పోర్టు ట్రస్ట్ డిప్యూటీ ఎస్టేట్ మేనేజర్గా, విశాఖపట్నం హౌసింగ్ పీడీగా కొనసాగుతున్న సిహెచ్ సత్తిబాబును విజయనగరం జిల్లా డీఆర్ఓగా, పదోన్నతి పొందిన గోవింద తడ్డిని విశాఖపట్నం జిల్లా డీపీఎం డీఎంగా నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

## 27న ఉపమాక వెంకటేశ్వర స్వామి కళ్యాణం.. ఘనంగా ఏర్పాట్లు

(నక్కపల్లి, ప్రభాతవార్త )

ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ఊహించిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కళ్యాణానికి ముందు రోజు స్వామివారి ఆభరణాలు విజయనగరం ట్రెజరీ నుంచి తీసుకొచ్చేవారు కానీ ఏడాది రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రత్యేకమైన శ్రద్ధతో ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు స్వామివారిని మరింతగా భక్తులకు చూపించాలనే ఉద్దేశ్యముతో మూడు రోజులకు ముందే స్వామివారి ఆభరణాలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు మధ్య మంగళవారం సాయంత్రం ఆలయానికి చేరాయి. ఈ ఏడాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా ఉండేటట్లు అటు ఆలయ అధికారులు, కూటమి నాయకులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షిస్తూనే ఏర్పాట్లు ల్లో నిమగ్నమ య్యారు. ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం శ్రీ ఉపమాక వెంకటేశ్వర స్వామి ఉపమాకలో గరుడాద్రి పర్వతంపై అశ్వారూఢుడై స్వామి కొలువై ఉన్నారు. ఈనెల 26 వ తేదీ నుంచి పంచరాత్ర ఆగమన శాస్త్రం ప్రకారం తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు .ప్రత్యేక మాఘ శుద్ధ ఏకాదశి వాడు స్వామివారి వార్షిక కళ్యాణ అంగరంగ వైభవంగా జరగనుంది. 26వ తేదీ ఉదయం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 27వ తేదీ రాత్రి స్వామి వారి రథోత్సవం ఎదురు సన్నాహ మహోత్సవం అనంతరం స్వామి కళ్యాణం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన కళ్యాణ వేదిక వద్ద కన్నుల వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ప్రత్యేకత స్వామి వారి మాడవీధుల్లో స్థానిక హెట్టిరో సంస్థ సిసి రోడ్లు నిర్మాణం చేపట్టడంతో రథోత్సవానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోయింది. ధర్మసంస్థాపన చేయడానికే ఉపమాకలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి వెలిశారు. వేంకటాచలం నుంచి ఉపమాక గరుడాద్రి పర్వతానికి అశ్వారూఢుడై వేంచేశారు. ఇక్కడ పలు అస్త్రాలతో అశ్వంపై ఆకాశమార్గంలో వచ్చిన శ్రీ వేంకటేశ్వరస్వామివారు ఇక్కడ వేటకోసం వచ్చారనడంలో అంతరార్థం ఏమిటంటే మనలో ఉన్న చెడు గుణాలను సంహరించడానికేనని భావించాలి. తిరుమల వేంకటాచలంకు ఉన్నవిశిష్ఠత ఉపమాక క్షేత్రానికి ఉంది. ఇక్కడ శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు సిద్ధిస్తాయి అనే నమ్మకం పూర్వీకుల నుంచి వస్తుంది. ఆ విధంగా ఈ వార్షిక కల్యాణోత్సవాలు సందర్భంగా సేవలు ముగిసిన నెల రోజులు పాటు ఈ తీర్థం సాగుతుంది. సన్మార్గంలో జీవించడానికి స్వామి అనుగ్రహిస్తారు అనే నమ్మకం భక్తుల్లో పెద్ద ఎత్తున అనిపిస్తుంది. ఆ నమ్మకం శ్రీ ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవాలు నెలరోజులపాటు భక్తులు సందడితో ఆలయ ప్రాంగణం గోవింద నామ స్మరణతో మారుమ్రోగుతుంది.

### 27నుంచి స్వామివారి కళ్యాణోత్సవాలు...

వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణ ముందుగా ఈనెల 26న గురువారం ఉదయం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు రాత్రి అశ్వవాహన సేవ నిర్వహిస్తారు. 27న ధ్వజారోహణం, ఎదురు సన్నాహ మహోత్సవం, రథోత్సవం అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవం జరుగుతుంది. మార్చి 1న సదస్యం (పండితసభ) రాత్రి పుణ్యకోటి వాహనసేవ, 2న తోటోత్సవం, రాత్రి ఇత్తడి గజవాహన సేవ, 3న మహాపూర్ణాహుతి చక్రస్నానం (పౌర్ణమి), డోలోత్సవం, రథోత్సవం, 4వ తేదీనుంచి 6వరకు శ్రీ పుష్పయాగోత్సవాలు కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తారు.

### నెలరోజుల పాటు తీర్థం...

కల్యాణోత్సవా ప్రారంభం నుంచి ఉపమాకలో 20రోజులపాటు తీర్థం జరుగుతుంది. స్వామివారి కల్యాణమహోత్సవాన్ని తిలకించడానికి ఉత్తరాంధ్ర జిల్లా ల భక్తులతో పాటు రాష్ట్రంలో నలుమూలల నుంచి స్వామివారి తీర్థంలో పాల్గొనేందుకు విశేషంగా భక్తులు తరలివస్తారు. తీర్థంలో ముఖ్యంగా మసాలా సామాన్లు, తోపాటు ఇంట్లోకి ఉపయోగపడే గృహపకరణాలు ఎక్కువగా మహిళలు కొలుగోలు చేస్తారు. కల్యాణం సందర్భంగా స్వామివారికి విజయనగరం ట్రెజరీలో భద్రపరచిన నగలను తీసీ ఆలయానికి తీసుకొస్తారు. ఆ విధంగా ఏడాది మూడు రోజులు ముందే ఆలయానికి ఆభరణాలు చేరాయి. కళ్యాణానికి ముందు రోజు స్వామి వారికి విశేష అలంకరణ చేస్తారు. ఈ విషేష నగల అలంకరణతో స్వామివారు దర్శనమిచ్చేది కేవలం రెండు, మూడురోజులే కావడంతో స్వామివారిని దర్శించడానికి భక్తులు భారీగా తరలివస్తారు. పౌర్ణమి రోజున స్వామివారికి మండలంలోని రాజయ్యపేట సముద్రతీరంలో చక్రవారీస్నానం చేయిస్తారు. ఈ సందర్భంగా స్వామివారి వెంట వెళ్లడానికి భక్తుల పోటీపడతారు. స్వామివారితోపాటు వేలాదిమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. కల్యాణోత్సవం రోజునుంచి ఉగాది వరకు ఇక్కడ వెంకన్న సంబరాలు అందరినీ భక్తిపారవశ్యంలో ముంచెత్తుతాయి. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా రాజ గోపురం ,ఉత్సవమూర్తులను గోపురం, బేడా మండపం, కళ్యాణ మండపం తోపాటు ఆలయంలో ప్రధాన భాగాలు వద్ద విశేష రంగుల అలంకరణతో భక్తులు ఆకట్టుకునే విధంగా అలంకరించారు. ఇదే కాకుండా కల్యాణోత్సవాల సందర్భంగా నక్కపల్లి జాతీయ రహదారి మొదలుకొని అటు భక్తులు వచ్చే రెండో మార్గం మనబాలవాణి పాలెం రహదారి మార్గం తో పాటు ఆలయ ప్రాంతం అంతా కన్నులు వైభవంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. పుష్కరిణి తో పాటు అన్ని ప్రాంతాల్లో అందమైన రంగుల అలంకరణ చూడ ముచ్చటగా కనిపిస్తుంది. స్వామివారి కల్యాణం తిలకించేందుకు వీలుగా ఈ ఏడాది పెద్ద ఎత్తున భక్తులు వస్తారని ఉద్దేశంతో ప్రత్యేకమైన పందిరి ఏర్పాట్లు తో పాటు ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక క్యూ కాంప్లెక్స్ తో పాటు ఉచిత దర్శనాలు కూడా ఏర్పాటు చేశారు. కళ్యాణం రోజు వచ్చే వేలాది మంది భక్తులు దగ్గరలో ఉన్న పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుంటారు. పుష్కరిణి వద్ద మహిళల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. వచ్చే వేలాది మంది భక్తుల కోసం ఆలయ ప్రాంగణం పక్కనే అన్నదాన కార్యక్రమం కళ్యాణం రోజు ఏర్పాటు చేశారు. ఈ అన్నదానం తో పాటు త్రాగునీటి వసతి మజ్జిగ పంపిణీ ఇతర సేవా కార్యక్రమాల కోసం స్వచ్ఛంద సంస్థలు, కూటమి నాయకులు, ఔషధ పరిశ్రమ ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. భారీ పోలీసు బందోబస్తు డి.ఎస్.పి శ్రీనివాస్.. ఉపమాక వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో భాగంగా ఎటువంటి అవాంఛనీయమైన సంఘటన జరగకుండా ఉండేటట్లు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డి.ఎస్.పి పోతిరెడ్డి శ్రీనివాస్ ముందు నుంచే బందోబస్తు ఏర్పాట్లను రథ ఉత్సవం జరిగే ప్రాంతాలను సిఐ జూరెడ్డి మురళితో కలిసి పర్యవేక్షించారు. ఈ ఏడాది కల్యాణోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తారని అంచనాలతో బందోబస్తు భారీగా ఏర్పాటు చేశామని సీఐ జూరెడ్డి మురళి చెప్పారు. సిఐలు, ఎస్సైలు, ఏఎస్ఐలు ,హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబులు, హోంగార్డులు, మహిళా పోలీసులు 350 మంది వరకు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఇదే కాకుండా బంధుర సరస్సు వద్ద గజ ఈతగాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ కీర్తి కిరీటం విశాఖ

7వ పేజీ తరువాయి ..

ఆమోదించిందన్నారు.. తద్వారా విశాఖలో 2858 రూమ్ ల ఏర్పాటుకు రూ.4098 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ కింద సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి రూ. 54.04 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 కింద బొర్రా గుహల అభివృద్ధికి రూ. 28.87 కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేశామన్నారు. రుషికొండ, తిమ్మాపురం, సాగర్ నగర్ బీచ్, భీమిలి దగ్గర గోస్తనీ బ్యాక్ వాటర్స్ తదితర ప్రాంతాల్లో స్కూబా డైవింగ్, పారా మోటరింగ్ వంటి 10 రకాల జలక్రీడలు ప్రారంభమయ్యాయన్నారు. 6 నెలల్లో 25 కంటే ఎక్కువ కార్యకలాపాలు ఇప్పటికే ప్రారంభించడం జరిగిందన్నారు.విశాఖలో ప్రభుత్వం, ట్రావెల్ మార్ట్ తో కలిసి సమీపంలోని తొట్ల కొండ, బావికొండ లను కలుపుతూ బౌద్ధ సర్క్యూట్ ఏర్పాటు చేయాలని ప్లాన్ చేస్తోందన్నారు. విశాఖ-భువనేశ్వర్- కోల్ కత్తా, విశాఖపట్నం- చెన్నై-ట్యూటికోరన్ ను సీ క్రూజ్ సర్క్యూట్ గా ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశామన్నారు. విశాఖ-అరకు సీ ప్లేన్, హెలీ టూరిజం, విశాఖ-చెన్నై-పుదచ్చేరి క్రూజ్ సర్వీసులను బలోపేతం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ - విశాఖపట్నం మధ్యలో క్యారవాన్ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ మధ్య కాలంలో క్యారవాన్ పాలసీని కూడా తెచ్చామన్నారు. తద్వారా అన్ని ప్రాంతాల్లో క్యారవాన్ పార్క్ లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు. అదే విధంగా ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో విశాఖ నుండి భీమిలీకి మధ్య ఉన్న సందర్శక ప్రాంతాలన్నీ పర్యాటకుడు సందర్శించేలా ప్రారంభించబడిన హాప్ ఆన్ హాప్ ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సుల ద్వారా సత్ఫలితాలొస్తున్నాయన్నారు. భారత్ మండపం తరహాలో ఏపీలో ఆంధ్రా మండపాన్ని అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తున్నామన్నారు. తద్వారా విశాఖలోని బీచ్ లను అభివృద్ధి చేయాలని, విశాఖలోని ఎకనమిక్ రీజియన్ క్రింద ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం ఈ రంగానికి ఊతమిచ్చినట్లైందన్నారు. తద్వారా స్థానికులకు ఉపాధి కల్పించేలా హోమ్ స్టే పాలసీ, బ్రెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ విధానం తీసుకొచ్చి 490 హోమ్ స్టేలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు కోరిన విధంగా బీచ్ రోడ్డులో నిర్మాణాలకు ఆటంకంగా ఉన్న సీఆర్ జెడ్ జోన్ 3 నుండి జోన్ 2కి మార్చే అంశాన్ని అనేక పర్యాయాలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.'సీఆర్ జెడ్ 19' అమల్లోకి వస్తే పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణాలకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ దిశగా తమ ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సభలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, పర్యాటకులు విదేశాలకు వెళ్లకుండా విశాఖలోనే అంతర్జాతీయ స్థాయి ఎంటర్ టైన్ మెంట్ హబ్ ఏర్పాటు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-24 కాలంలో కుదేలైన పర్యాటక రంగాన్ని మళ్లీ పట్టాలెక్కించామని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.ఈ క్రమంలో విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను మూడు హబ్ లుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్ర పర్యాటక రంగానికి తాము చేస్తున్న కృషి, ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో మరిన్ని పర్యాటక కార్యక్రమాలు చేపట్టి పర్యాటకాభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

## బీజేపీ చీఫ్ మాధవ్ దృష్టికి ఉక్కు సమస్యలు

విశాఖపట్నం- ప్రభాతవార్త

బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పివియన్ మాధవ్ను ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం స్టీల్ ప్లాంట్ పూర్వ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి ముందుగా ఆయనను శాలువాతో సత్కరించారు. ఉక్కు కర్మాగారం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంలో ఆయన చేసిన కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉద్యోగులకు రావలసిన బకాయిల చెల్లింపుల విషయంలో ఉన్న సమస్యలను వివరించారు. అలాగే విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం సహకారంతో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.11,440 కోట్ల నిధులతో ప్లాంట్ పునర్నిర్మాణం జరిగిందని తెలిపారు. పూర్తి స్థాయిలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర బీజేపీ మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి, స్టీల్ ప్లాంట్ కార్మిక నాయకులు బూరాడ కామేశ్వరరావు ,సుంకర సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# హెల్మెట్ ధారణే ప్రాణాలకు కవచం

## ఏయూ ఉద్యోగుల 'హెల్మెట్ ఫర్ లైఫ్' బైక్ ర్యాలీకి సీపీ శంఖబ్రత బాగ్చి శ్రీకారం- 'నో హెల్మెట్-నో ఫ్యూయల్' కఠిన అమలు



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిబ్ స్పష్టం చేశారు. హెల్మెట్ ధారణే ప్రాణ రక్షణకు ప్రధాన ఆధారం అని పేర్కొన్నారు. నగర ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించేందుకు ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హెల్మెట్ ఫర్ లైఫ్' బైక్ ర్యాలీని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఏయూ పరిపాలనా భవనం నుంచి ప్రారంభమైన ర్యాలీ సిరిపురం కూడలి, ఆల్ ఇండియా రేడియో, ఆర్.కె.బీచ్ మార్గంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు సాగింది. విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని హెల్మెట్ ధారణపై ప్రజలకు సందేశం అందించారు.ర్యాలీ అనంతరం సీపీ మాట్లాడుతూ హెల్మెట్ వాడకం ద్వారా తలకు గాయాలయ్యే ప్రమాదాన్ని 88 శాతం వరకు తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్ ధారణ వల్ల మరణాలు 40 శాతం వరకు తగ్గుతాయని పేర్కొన్నారు. వాహనం నడిపేవారు మాత్రమే కాకుండా వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాల అమలులో భాగంగా 'నో హెల్మెట్--నో ఫ్యూయల్' విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి నిబంధనలు పాటించాలని కోరారు. నాణ్యమైన హెల్మెట్ సరిగా ధరించడం అత్యంత ముఖ్యమని వివరించారు. "హెల్మెట్ ధరించండి... సురక్షిత ప్రయాణం కొనసాగించండి" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఏయూ వీసీ ఆచార్య జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ 'హెల్మెట్ ఫర్ ఆల్--సేవ్ లైఫ్' నినాదంతో విద్యార్థులు, ఉద్యోగుల భాగస్వామ్యంతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సమాజాన్ని అనుసంధానం చేసే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య జాలాది రవి, కె.సీతామాణిక్యం, డి.నగరాజ కుమారి, జి.గిరిజ శంకర్, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.హరనాథ్, ఇతర డీన్లు, అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# మురళీనగర్ జాతీయ రహదారిపై విషాదం

## బస్సు ఢీకొని మాజీ నేవీ ఉద్యోగి మృతి -ఎయిర్‌పోర్ట్ పోలీసులు దర్యాప్తు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



మురళీనగర్ జాతీయ రహదారిపై మోటార్ సైకిల్ పై వెళ్తున్న మాజీ సైనిక ఉద్యోగిని బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షీలానగర్ ప్రాంతానికి చెందిన పైలపు నాయుడు నేవీలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు.మంగళవారం ఉదయం నగరంలోని మురళీనగర్ జాతీయ రహదారిపై బైక్‌పై ప్రయాణిస్తుండగా విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాయుడు తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతిచెందారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) మార్చురీకి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.ప్రమాద వార్తతో కుటుంబ సభ్యులు, స్థానికులు విషాదంలో మునిగిపోయారు.

# యువకుడు అదృశ్యం

## ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాని క్రేన్ ఆపరేటర్ - తల్లి ఫిర్యాదు... మిస్సింగ్ కేసు నమోదు



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

ఆలయానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యం అయ్యాడు. దీంతో యువకుని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చాకలిగడ్డ దయానందనగర్‌కు చెందిన కే.సాయి వినయ్ (24) క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. 23న ఆలయానికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన ఆయన రాత్రి అయినా తిరిగి ఇంటికి చేరలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, పరిచయస్తుల ఇళ్ల వద్దతో పాటు సమీప ప్రాం తాల్లో వెతికినా ఎలాంటి సమాచారం లభించలేదు.దీంతో యువకుడి తల్లి కనక సుధా స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ కె.రవికుమార్ పర్యవేక్షణలో కంచరపాలెం హెడ్ కానిస్టేబుల్ నాగమణి కేసును విచారిస్తున్నారు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# నేడు 50 వేల కేజీల మత్తు పదార్థాల నిర్వీర్య కార్యక్రమం

## ఐదు జిల్లాల్లో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి ధ్వంసంకు సిద్ధం -పరవాడలో కార్యక్రమం...పాల్గొన్న ఐజీలు, ఎస్పీ

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన సుమారు 50 వేల కేజీలకు పైగా గంజాయిని నేడు ధ్వంసం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఆదేశాల మేరకు, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం ఈ కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా పోలీస్ యంత్రాంగం నిర్వహిస్తోంది.పరవాడ మండలం జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ (రామ్కీ) ప్రాంగణంలో నేటి ఉదయం 10 గంటలకు గంజాయి ,ఇతర మత్తు పదార్థాలను నిర్వీర్యం చేయనున్నారు.ఈ కార్యక్రమానికి రవికృష్ణ (ఐజీ, ఈగల్), గోపీనాథ్ జట్టి(ఐజీపీ, విశాఖపట్నం రేంజ్), తుహిన్ సిన్హా (ఎస్పీ, అనకాపల్లి జిల్లా)తో పాటు పలువురు సీనియర్ పోలీస్ అధికారులు హాజరుకానున్నారు.మాదకద్రవ్య రహిత సమాజం లక్ష్యంగా పోలీసులు చేపట్టిన ఈ చర్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని అధికారులు తెలిపారు. భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్న గంజాయిని చట్టబద్ధ ప్రక్రియల అనంతరం ధ్వంసం చేస్తున్నట్లు వెల్లడించారు.

# డ్రగ్స్, గంజాయి వద్దు - ఆరోగ్యం, జీవితం ముద్దు" నినాదంతో కార్యక్రమం

## - పెందుర్తిలో మత్తు పదార్థాల నివారణ అవగాహన -యువత, విద్యార్థులను సన్మార్గంలో నడిపించేందుకు పోలీసులు చైతన్యం

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ నేతృత్వంలో, పోలీస్ స్టేషన్ పరిధిలోని రైతు బజార్ సమీపంలో మంగళవారం అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య సభ్యులు, స్థానిక ప్రజలు, వ్యాపారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, యువత, విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడితే వారి భవిష్యత్తు నాశనమవుతుందని, తల్లిదండ్రులు తీవ్ర మానసిక కష్టానికి గురవుతున్నారని హెచ్చరించారు. మత్తు పదార్థాల వల్ల ప్రశాంతంగా ఉండాల్సిన కాలనీలు, విద్యాసంస్థలు అశాంతికి కేంద్రాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. అక్రమ వ్యాపారాల కోసం డ్రగ్స్, గంజాయి మాఫియా యువత జీవితాలను బలితీస్తోందని వారూ పేర్కొన్నారు. పోలీసులు, యువత ఆరోగ్యకరమైన జీవితం గడపాలని, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాలు ప్రశాంతంగా ఉండాలని, మత్తు పదార్థాలను పూర్తిగా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. గంజాయి కలిగి ఉండటం, రవాణా చేయడం, విక్రయించడం లేదా సేవించడం వల్ల కలిగే చట్టపరమైన శిక్షలు, ఆరోగ్య మరియు సామాజిక దుష్పరిణామాలను ఉదాహరణలతో వివరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్, మత్తు పదార్థాల సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది. ప్రజల్లో మత్తు పదార్థాల నిర్మూల నపై చైతన్యం పెంపొందించి, యువతను సన్మార్గంలో నడిపించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, పోలీస్ శాఖ చర్యలకు పూర్తి సహకారం అందించామని తెలిపారు.

# విజయం దిశగా ప్రశిక్షణ తరగతులు



గాజువాక,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

నగరంలోని ప్రేమసమాజం మందిరంలో బుధవారం భాజపా జిల్లా స్థాయి 'పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్' కార్యశాల జరిగింది. జిల్లా అధ్యక్షుడు పరశురాంరాజు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో గాజువాక నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలకు శిక్షణ అవసరమని, మార్చి 7 నుంచి ఏప్రిల్ 14 వరకు మండల స్థాయి తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి నూకరాజు, మహిళా మోర్చా నేతలు రోహిణి, వర్రి లలిత తదితరులు పాల్గొన్నారు.

# పొడుగుపాలెంలో ఎల్లమ్మ తీర్థ మహోత్సవం



ఆనందపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:

ఆనందపురం పంచాయితి పొడుగుపాలెం గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

# జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలకు రోల్ మోడల్‌గా యువత

(విశాఖపట్నం - ప్రభాతవార్త)



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా కలెక్టరు, చైర్మన్ ఆదేశాల ప్రకారం ఈ ఏడాది జిల్లాలో 31 క్రీడాంశాలలో శాప్ లీగ్స్ నిర్వహించడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఫిబ్రవరి నెలలో చదరంగం, సైక్లింగ్ లో జిల్లా స్థాయి పోటీలు విజయవంతంగా పూర్తయ్యాయి.ఈ సందర్భంగా, ఏపీటీడబ్ల్యూటిఎస్ (బి) స్కూల్, మారికవలసా స్కూల్ రోడ్‌లో జూనియర్ అండర్-18 కేటగిరీలలో బాలురు, బాలికల పోటీలను మంగళవారం నిర్వహిం చారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28 నుండి మార్చి 1 వరకు విజయవాడలో జరగబోయే రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు వెళ్తారని క్రీడా సంస్థ అధికారులు తెలిపారు..ఈ పోటీలను ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్(బి) స్కూల్ ప్రిన్సిపల్ ఎల్. శివప్రసాద్ ఘనంగా ప్రారంభించారు. చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొన్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. క్రీడలతో పాటు విద్యలోనూ ప్రతిభ కనబరచాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఎం.వి. సత్యనారాయణ, సెక్రటరీ, డిస్ట్రిక్ట్ సైక్లింగ్ అసోసియేషన్, ఫిజికల్ డైరెక్టర్స్, ఇతర సభ్యులు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జూన్ గ్యాలియట్ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

### యు-18 కేటగిరీ(ఫలితాలు)

1వ స్థానం: వనుము దీవన్ దీక్షిత్ (బాలురు), ప్రసాది తనుజ (బాలికలు),2వ స్థానం: కొరుకొండ మౌర్య (బాలురు), ఇమాంది పూజిత (బాలికలు),3వ స్థానం: షైక్ మేహబూబ్ బాషా (బాలురు), దరపు రమ్య (బాలికలు),4వ స్థానం: సొండి అభిలాష్ (బాలురు),5వ స్థానం: వున్నా జగదీశ్ (బాలురు),6వ స్థానం: పాలిసెట్టి ప్రుధ్వీ రాజ్ (బాలురు),7వ స్థానం: మామిడి అస్వంత్ (బాలురు), 8వ స్థానం: బథినా కిరణ్ కుమార్ (బాలురు)

# దివ్యాంగుడికి "మానవత"అండ



## -దివ్యాంగుడికి చక్రాల కుర్చీ వితరణ

గాజువాక,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

మండలంలోని దివ్యాంగులకు అండగా నిలవడంలో 'మానవత' స్వచ్ఛంద సంస్థ ముందుంటుందని ఉమ్మడి విశాఖ జిల్లా మానవత అధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు పేర్కొన్నారు. బుధవారం గాజువాక యూనిట్ నెలవారీ సేవా కార్యక్రమాల్లో భాగంగా, సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు వాంద్రంగి అభిరామ్ అనే దివ్యాంగ బాలుడికి చక్రాల కుర్చీ (వీల్ చైర్) పంపిణీ చేశారు. బాలుడి తల్లిదండ్రులు గోపి, ప్రమీల సమక్షంలో ఈ వితరణ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన శిష్టకరణాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కుమహంతి రాజా మాట్లాడుతూ.. మానవత సంస్థ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమన్నారు. మరో అతిథి మానాపురం గౌరీశంకర్ మాట్లాడుతూ.. 'మేము సైతం' నినాదంతో సంస్థలో సభ్యులను చేర్పించి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని భరోసా ఇచ్చారు. కృష్ణంరాజు మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 990 పార్థివ దేహాలకు శాంతిరథం ద్వారా అంతిమయాత్ర సేవలు, 280 ఫ్రీజర్ సేవలు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గాజువాక యూనిట్ అధ్యక్షుడు బలివాడ సత్యారావు, కార్యదర్శి గుండ్రెడ్డి లక్ష్మి, ప్రతినిధులు ఎం.వి.సుబ్బరాజు, డి.వి.ప్రసాద్ రావు, తోకల రవికిషోర్, పద్మావతి, పావని, గణపతిరాజు, బుచ్చిరాజు, సంతోష్, బాబ్జి, శివరామరాజు, జి.వి.కె.రాజు తదితరులు పాల్గొన్నారు..

# ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో "ఆపరేషన్ సంయుక్త"

## గంజాయి రవాణా మార్గాలు, నిల్వ కేంద్రాలపై ఇంటెలిజెన్స్ షేరింగ్ -సరిహద్దు జిల్లాల లైజన్ అధికారులు, వాట్సాప్/ సెక్యూర్ కమ్యూనికేషన్ గ్రూపులు ఏర్పాటు -ఇరు రాష్ట్రాల సంయుక్త బాధ్యతలో గంజాయి నియంత్రణ -జీరో కల్టివేషన్ చారిత్రాత్మక విజయశీ -976 కేసులు నమోదు, 2,405 మంది అరెస్ట్, 55,345 కేజీ గంజాయి, 56 కేజీ హాషీష్ ఆయిల్ స్వాధీనం - 129 గ్యాంగ్ సభ్యులను అరెస్ట్, 447 అంతర్రాష్ట్ర నెట్వర్క్ ఛేదన -345 డైనమిక్, 26 స్టాటిక్ చెక్‌పోస్ట్‌లలో 1,485 మంది అరెస్ట్, 57,000 కేజీ గంజాయి స్వాధీనం -33 డ్రోన్ల ద్వారా 129 హాట్‌స్పాట్ల గుర్తింపు, 111 మంది అరెస్ట్ -విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపీనాథ్ జట్టి -ఆంధ్ర-ఒడిశా అంతర్రాష్ట్ర గంజాయి నివారణపై సమన్వయ సమావేశం



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపీనాథ్ జట్టీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్-ఒడిశా రాష్ట్రాల పోలీసులు మంగళవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర వీడియో కాన్ఫరెన్స్ విజయవంతంగా జరిగింది. ఈ సమావేశంలో గంజాయి అక్రమ సాగు నిర్మూలన, భవిష్యత్తు ప్రణాళికలపై సమగ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ జీరో కల్టివేషన్ లక్ష్యాన్ని సాధించడానికి చేపట్టిన చర్యలు కొనసాగుతాయన్నారు. ఇరు రాష్ట్రాల సమన్వయంతో గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. ఐజి ఇంకా ఏమన్నారంటే..

### జీరో కల్టివేషన్ సాధన

జూలై 2024లో లక్ష్యంగా పెట్టిన జీరో కల్టివేషన్ ను జనవరి 2026 నాటికి విజయవంతంగా సాధించాం అన్నారు. ఏఎస్ఆర్ జిల్లాలో గంజాయి సాగు 7,515 ఎకరాల నుండి 93.01 ఎకరాలకు తగ్గించబడిందన్నారు. 39,500 ఎకరాల రైతులకు ప్రత్యామ్నాయ పంటలు పంపిణీ; 1 కోటి 59 లక్షల మొక్కలు, 37,678 క్వింటాల విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు..

### యువత శిక్షణ, అవకాశాలు

415 గిరిజన యువతలకు ఉద్యోగ అవకాశాలు, 360 మందికి సిఇఎంఎస్ శిక్షణ, 80 మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.. ఎన్డిపిఎస్, ఎన్ఎసిఐఎన్ శిక్షణలతో 182 అధికారులు నైపుణ్యం పెంపొందించారన్నారు.

### చర్యలు .. ఫలితాలు

976 గంజాయి కేసులు నమోదు చేసి 2,405 మంది అరెస్ట్ చేసినట్టు తెలిపారు. కాగా 55,345 కేజీ గంజాయి, 56 కేజీ హాషీష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నమన్నారు..అలాగే 129 గ్యాంగ్ సభ్యులను అరెస్ట్ చేసి,447 అంతర్రాష్ట్ర నెట్వర్క్ సభ్యులను చేదించమన్నారు. అలాగే 345 డైనమిక్, 26 స్టాటిక్ చెక్‌పోస్ట్‌లలో 1,485 మంది అరెస్ట్, 57,000 కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు..33 డ్రోన్ల ద్వారా 129 హాట్‌స్పాట్ల గుర్తింపు, 111 మంది అరెస్ట్ చేసామని అన్నారు..

### అవగాహనా కార్యక్రమాలు

22,050 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించగా వీటికి 12,72,357 మంది ప్రజలు పాల్గొన్నారన్నారు.

53 రోజుల అభ్యుదయం సైకిల్ యాత్రలో 1,300 కిలోమీటర్లు, 2,500 అవగాహనా కార్యక్రమాలు, 2,50,000 ప్రజలు , విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

### భవిష్యత్తు ప్రణాళికలు

ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దుల్లో "ఆపరేషన్ సంయుక్త" నిర్వహణ,గంజాయి రవాణా మార్గాలు, నిల్వ కేంద్రాలపై ఇంటెలిజెన్స్ షేరింగ్,సరిహద్దు జిల్లాల లైజన్ అధికారులు, వాట్సాప్ / సెక్యూర్ కమ్యూనికేషన్ గ్రూపులు ఏర్పాటు,ఇరు రాష్ట్రాల సంయుక్త బాధ్యతగా గంజాయి నియంత్రణ చేసినట్టు తెలిపారు.

# లారీకి క్లీనర్ లేకుంటే కఠిన చర్యలు

## -గాజువాక ట్రాఫిక్ సి ఐ షేక్ హుస్సేన్



గాజువాక,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. లారీలకు క్లీనర్లు లేకపోవడం వల్లే ప్రధానంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని గుర్తించినట్లు గాజువాక ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన మూడు రోడ్డు ప్రమాదాలను విశ్లేషించగా.. లారీలకు ఎడమవైపున ప్రయాణిస్తున్న మోటార్ సైకిళ్లు, పాదచారులను డ్రైవర్లు గమనించలేకపోవడం వల్లే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని ఆయన వివరించారు. లారీలో క్లీనర్ ఉన్నట్లయితే ఇలాంటి ప్రాణనష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి లారీలో క్లీనర్‌ను తప్పనిసరిగా నియమించుకోవాలని లారీ యజమానులకు, రవాణా సంస్థలకు ఈ నెలాఖరు వరకు సమయం ఇస్తున్నట్లు సీఐ తెలిపారు. మార్చి ఒకటో తేదీ నుంచి నిర్వహించే తనిఖీల్లో లారీలో క్లీనర్ లేనట్లు గుర్తిస్తే.. సదరు యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వాహనదారులు, రవాణా సంస్థలు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# బర్మా కాలనీ భూకబ్జాలపై రెవెన్యూ నిఘా

గాజువాక,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త



జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీలో శరణార్థుల కోసం కేటాయించిన భూముల్లో ఆక్రమణలను అరికట్టేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం స్థలాన్ని సందర్శించిన సిబ్బంది.. ఆక్రమిత ప్రాంతాల్లో 'ప్రభుత్వ భూమి' హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. 1981లో కేంద్రం కేటాయించిన 10 ఎకరాల్లో సుమారు 256 ఇళ్లకు సరిపడా ఖాళీ స్థలాన్ని కొందరు రాజకీయ నాయకులు కబ్జా చేస్తున్నారని బర్మా కందిశికుల సంఘం నేతలు అరుణ్ బాబు, బోర వేణుగోపాల్ గౌతమ్ ఆరోపించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, ఆ స్థలాలను వెంటనే శరణార్థులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమ్మింగ అప్పలరాజు, దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం బీసీ సెల్ అధ్యక్షునిగా కొణతాల శ్రీనివాస్



విశాఖపట్నం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం బీసీ సెల్ అధ్యక్షునిగా సీనియర్ నాయకుడు కొణతాల శ్రీనివాస్ నియమితులయ్యారు.ఈ మేరకు మంగళవారం దక్షిణ నియోజక వర్గ తెలుగుదేశం సమన్వయకర్త, ఎన్టీఆర్ ఆరోగ్య సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ కొణతాల శ్రీనివాస్‌ను అభినందించారు. సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతా నికి బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో భాగంగా సీనియర్ నాయకుడు కొణతాల శ్రీనివాస్ కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న కొణతాల సారథ్యంలో నియోజక వర్గంలో పార్టీ మరింత బలం పుంజుకుంటుందని సీతంరాజు తెలిపారు.కొణతాల శ్రీనివాస్ మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా నిబద్ధతతో సేవలందిస్తానని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి వ్యూహాత్మకంగా బీసీలను సిద్ధంచేస్తానని కొణతాల శ్రీనివాస్ తెలిపారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,యువనేత లోకేష్ ల సారథ్యంలో కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమం అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ అందేలా కృషిచేస్తానని కొణతాల తెలిపారు. జీవీఎంసీ కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు,స్వచ్ఛ కార్పొరేషన్ డైరెక్టర్ బుచ్చా రామిరెడ్డి,నియోజకవర్గ టీడీపీ నేతలు కేదారి లక్ష్మి,నూకరాజు, సత్యనారాయణ, సూర్యనారాయణ పిల్ల నూకరాజు పాల్గొని కొణతాల శ్రీనివాస్ ను అభినందించారు.

# విశాఖలో ప్రత్యేకమైన స్టోర్‌ను ఆవిష్కరించిన లైమ్‌లైట్ డైమండ్స్

ఆరిలోవ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త

భారతదేశంలో అతిపెద్ద, అత్యంత విశ్వసనీయ ల్యాబ్ గ్రోన్ డైమండ్ ఆభరణాల బ్రాండ్ అయిన లైమ్‌లైట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖలో తన మొదటి ప్రత్యేక స్టోర్‌ను సంస్థ సహ వ్యవస్థాపకుడు నిరవ్ భట్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ భాగస్వాములు బి. శ్రీదేవి, బి. విటల్ ప్రసాద్, అలాగే సంస్థ నాయకత్వ బృంద సభ్యులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవానికి కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంపత్ ప్లాజా, రామా టాకీస్ మెయిన్ రోడ్ ఎదుట ఏర్పాటు చేసిన ఈ స్టోర్ సంస్థ విస్తరణలో ఒక కీలక మైలురాయిగా నిలిచిందని, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 45కి పైగా నగరాల్లో 50కు పైగా ప్రత్యేక బ్రాండ్ అవుట్‌లెట్లు మరియు 40కు పైగా షాప్-ఇన్-షాప్ ఫార్మాట్లతో లైమ్‌లైట్ బలమైన రిటైల్ నెట్‌వర్క్‌ను కలిగి ఉందని, విశాఖ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ప్రవేశించడం ద్వారా దక్షిణ భారతదేశంలో తన వృద్ధి వ్యూహాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. టైప్ ఐఐఎ కేటగిరీకి చెందిన అంతర్జాతీయ ప్రమాణాలతో గుర్తింపు పొందిన సివిడి ల్యాబ్ గ్రోన్ డైమండ్స్‌తో రూపొందించిన విస్తృత శ్రేణి ఆభరణాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని, క్లాసిక్ సోలి టైర్లు, సొగసైన నెక్లెస్‌లు, ఆధునిక చెవిపోగులు, బ్రేస్‌లెట్లు, రోజువారీ ధరించదగిన డిజైన్లు వినియోగదారులను ఆకట్టుకుంటాయని, నాణ్యత, పారదర్శకతపై లైమ్‌లైట్ చూపుతున్న కట్టుబాటు విశాఖ వినియోగదారుల అభిరుచులకు సరిపోతుందని,ఈ స్టోర్ ఆధునిక, ప్రీమియం ఆభరణాల గమ్యస్థానంగా నిలుస్తుందని తెలిపారు.

# విజయవంతంగా స్కిల్ ప్యాలవర్ కార్యక్రమం

ఆరిలోవ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ తన స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన"స్కిల్ ప్యాలవర్" కార్యక్రమం మూడో దశను విజయవంతంగా నిర్వహించారు. "స్కిల్ ప్యాలవర్" మూడు దశల విద్యా నమూనాలో భాగంగా ప్రొఫెషనల్ ఎలెక్టివ్‌లు, పరిశ్రమ ఆధారిత నైపుణ్య కోర్సులతో అనుసంధానించబడింది. దశ-1, దశ-2, దశ-3(2025--26)లో విద్యార్థులకు వాస్తవ జీవన సవాళ్లు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, పరిష్కారాల రూపకల్పన విధానాలపై అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన తొలి విడతలో విద్యార్థులు తమ పూర్తి స్థాయి ప్రోటోటైప్‌లను పరిశ్రమ నిపుణుల ముందు ప్రదర్శించారు. ప్రాజెక్టులను ఆవిష్కరణ, సాంకేతిక దృఢత్వం, విస్తరణ సామర్థ్యం, ప్రాయోగిక ఉపయోగం వంటి ప్రమాణాల ఆధారంగా పరిశీలించారు. నిపుణులు విద్యార్థులకు విశ్లేషణాత్మక సూచనలు అందించి, తమ పరిష్కారాలను మరింత మెరుగుపరచుకునే మార్గాన్ని చూపించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డా.జి.పర్ధసారథి వర్మ మాట్లాడుతూ, "వ్యవస్థీకృత ప్రాయోగిక బోధన విద్యార్థులను పరిశ్రమలో ఎదురయ్యే సవాళ్లకు సిద్ధం చేస్తుందని, అకాడమిక్ విద్యను ప్రాక్టికల్ అనుభవంతో మిళితం చేయడం ద్వారా మా విద్యార్థులు నైపుణ్యంతో కూడిన, ఆత్మవిశ్వాసం కలిగిన వృత్తిపరులుగా అవతరిస్తున్నారు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రాజేష్ నేతృత్వంలో నిర్వహించగా, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డా. ఎ. శ్రీనాథ్ మార్గదర్శకత్వం వహించారు.

# సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం

## డిజిటల్ అరెస్ట్, స్టాక్ ఇన్వెస్ట్మెంట్ సైబర్ మోసాలకు మనీ మ్యూల్ అకౌంట్లు -ఆరుగురు అరెస్ట్ ..14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ -ప్రజలు మోసపూరిత ప్రలోభాలకు లోనవ్వద్దు: సీపీ శంఖబ్రత బాగ్చి



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

డిజిటల్ అరెస్ట్, స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్మెంట్, టాస్క్ బేస్డ్ జాబ్స్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలకు మనీ మ్యూల్ అకౌంట్లు సరఫరా చేస్తున్న ఆరుగురిని విశాఖపట్నం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సాంకేతిక ఆధారాలతో గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

### విదేశాల నుంచి ఆపరేషన్ -- లేయరింగ్ ద్వారా నిధుల మళ్లింపు

కంబోడియా, మయన్మార్, చైనా, పాకిస్థాన్, నైజీరియా వంటి దేశాల నుంచి ప్రధాన సైబర్ నేరగాళ్లు కార్యకలాపాలు నిర్వహిస్తూ, మోసపూరితంగా సేకరించిన డబ్బును వివిధ బ్యాంక్ ఖాతాల ద్వారా లేయరింగ్ చేసి యూఎస్డిటి, క్రిప్టో కరెన్సీ, హవాలా, ఫారిన్ రిమిటెన్స్ ద్వారా దేశాల దాటిస్తున్నారు. ఇందుకోసం ఫేక్ కంపెనీల పేరిట కరెంట్/కార్పొరేట్ ఖాతాలు తెరవించి అధిక కమిషన్ ఆశ చూపించి అకౌంట్లు సేకరిస్తున్నారు.

### ఏమిటి మనీ మ్యూల్ అకౌంట్?

సైబర్ నేరగాళ్లు మోసం ద్వారా సంపాదించిన డబ్బును తమ ఖాతాల్లో కాకుండా మూడో వ్యక్తుల బ్యాంక్ ఖాతాల ద్వారా తరలించి, వెంటనే ఇతర ఖాతాలకు మళ్లించే విధానమే మ్యూల్ అకౌంట్. ఈ విధంగా ట్రాన్సాక్షన్ ట్రైల్ క్లిష్టం చేసి దర్యాప్తు తప్పించుకునే ప్రయత్నం చేస్తారు.

### మూడు ప్రధాన కేసుల్లో కీలక పురోగతి

67 ఏళ్ల విశాఖపట్నం రిటైర్డ్ ప్రొఫెసర్‌ను ప్రభుత్వ అధికారులమని నటించి బెదిరించి విడతలవారీగా రూ.1.05 కోట్లు బదిలీ చేయించారు. దర్యాప్తులో భాగంగా ముగ్గురిని అరెస్ట్ చేశారు.అలాగే 84 ఏళ్ల రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి మోసం చేశారు.సుప్రీంకోర్టు, సీబీఐ అధికారులమని చెప్పి బెదిరించి ఆర్టిజిఎస్ ద్వారా రూ.89.30 లక్షలు బదిలీ చేయించారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేశారు.అలాగే మరో కేసులో స్టాక్ ట్రేడింగ్ పేరుతో రీ.48 లక్షల మోసం చేశారు. ఫేస్‌బుక్ ప్రకటన ద్వారా పెట్టుబడి పేరుతో మోసం చేశారు. "గ్లోబల్ టూర్స్ ఠ వెకేషన్స్" పేరిట కరెంట్ ఖాతా తెరచి లావాదేవీలు నిర్వహించిన ఇద్దరిని అరెస్ట్ చేసి ల్యాప్‌టాప్, పిఓఎస్ యంత్రాలు, క్యూఆర్ స్కానర్ సీజ్ చేశారు.

### అమాయకులను వలలోకి దించే పద్ధతులు

కమిషన్ ఆశ చూపించి ఖాతా వివరాలు సేకరిస్తారు.. ఏపీకే ఫైళ్ల ద్వారా ఓటిపి ఫార్వర్డ్ చేస్తారు.ఫేక్ కంపెనీల పేరిట కరెంట్ ఖాతాలను తెరుస్తారు. పార్ట్‌టైమ్ జాబ్స్, లోన్ యాప్స్, ట్రేడింగ్ గ్రూపుల ద్వారా మోసం చేస్తారు.

### ప్రజలు మోసపూరిత ప్రలోభాలకు లోనవ్వద్దు: సీపీ శంఖబ్రత బాగ్చి

సుప్రీంకోర్టు, సీబీఐ, పోలీస్ అధికారులు ఫోన్ ద్వారా డబ్బులు డిమాండ్ చేయరు. సందేహాస్పద కాల్స్ వచ్చిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలనీ లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలనీ, ఓటీపీ లు, ఆధార్, బ్యాంక్ వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు.కమిషన్ పేరుతో బ్యాంక్ ఖాతాలు ఇవ్వడం కూడా నేరమే అన్నారు. అమాయకులు మోసపూరిత ప్రలోభాలకు లోనుకాకూడదన్నారు. సైబర్ నేరాలపై కఠిన చర్యలు కొనసాగుతాయన్నారు.




## శ్రీవారి కల్యాణానికి దేవుని గుమ్మం ఆలయం ముస్తాబు



అనకాపల్లి ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

ఈనెల 27వ తేదీన అనకాపల్లి పట్టణం దేముని గుమ్మం శ్రీ స్వయంభు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి వార్షికళ్యాణం మహోత్సవం ఘనంగా జరుగుతాయని ఉత్సవ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీని వాసరావు, ఆలయ ఈవో కె చంద్ర తేజ, దేవాలయం అర్చకులు పులఖండం గిరిబాబు, పోలకండం విజయ బాబు తెలియజేశారు. ఈ మేరకు కళ్యాణం వివరాలు మంగళవారం తెలియజేశారు. 26 తేదీ రాత్రి 7 గంటలకు సంకల్పం, 27 తేదీ ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం స్వామివారిని ఊరేగింపుతో వెళ్లి మల్లవరపు వారి వీధిలో ఎదురు సన్నాహం రాత్రి 8-30 నిమిషములకు కళ్యాణ మహోత్సవం 28 వ తేదీ స్థాలీపాకం, మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద అన్న సమారాధన జరుగుతుందన్నారు. వచ్చేనెల1 వ తేదీ ఉదయం 6:30 నుండి సాయంత్రం 6:30 వరకు అర్ధ ఏకాహం సదస్య మహోత్సవం, 2వ తేదీ గరుడ వాహన సేవ అనకాపల్లి పురవీధులలో స్వామివారి ఊరేగింపు చోర సంవాదం 3వ తేదీ 9 గంటలకు ధ్వజావరోహణం, సాయంత్రం 7గం.కు డోలోత్సవం, 4న సాయంత్రం 6గంటలకు ద్వాదశకల శార్చన సప్త ప్రాకార సేవ పుష్పయోగోత్సవం, దర్పణ దర్శనం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

## లక్ష్మీనారాయణ నగర్‌లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం : మాదంశెట్టి నీలబాబు

అనకాపల్లి ఫిబ్రవరి 24 (ప్రభాత వార్త)



జీవీఎంసీ నిధులతో 84 వ వార్డు లక్ష్మీనారాయణ నగర్‌లో ఇప్పటివరకు అక్కడ సిమెంట్ రోడ్లు కాలువలు లేని చోట ప్రజలు అభ్యర్థన మేరకు కార్పొరేటర్ చిన్నతల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, మేయర్ పీలా శ్రీనివాసరావు అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జి పీలా గోవింద సత్యనారాయణ సిఫార్సులతో జీవీఎంసీ నుండి నిధులు మంజూరు చేయించారని, ఇప్పుడు కోటి రూపాయలు నిధులు విడుదల చేయడంతో సిమెంట్ రోడ్లు కాలువల నిర్మాణం పనులు మంగళవారం చేపట్టారని 84వ వార్డు ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు తలారి లక్ష్మీ ప్రసాద్ ప్రజలు ఇంజనీరింగ్ సిబ్బంది కాంట్రాక్టర్ కెపి జగన్నాథం నాయుడు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల వినతులు స్వీకరించిన జనసేన నేత రామ్‌కి



అనకాపల్లి ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త)

స్థానిక జనసేన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వినతులు అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రామ్‌కి మంగళవారం స్వీక రించారు. అనకాపల్లి నియోజకవర్గ ప్రజలు, కూటమి కార్యకర్తలు నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్వీకరించారు. సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన సానుకూలంగా స్పందించి మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలోనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ప్రజలకు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని ఆయన తెలియజేశారు.

## మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం.. మహిళలు ఆవేదన

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



నక్కపల్లి పట్టణంలోని సాయి నగర్ కాలనీలో కొద్ది రోజులుగా మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నామని సోమవారం స్థానిక పంచాయతీ అధికారులకు బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కోసూరు శ్రీనివాసరావు నాయ కత్వంలో కాలనీకి చెందిన శారద, తనుజ తదితరులు వారి దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లో మంచినీరు సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన పంచాయితీ అధికారులు నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి సంస్కరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



## స్వచ్ఛ రథం ప్రారంభం

(నక్కపల్లి, ప్రభాతవార్త)

ప్లాస్టిక్ తో పాటు తుప్పు పట్టిన ఇనుప వస్తువులు, ఇతర ప్లాస్టిక్ సామాన్లు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథం ను ఎంపీడీవో చైతన్య ఆధ్వర్యంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చైతన్య మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర అనే కార్యక్రమంలో భాగంగా ఎక్కడా చెత్త, పాతబడిన వస్తువులు ప్రధానంగా ప్లాస్టిక్ కు సంబంధించినవి రోడ్లపై కనిపించకుండా ఉండేందుకు వాటిని సేకరించి నిర్మూలించేందుకు అన్ని గ్రామాల్లో ఈ స్వచ్ఛ రథం ఉపయోగపడుతుందని చెప్పారు. డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు ఆధ్వర్యంలో ఈ స్వచ్ఛ రథం అన్ని గ్రామాల్లోకి వెళ్లి ఆ రథం నిర్వహకులు ఇళ్ల వద్ద నుంచి ఆ వస్తువులు సేకరించిన సమయంలో వాటి సామర్థ్యాన్ని బట్టి కొన్ని వస్తువులు ఇస్తూ ప్లాస్టిక్ నిషేధం పైన అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఇది ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రతి గ్రామం ప్లాస్టిక్ రహిత గ్రామంగా కనిపించాలని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో దెందుకూరి సీతారామరాజు ,టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, బిజెపి మండల శాఖ అధ్యక్షులు పోలినాటి నానాజీ, టిడిపి జిల్లా నాయకులు కురందాసు నూకరాజు ,సర్పంచులు పొడగట్ల వెంకటేశ్వరరావు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు మునిషా బేగం, దార్ల కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, కొండ్రకాసులు ఉన్నారు.

## చట్టాల పట్ల అవగాహన ఉండాలి..

### చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యాలకు చేరుకోవాలి: " ఎస్సై" సాహిబా అంజుమ్"

(నక్కపల్లి, ప్రభాతవార్త )



సమాజం, తల్లిదండ్రులు గర్వపడే విధంగా ప్రతి ఒక్కరు చదవాలని అదే సందర్భంలో చట్టాలపై అవగా హన కలిగి చెడు అలవాట్లకు దూరంగా మంచి సమా జంలో మంచి విద్యార్థులుగా చదువుకొని లక్ష్యాలను చేరుకోవాలని మహిళ ఎస్సై సాహిబా అంజుమ్, సీఐ జూరెడ్డి మురళి ఆధ్వర్యంలో విద్యార్థినిలకు సూచిం చారు. సోమవారం మండలంలోని గుడిచర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థినిలతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా డిఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస్, సీఐ జూరెడ్డి మురళి ల ఆధ్వర్యంలో నక్కపల్లి ఎస్సై సాహిబా అంజుమ్, మహిళా పోలీస్ లతో కలిసి ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం పాల్గొనే ముందు పాఠశాల పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయుల తో ఆమె మాట్లాడారు . ఈ సందర్భంగా విద్యార్థినులతో స్నేహపూర్వకంగా మాట్లాడి, పోక్సో చట్టానికి సంబంధించిన తన అనుభవాలను వివరించారు. పిల్లలపై లైంగిక నేరాల నివారణలో పోక్సో చట్టం ఎంత శక్తివంతమో, దాని కింద ఉన్న కఠినమైన శిక్షల గురించి సంక్షిప్తంగా వివరించారు. విద్యార్థులు ఏ విషయాలు పట్ల ఎటువంటి జాగ్రత్తలు వహించాలి ఏ విధంగా ఉండాలి అనే విషయంపై గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, బాలలపై లైంగిక దాడుల నివారణ, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, విద్య యొక్క ప్రాముఖ్యత నైతిక విలువలు, విద్యార్థినులు తమ చదువుపై దృష్టి పెట్టాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలియజేస్తూ, ఎలాంటి అనుచిత ప్రవర్తన ఎదురైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే తెలియజేయాలని సూచించారు.



## బిగ్ హెల్ప్ సహాయం

(నక్కపల్లి, ప్రభాతవార్త )

మండలంలోని ఉద్దండ పురం జిల్లా పరిషత్ ఉన్నత విద్యార్థులకు బిగ్ హెల్ప్ సంస్థ 10,000 రూపాయల విలువ కలిగిన స్పోర్ట్స్ మెటీరియల్ సోమవారం అందజేశారు. అదనపు ఎంఈఓ దొర కృతజ్ఞతలు.

## సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

(ఎస్ రాయవరం ఫిబ్రవరి 24 ప్రభాత వార్త)



మండలంలో ధర్మవరం అగ్రహారం చెరుకు పరిశోధన కేంద్రం సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ ఆంజనేయస్వామి. సుబ్ర మణ్య స్వామి గణపతి స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం భక్తులు ఆలయమునకు చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొని. స్వామివారి దర్శించుకొని స్వామి వారి తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు. డాక్టర్ కొండ్ర రామారావు. శివప్రసాద్. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదు

అనకాపల్లి రూరల్ ఫిబ్రవరి 24 :(ప్రభాత వార్త)



ఆర్టీసీ సంస్థ సంబంధించి నాలుగు డిపోలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం పై యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం ఎన్ ఎం యు ఏ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఏ ఎన్ రావు, పి సుధాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ 12 డిపోలలో ఎలక్ట్రికల్ బస్సులు పినాకిల్ సంస్థ ద్వారా నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో నాలుగు డిపోల షెడ్యూల్, సిబ్బందిని వేరొక చోటికి బదిలీ చేసి ఆయా డిపోలను పూర్తిస్థాయిలో ప్రైవేటు వారికి అప్పగించాలని విడుదల చేసిన ఆదేశాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు డిపో లో ఉన్న ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై డిపో గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా ఎంవిఆర్ కుటుంబం

### కశింకోట గౌరీ పరమేశ్వరుల కమిటీకి ఉదారత

అనకాపల్లి, పిబ్రవరి 24, ప్రభాతవార్త



స్థానికంగా సేవా కార్యక్రమాల్లో ముందుండే ఎం.వి.ఆర్ కుటుంబం మరోసారి తమ ఔదా ర్యాన్ని చాటు కుంది. నియోజకవర్గంలోని కశిం కోటలో ఇటీవల ఘనంగా నిర్వహించిన గౌరమ్మ పండుగ విజయవంతంగా పూర్తికావడంతో ఆలయ ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పట్టణంలోని నరసింగ రావుపేట పరిధిలో గల ఎంవిఆర్ ప్రధాన కార్యాలయానికి విచ్చేసి, ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) తనయుడు ముత్యాల రాజేష్ బాబును మర్యాద పూర్వకంగా కలిసారు.పండుగను విజయవంతంగా నిర్వహించడంలో ఎంవిఆర్ ఇచ్చిన భరోసాకు, సహకా రానికి వారు రాజేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.గౌరమ్మ పండుగ ను ఈసారి ఎంతో భక్తి శ్రద్ధలతో, గ్రామ ప్రజల ఐక్యతను ప్రతిబింబించేలా నిర్వహించామని ఆలయ ప్రతినిధులు రాజేష్ బాబుకు తెలిపారు. దీనిలో భాగంగా,ఎం.వి.ఆర్ తనయుడు రాజేష్ బాబు గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ సభ్యులకి 50 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. పండగ కార్యక్రమాలు అవసరమైన ఏర్పాట్లు దిగ్విజయంగా నిర్వహించిన దానిలో భాగంగా, ఈ ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రాజేష్ బాబును అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజానికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న ఎం.వి.ఆర్ కుటుంబం సేవా భావం అభినందనీయం అని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు, కమిటీ సభ్యులు రాజేష్ బాబుకు సాలువా కప్పి జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులతో పాటు ఎం వి ఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందితుడు అరెస్టు

### 9 తులాలు బంగారు నగలు స్వాధీనం



అనకాపల్లి ఫిబ్రవరి 24 (ప్రభాత వార్త)

సచివాలయం ఉద్యోగినని చెప్పి పలు ఇండ్లలో ఒంటరిగా ఉన్న మహిళలను మోసగించి బంగారు నగలు సత్కరించిన పాత నేరస్తుడిని అనకాపల్లి పట్టణ పోలీసులు మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ గూడ్స్ రోడ్డు వద్ద పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలను డిఎస్పి ఎం శ్రావణి పట్టణ పోలీస్ స్టేషన్ లో తెలియజేశారు. కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకొండ పాలెం గ్రామానికి చెందిన ఎల్లమెలి వెంకటరమణ(42) జల్సా ఖర్చులకు అలవాటు పడి డబ్బు కోసం ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న మహిళలను గుర్తించి సచివాలయం ఉద్యోగినని మీకు ప్రభుత్వ పథకాలు అందాలంటే మీ వివరాలు తెలియజేయాలని నమ్మబలుకుతూ మీ ఫోటో అప్లోడ్ చేయాలని చెప్పి ఫోటో తీస్తున్న క్రమంలో మెడలో బంగారు వస్తువులు ఉంటే పథకాలు రావని వాటిని తీసి పక్కన పెట్టాలని చెప్పేవాడు. ఈ క్రమంలో మహిళలు తన మెడలో ఉన్న వస్తువులను తీసి పక్కన పెట్టి ఫోటో తీసుకొని వివరాలు తెలియజేసే క్రమంలో పక్కనున్న బంగారు వస్తువులను సత్కరించేవాడు. ఇదే అలవాటును వివిధ జిల్లాల్లోని చోరీలకు పాల్పడుతూ 42 కేసులు పలు పోలీస్ స్టేషన్లో నమోదయినట్లు పోలీసులు గుర్తించారు. గత ఏడాది డిసెంబర్ నెలలో అనకాపల్లి కర్ణలా వీధి లో ఇదే తరహాలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. దీనిపై అప్పట్లో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం నేరస్థుడు వెంకటరమణ పట్టణ పోలీసులకు చిక్కాడు. నిందితుడు వద్ద నుండి 12 లక్షలు విలువైన 9 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును చేదించిన పట్టణ సీఐ ప్రేమ్ కుమార్, ఎస్సైలు అల్లు వెంకటేశ్వరరావు, కే సంతోష్ కుమార్ లను డీఎస్పీ ఎం శ్రావణి అభినందించారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కొక్కిరాపల్లి గురుకుల పాఠశాల వద్ద ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు హాజరయ్యే విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తున్నారు. పరీక్షా కేంద్రాల ముఖద్వారం దగ్గర పట్టణ, రూరల్ పోలీసులు విద్యార్థులను తనిఖీ చేసి లోపల కనిపిస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 365 మంది విద్యార్థులకు గాను 359మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెంట్ బి భాగ్యవతి, డిపార్ట్మెంట్ ఆఫీసర్ సిహెచ్ కృష్ణంరాజు తెలిపారు. కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో 592 మంది విద్యార్థులకు గాను 579మంది పరీక్షలకు హాజరైనట్లు సి ఎస్ టి హరిప్రసాద్, డివో సత్యనారాయణ తెలిపారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

అనకాపల్లి ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



కర్నూలులో న్యాయవాది పవన్ పై పోలీస్ అధికారి దాడిని నిరసిస్తూ అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విధులను బహిష్కరించారు. ఇలాంటి వాటిని పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. అధ్యక్షులు పిల్ల హరి శ్రీనివాసరావు, సెక్రెటరీ బంధం వెంకటరమణ, ఉపాధ్యక్షులు సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పక్కన ఉన్న వ్యభిచార గృహాలను నిర్మూలించాలి



### ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు...

ఎలమంచిలి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

జాతీయ రహదారి మర్రిబంద సమీపంలో గల రోడ్డుకి ఇరువైపులా బహిరంగంగా వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నారని వీటి పై చర్యలు తీసుకోవాలంటూ జంపపాలెం గ్రామానికి చెందిన చాకలి నూకరాజు ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. మండలంలో పలు ప్రాంతాలలో రాత్రి పగలు సమయం లేకుండా జాతీయ రహదారి ఆనుకుని ఉండే గ్రామాలలో వ్యభిచార గృహ నిర్వహిస్తున్నారని వీటి పై ఫిర్యాదులు ఉన్న స్థానిక పోలీసులు పట్టించుకోవడంలేదని అంటూ ప్రత్యేక అధికారి దర్యాప్తు చేయించి వ్యభిచార గృహాలను నిర్మూలించాలని కోరారు. ఈ సందర్భంగా చాకలి నూకరాజు మాట్లాడుతూ ఈ ఫిర్యాదు ప్రజాహితం కోసమేనని ప్రధానంగా యువత పెడదోవ పడుతున్నారని అన్నారు. ఈ వ్యభిచార గృహాలను తొలగించాలని కోరారు.

## బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాల లక్ష్యంగా ప్రత్యేక చర్యలు

### జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



జిల్లాలోని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల, గ్రామ, వార్డు సచివాలయ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశుభ్రతను కనుచూపుమేర నిలుపుదల చేయడానికి 24 మండలాల్లో ప్రతి మండలానికి 5 గ్రామాలు చొప్పున ఎంపిక చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా రావికమతం, రాంబిల్లి, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలో పనిచేస్తున్న ఎంపీడీఓలు, ఉప ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. గ్రామాలను పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా ఉంచడం, ప్రతి ఇంటి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావడం, గ్రామంలోని అన్ని వీధిదీపాలు వెలిగేలా చూడడం, మురుగు కాలువలను శుభ్రపరచడం, తడి చెత్తను చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించి నాడేప్ పిట్స్‌లో వేయడం, ప్రతి ఇంటికి శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సందీప్, జిల్లా గ్రామీణ నీటి పారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ అనిల్ కుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ సమన్వయ అధికారి మంజుల వాణి, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

## పట్టణంలో లాడ్జిలను తనిఖీ చేసిన సీఐ ధనుంజయరావు...

ఎలమంచిలి ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



పట్టణంలో గల లాడ్జిలను మంగళవారం సాయంత్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయరావు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాడ్జి నిర్వాహకులతో లాడ్జిలో ఉండే వారి పూర్తి వివరాలను తీసుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లాడ్జిలు తనిఖీలు పట్టణ ఎస్సై సావిత్రి, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై మట్టి నమూనా సేకరణ అవగాహన సదస్సు

(ఎస్ రాయవరం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త)



మండలంలోని చిన గుమ్ములూరు గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం చేసే విధానంపై మట్టి నమూనా సేకరణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సి హెచ్ లచ్చన్న ఆదేశాలు మేరకు ప్రకృతి వ్యవసాయ మట్టి నమూనా ఎలా తీయాలి అనే వాటిపై అవగాహన కల్పించడం. అలాగే బయో రిసోర్స్ సెంటర్ బి ఆర్ సి వెరిఫై చేయడం ఆ ఆ దుకాణాల్లో లో సీజన్ ప్రకారం ఎటువంటి కషాయాలు ఉండాలి అనే వాటిపై అవగాహన. రబీ సీజన్లో ఆర్చర్స్ కి కావలసిన కషాయాలు నీమాస్త్రం పుల్లటి మజ్జిగ బ్రహ్మాస్త్రం మొదలైన కషాయాలు బి ఆర్ సి సెంటర్ లో రైతులకు అందుబాటులో ఉండాలని సూచనలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎఫ్ ఏ వర్మ , ఎన్ ఎఫ్ ఏ రామ, గోవింద్ ఏం టి శివ , ఎఫ్ ఎం టి కనకరావు, మండల ఇన్చార్జి రాము, రైతులు పాల్గొన్నారు.

## నర్సీంగపల్లి ఘనంగా తలుపులమ్మ తల్లి పండుగ

గొలుగొండ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



నర్సీంగపల్లి గ్రామం లో తలుపులమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత పండగ కావడంతో గ్రామస్తులు వారి కుటుంబ సభ్యులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన బంధువులు అమ్మవారిని దర్శించుకొని అర్పించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యం లో భక్తులకు ఎటువంటి ఏర్పాటు చేసి భారీ విద్యుత్ అలంకరణ పలు సాం స్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ పండుగలో అమ్మవారి ఘటాలు ఊరేగింపుగా బయలుదేరిన అమ్మవారిని ఇంటిఇంటికి డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల ఘనంగా ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారికి ఇష్టమైన డప్పుల సంబరంతో గ్రామం మార్మోగింది. పిల్లలు పెద్దలు మహిళలు అమ్మవారికి కానుకలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పండగ మహోత్సవాన్ని ఆస్వాదించారు.



## కల్లుగీత కార్మికులపై అసెంబ్లీలో చర్చించిన ఎమ్మెల్యే లోకం నాగ మాధవి



ఎస్.రాయవరం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

మండలంలో గుర్రాజుపేట గ్రామంలో సర్దార్ గౌతు లచ్చన్న, దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహముల వద్ద కల్లుగీత కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన విజయ నగరం జిల్లా నెల్లిమర్ల శాసనసభ్యులు లోకం నాగ మాధవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. మంగళవారం గీత కార్మికుల సమావేశమయ్యారు. గీత కార్మికుల రాష్ట్ర యాత కమిటీ సభ్యులు గుత్తుర్తి పాండురంగ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికుల వృత్తి సమయంలో కల్లుగీత, కొబ్బరి దింపు, కి వెళ్లినప్పుడు, కరెంట్,తేనెటీగలు, కందిరీగలు, విషపురుగులు, మోకు బేలన్స్, అదుపు తప్పడం వలన చాలా మంది కార్మికులు ప్రమాదానికి గురికావడం కాకుండా చనిపోతున్నారు. 10 లక్షల చంద్రన్న భీమా అమలు చేయాలని మా గీత కార్మికుల అభిమాన హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదర్యంలో మాకు ఇచ్చిన మాట ప్రకారంగా గీత కార్మికుల 25 సొసైటీలకి ఒక కళ్యాణ మండపం పూర్తి చెయ్యించుకుంటామ న్నారు. ప్రభుత్వం వచ్చిన రోజులలో గీత కార్మికులకి గుర్తింపు ఇచ్చిందని కూటమి ప్రభుత్వమే అని నీరా ప్రాజెక్ట్. 10లక్షల ఎక్స్‌గ్రేసియా 45 సంవత్సర దాటిన వారికి పెంక్షన్ వృత్తి రసమయంలో భరోసా, ఆదరణ త్రీ ద్వారా మోటార్ సైకిళ్ళు కంపెనీ వలన తాటి ఈత చెట్లు తీసివేయడం వలన ఉపాధి కోల్పోయిన గీత కార్మికులని ఆదుకోవాలని విజయవాడలో నిన్న జరిగిన శెట్టి బలిజ కార్పోరేషన్ సమావేశంలో ఈ సమస్యలు పై గీత కార్మికుల సారధి చైర్మన్ కుడిపూడి సత్తిబాబు బోర్డు సభ్యులు తీర్మానం చేసి ప్రభుత్వంకి నివేదిక పంపిం చడంజరిగిందని. గీత కార్మికుల ప్రతినిధిలు నియోజకవర్గ కన్వీనర్ పిల్లి రాంబాబు దుంగా అప్పలరాజు, నూకరాజు, అండిబోయిన అప్పారావు కొరుప్రోలు హైస్కూల్ చైర్మన్ బత్తిన సత్యనారాయణ, హాజరయ్యారు.

## అందుబాటులోకి రహదారి

(నక్కపల్లి, ప్రభాతవార్త)



మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మామిడివాని పాలెం స్మశానము రోడ్డు గతంలో పై విధంగా బురదతో కూరికపోయి ఉండగా నేడు కూటమి ప్రభుత్వంలో హోంమంత్రి అనితమ్మ చొరవతో దానిని బాగు చేసి సిమెంట్ రోడ్డు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్ర హోం మంత్రి అనిత కు పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులతో మహిళ ఎస్సై సాహిబ్ అంజుమ్ ముఖాముఖి

(నక్కపల్లి ,ప్రభాతవార్త



మండలంలోని చిన్నదొడ్డి గళ్ళు ఉన్నత పాఠశాల విద్యార్థులతో మహిళ ఎస్సై సాహిబ్ అంజుమ ముఖా ముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు మందు వాడకం దాని తర్వాత వచ్చే పరిణామాల గురించి బాగా చదువుకుంటే భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాలు పొందుతారని అన్నారు.పిల్లలు గంజాయి వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని లేదంటే జీవితంలో సర్వం కోల్పోతారని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.బాలాజీ, ఆంగ్ల ఉపాధ్యాయులు వై వి రమణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపమాక వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఏషియన్ పెయింట్స్ "జిఎం చటర్జీ"

నక్కపల్లి, ప్రభాతవార్త



మండలంలోని ఉపమాక వెంకటేశ్వర స్వామిని మంగళవారం సి ఎస్ ఆర్ నిధుల ద్వారా ఆలయంలో జరుగుతున్న పనులు పర్యవేక్షించిన అనంతరం ఎషియన్ పెయింట్స్ జిఎం మౌనిక్ చటర్జీ దర్శించు కున్నారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు నిర్వహించారు. పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి స్వామి వారి చిత్రపటాన్ని ఆయనకి అందజేశారు. ఆంధ్రప్రదేశ్ హోం మంత్రివర్యులు వంగలపూడి అనిత కోరిక మేరకురెండు చెరువులు కి వాకింగ్ ట్రాక్, భక్తులు కూర్చొని చెరువుని చూసేందుకు అనువుగా బెంచులు,సోలార్ లైట్స్, చెరువుకి నీరువచ్చే కాలువ అభివృద్ధి చేపట్టి ఆలయ అభివృద్ధి కి అన్నిరకాలుగా సహాయ పడుతామని ఆలయ నిర్వహకులకు స్థానికులకు తెలిపారు . ఆయన వెంట కంపెనీ ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి శ్రీను, తోలేటి శ్రీను, కొప్పిశెట్టి వాసు తదితరులు ఉన్నారు.



## మొద్దులగూడెం అగ్ని బాధితులకు అండగా గ్రామస్తులు



వి.ఆర్.పురం,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

మండలంలోని రాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలోగల మొద్దులగూడెం అగ్ని బాధితులకు, మాజీ సర్పంచ్, స్థానిక యువకుడు కుంజా.రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు అండగా నిలిచారు. ప్రకృతి ప్రకోపానికి నిలువ నీడ కోల్పోయిన బాధితులకు తామున్నామని భుజం తట్టారు. గ్రామంలోని కుటుంబాల వారందరు తలా కొంత వేసుకొని నగదు కూడా బెట్టారు. అట్టి నగదుతో బియ్యం, పప్పులు, నిత్యవసర వస్తువులు, గృహ వినియోగ సామాన్లను కొనుగోలు చేశారు. ఈ మేరకు మంగళవారం బాధితులు సోడె శరత్ కుమార్, సోడె.సరోజిని లకు గ్రామస్తులు అంతాకలిసి రమేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ విషయం తెలిసిన వారందరూ, మాజీ సర్పంచ్‌లు రమేష్, జానయ్యలు చేసిన సహాయం చిన్నదే కావచ్చు కాని, వారి ఆలోచన గొప్పదన్నారు. దురదృష్టవశాస్తు ఇటువంటి ఘటనలు చోటుచేసుకుకున్నప్పుడు, రమేష్, జానయ్యల ప్రతి ఒక్కరు స్పందించాల్సిన అవసరం ఉంది. మాజీ సర్పంచ్ మడకం జానయ్య, కుంజా గాంధీ, తెల్లం సాయిబాబు, కారం దేవరాజు, ముల్లి శ్రీనివాస్, సొడి శ్రీ రామూర్తి, మడకం ముత్తయ్య పాల్గొన్నారు.

## అంగన్వాడీల పోరాటం న్యాయసమ్మతమైనది : యుటిఎఫ్

వి.ఆర్.పురం,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని, అంగన్వాడీల పోరాటం న్యాయసమ్మత మైనదని, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సోడి.నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం రేఖపల్లి లోని అంగన్వాడీ దీక్షా శిబిరాన్ని యుటిఎఫ్ మండల శాఖ నాయకులు సందర్శించి, దీక్ష పరులకు సంఘీబావం తెలిపారు. నాగేశ్వ రావు అంగన్వాడీలను ఉద్దేశించి మాట్లాడారు. ఐక్య పోరాటాలతోనే న్యాయ మైన హక్కుల సాధన సాధ్యమన్నారు. ఐక్యంగా ఉద్యమించి హక్కులు సాధించుకోవాలని ఆయన పిలువు నిచ్చారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పార్స్ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రెండు రోజులపాటు రిలే నిరహార దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. రెండవ రోజు యుటిఎఫ్ తోపాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు అంగన్వాడీల దీక్షా శిబిరాలను సందర్శించి, వారికి మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జగదీష్, రామకృష్ణ, బాబు, సిపిఎం మండల కార్యదర్శి పులి.సంతోష్ కుమార్, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం.రాజులు, నాయకులు సోయం.చిన్నబాబు, పంకు.సత్తిబాబు పాల్గొన్నారు.

## జి.ఎస్.డబ్ల్యూ.ఎస్ జిల్లా అధికారిగా తూతిక శ్రీనివాస విశ్వనాథ్ నియామకం

రంపచోడవరం ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాకు జిల్లా గ్రామ, వార్డు సచివాలయం అధికారిగా ద్వామా ఏపీడీ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ నియమించారు. శ్రీనివాస విశ్వనాథ్ ఇప్పటికే జిల్లాలో కీలక విభాగమైన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నోడల్ అధికారిగా సేవలు అందిస్తున్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, ప్రభుత్వ సేవలు, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల సమగ్ర అవగాహన కలిగి ఉండడం, వివిధ శాఖలను సమన్వయం చేయడంలో ఉన్న నేర్పరి తనం ముఖ్యంగా సమస్యలు పరిష్కారంలో చురుకైనా పాత్ర పోషించడం వెరసి శ్రీనివాస విశ్వనాథ్ పేరును జి.ఎస్.డబ్ల్యూ.ఎస్ జిల్లా అధికారిగా నియామకానికి కారణమని తెలిసింది. సందర్భంగా శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలను స్వర్ణ పంచాయితీలుగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని, వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఆలోచనను ప్రజలలోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తానన్నారు. గ్రామ సచివాలయం సిబ్బంది సహకారంతో పోలవరం జిల్లాను అన్ని ప్రాధాన్యత అంశాలలో ముందువరసలో ఉంచుతానని అన్నారు. తన మీద నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన కలెక్టర్ దినేష్ కుమార్, పిఓ, ఐటిడిఏ బచ్చు స్మరణ్ రాజ్ కు శ్రీనివాస విశ్వనాథ్ ధన్యవాదములు తెలిపారు.

## పులి సంచరిస్తుంది..ప్రజలు సురక్షితంగా ఉండాలి

రంపచోడవరం ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలో పులి సంచరిస్తున్నట్లు వచ్చిన సమాచారం వాస్తవమేనని జిల్లా అటవీ శాఖ అధికారి శివకుమార్ ధ్రువీకరించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత కొద్ది రోజుల క్రితం కూర్మాపురం గ్రామంలో పులిని పట్టుకోవడం జరిగిందన్నారు. దానిని జంతు సంరక్షణ కేంద్రానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించి ట్రాకర్ ఏర్పాటు చేసి పాపికొండలు అటవీ ప్రాంతంలో వదలడం జరిగిందన్నారు. పులి అక్కడినుండి ప్రయాణిస్తూ ప్రస్తుతం రంపచోడవరానికి 10 కిలోమీటర్ల అటవీ ప్రాంతాల్లో సంచరిస్తుందన్నారు. గిరిజన ప్రజలు పులి సంచారంపై ఎటువంటి భయాందోళనలకు గురికావద్దన్నారు. పులి సంచారంపై పూర్తి నిగా వ్యవస్థ ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. పులి సంచారం ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు ఒంటరిగా ప్రయాణాలు చేయవద్దని ముఖ్యంగా రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆవులు మేకలు వంటి పెంపుడు జంతువులకు పులి వల్ల ఏదైనా హాని జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

### ( 2వరోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు)



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 24, ప్రభాత వార్త

రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కారానికై రాజవొమ్మంగి ఐసీడియస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద 2వ రోజు ప్రాజెక్టు స్థాయి రిలే నిరాహార దీక్షలను అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి నిర్మల మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో అంగన్వాడి వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. అధిక పని భారమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల ప్రకారంగా నెలకు రూ 26 వేలు కనీస వేతనంగా ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి చెల్లించాలని సి.ఐ.టి.యు జిల్లా ఉపాధ్యక్షులు పి. రామరాజు అన్నారు. ఈసందర్భంగా జిల్లా నాయకులు కె. వెంకటలక్ష్మి మాట్లాడుతూ పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికై ప్రాజెక్టు స్థాయి చేపట్టిన రిలే దీక్షలు సందర్భంగా అంగనవాడి బడులకు అంతరాయం కలగకుండా అంగనవాడి ఆయాలతో కలిసి విధులు నిర్వహిస్తూ రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని,నిరాహార దీక్షల సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు కుమారి, సత్యవతి,మేరీ పాల్గొన్నారు.

## అమృత్‌సర్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు పాడేరు గిరిజన విద్యార్థినుల ఎంపిక

### శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

పాడేరు,ఫిబ్రవరి24,ప్రభాతవార్త



దేశవ్యాప్తంగా నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భాగంగా అమృత్‌సర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలకు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజక వర్గానికి చెందిన గిరిజన విద్యార్థినులు ఎంపిక కావడం ఆనందకర విషయంగా నిలిచింది. పాడేరు మండలం గుత్తుల పుట్టు గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొనడానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ కోచ్ మరియు నాంది ప్రోగ్రాం ఆఫీసర్‌ను వైజాగ్ ఎయిర్‌పోర్ట్‌లో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ కలిసి విద్యార్థినులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.గిరిజన ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. అమృత్‌సర్‌లో జరుగనున్న ఈ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి తమ పాఠశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన



గూడెం కొత్తవీధి ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త

మండలంలోని రంతాడ సచివాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు దాని సేవల వివరాలను రైతులకు అవగాహన పరిచారు. ఈ సందర్భంగా గూడెం కొత్త వీధి ఎంపీడీవో రమణబాబు మాట్లాడుతూ సచివాలయాల్లో అందించే సేవలను మీరు ఇంట్లోనే వాట్సాప్ ద్వారానే అనేక సేవలు పొందవచ్చని ఆయన తెలిపారు. సచివాలయం చుట్టూ తిరిగే కన్నా మీరు ఇంట్లో కూర్చొని అనేక బిల్లులు అనేక ధ్రువపత్రాలు పొందవచ్చని వీటిపై పూర్తిగా ప్రజలు, రైతులు అవగాహన పొంది సేవలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ్, సచివాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ సమ్మిట్‌లో దేశ ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరించిన కాంగ్రెస్ గుండాలను అరెస్టు చేయాలి

### భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా అల్లూరి జిల్లా విభాగం ఆధ్వర్యంలో పాడేరులో నిరసన




పాడేరు,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఏఐ సమ్మిట్ లో దేశ ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరించిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ అల్లూరి సీతా రామరాజు జిల్లా విభాగం పాడేరులో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఐటిడిఏ ముందు ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ జిల్లా మహిళా మోర్చ బేతాళ కేజీయా రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఏఐ సమ్మిట్ లో దేశానికి తలవంపులు తెచ్చేలా ప్రవర్తించిన కాంగ్రెస్ గుండాలు అందరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసే ప్రయత్నంలో పోలీసులు నిరసన కారులను అడ్డుకున్నారు. ఒక దశలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బిజెపి అల్లూరి జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి మాట్లాడుతూ ఢిల్లీలో ఏఐ సమ్మిట్ నిర్వహణపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీ గూండాల అర్ధనగ్న ప్రదర్శనతో ప్రపంచానికి ఎటువంటి సందేశం ఇవ్వబోతున్నారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. దేశ ప్రతిష్టను మసకబార్చేలా కాంగ్రెస్ వ్యవహరించిన తీరుపై దేశమంతా అసహ్యించుకుంటుందన్నారు. ప్రతి భారతీయుడు దీనిని ఖండించాలని ఆమె సూచించారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బేతాళ కేజీయా రాణి, బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక, జిల్లా మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రాస పాపిటరాజు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు తాంగుల సత్యవతి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ లక్ష్మీ, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి వంతల లక్ష్మీ, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు గోపాల పాత్రుడు, ఉబ్బేటి లక్ష్మీ, మహిళా మోర్చా ఉపాధ్యక్షులు టి. సూర్య కళ, సీతమ్మ, వంతాల నాగేశ్వరరావు, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అడ్డతీగలలో సచివాలయ సిబ్బందికి సామర్థ్యాభివృద్ధి శిక్షణ

అడ్డతీగల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్ (పి ఎం యు) ఆధ్వర్యంలో అడ్డతీగల మండలంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ/వార్డు సచివాలయ (ఎస్ జి ఎస్ డబ్ల్యు) వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు మంగళవారం ఒక రోజు సామర్థ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రజలకు అత్యవసరమైన ధృవీకరణ పత్రాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా లబ్ధిదారులకు అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణా శిబిరంలో రిసోర్స్ పర్సన్లు వివిధ కీలక అంశాలపై సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రజలకు అత్యంత కీలకమైన ఎల్.ఆర్.బి.డి, మరియు రైస్ కార్డుల జారీ ప్రక్రియ గురించి ఎం. సంధ్య సవివరంగా మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ, ఆమోదించడం, మరియు తిరస్కరణ (రిజెక్షన్స్) కు దారితీసే కారణాలను వివరిస్తూ.. ఫీల్డ్ స్థాయిలో సాధారణంగా ఎదురయ్యే సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలపై సిబ్బందికి స్పష్టత ఇచ్చారు. అనంతరం మహిళలు, కుటుంబ సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంపై పీ. చంద్రకళ అవగాహన కల్పించారు. ఈ పథకం ఉద్దేశం, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు ప్రక్రియ, పారదర్శకమైన లబ్ధిదారుల ఎంపిక విధానం తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ప్రభుత్వ సేవలను, లబ్ధిదారులను అనుసంధానించడంలో అత్యంత కీలకమైన ఆధార్ సేవలపై ఆర్. మోహన్ రావు సిబ్బందికి లోతైన, ప్రయోగాత్మక (ప్రాక్టికల్) శిక్షణను అందించారు. కొత్త ఆధార్ నమోదు ప్రక్రియ, డెమోగ్రాఫిక్ మరియు బయోమెట్రిక్ అప్‌డేట్స్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాంకేతికంగా ఎదురయ్యే సాధారణ లోపాలు, వాటిని సులువుగా సరిదిద్దే మార్గాలపై ఆయన విశ్లేషించారు. ఈ శిక్షణ ద్వారా క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బందికి పథకాల అమలుపై మరింత స్పష్టత ఏర్పడిందని, తద్వారా రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసం పాల్గొన్నారు.

## మార్చ్ 5వ తేదీ నుంచి ఉచిత భూముల రీ-సర్వే : రైతులు సహకరించాలని అధికారుల విజ్ఞప్తి




అడ్డతీగల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

అడ్డతీగల పరిసర ప్రాంతాల్లో ఈ నెల 5వ తేదీ నుంచి భూముల రీ-సర్వే కార్యక్రమం ప్రారంభం కానుందని తహసీల్దార్ దొరకయ్య, గ్రామ సెక్రటరీ రాంబాబు వెల్లడించారు. ఈ రెండవ విడత సర్వేలో మొత్తం 31 గ్రామాలకు చెందిన దాదాపు 30 వేల ఎకరాల భూమిని సర్వే చేయనున్నారు. 5వ తేదీన ప్రారంభమయ్యే ఈ సర్వే వారం రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. గతంలో ఒక్కో సర్వే నెంబర్ గుర్తించడానికి రైతులకు రూ. 600 వరకు ఖర్చయ్యేదని, కానీ ఇప్పుడు ఈ ప్రక్రియను పూర్తిగా ఉచితంగా చేపడుతున్నామని అధికారులు తెలిపారు. మునుపటిలా చైన్లతో కాకుండా, మరింత పక్కాగా టేపుల ద్వారా ఈ కొలతలు జరగనున్నాయి. ఈ సర్వేను విజయవంతం చేయడానికి రైతులందరూ తమ సర్వే నెంబర్ల వివరాలతో వీఆర్ఓలకు పూర్తిగా సహకరించాలని అధికారులు కోరారు. ఒక సర్వే నెంబర్ సరిహద్దులను కొలుస్తున్న సమయంలో చుట్టుపక్కల ఉన్న సరిహద్దు రైతులు కూడా తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. సర్వే సమయంలో రైతులు తమ వద్ద ఉన్న వన్ బీ, పట్టాదారు పాస్ బుక్, ఎఫ్.ఎం.సి వంటి రికార్డులను తప్పనిసరిగా తీసుకురావాలి. ఒకవేళ భూమి యజమానులైన తల్లిదండ్రులు చనిపోయి పిల్లలు హక్కుదారులుగా ఉన్నట్లయితే, తప్పనిసరిగా డెత్ సర్టిఫికెట్ తో పాటు సంబంధిత ఫోటోలు మరియు ఆధారాలు తమ వెంట ఉంచుకోవాలి. ఈ సర్వే ప్రక్రియలోనే భూమికి అసలైన యజమానులు ఎవరు, సాగుదారులు (పంట దారులు) ఎవరు అనే విషయాలను స్పష్టంగా గుర్తించి నమోదు చేస్తారు. దీనితో పాటే అక్కడికక్కడే ఈ-కేవైసీ ప్రక్రియ కూడా పూర్తి చేయబడుతుంది. రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని పనులు ఒకేసారి పూర్తయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు కె. జ్యోతి (అడ్డతీగల-1), వి. మనోహర్ (అడ్డతీగల-2), వి. సూరిబాబు (గవరయ్యపేట) తదితరులు పాల్గొన్నారు. రైతులందరూ ఈ ఉచిత సేవను సద్వినియోగం చేసుకొని అధికారులకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## పోలవరం జిల్లాలో 'పాత' బోర్డుల దర్శనం.. ఎల్లవరం సచివాలయంలో అధికారుల నిర్లక్ష్యం

అడ్డతీగల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త




రంపచోడవరం కేంద్రంగా నూతన 'పోలవరం జిల్లా' ఆవిర్భవించి సుమారు రెండు నెలలు గడు స్తున్నా, ప్రభుత్వ కార్యాలయాల నామఫలకాలు మాత్రం ఇంకా పాత జిల్లా పేరుతోనే దర్శనమిస్తు న్నాయి. కొత్త జిల్లా ఏర్పడిన వెంటనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల బోర్డులపై జిల్లా పేరును మార్చాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కానీ క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ ఆదేశాలు ఆచరణకు నోచుకోవడం లేదు. ఇందుకు నిదర్శనంగా అడ్డతీగల మండలంలోని ఎల్లవరం గ్రామ సచివాలయాన్ని చెప్పుకోవచ్చు. ఈ సచివాలయం భవనంపై ఇప్పటికీ 'అల్లూరి సీతారామరాజు జిల్లా' పేరును తొలగించకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. రెండు నెలలు గడుస్తున్నా కనీసం బోర్డు మార్చడానికి కూడా స్థానిక అధికారులు చొరవ చూపకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలపై పాత పేర్లే ఉండటంతో పనుల నిమిత్తం వచ్చే సామాన్య ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. సంబంధిత పైస్థాయి అధికారులు స్పందించి, ఎల్లవరం సచివాలయంతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న పాత నామఫలకాలను తక్షణమే తొలగించి, నూతన 'పోలవరం జిల్లా' పేరుతో బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బాలికకు "హెల్పింగ్ హ్యాండ్స్" చేయూత



గూడెం కొత్తవీధి ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త).

మండలంలోని రామగెడ్డ గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన బాలిక అంగవైకల్యంతో బాధపడు తుందన్న సమాచారం తెలుసుకున్న నర్సీపట్నం శారదా స్కూల్ పూర్వ విద్యార్థులు, హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ద్వారా బాలికకు వీల్ చైర్, రెండు జతలు బట్టలు, నగదుని హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి మల్లేశ్వరరావు ద్వారా సహాయం అందించారు. ఈ సందర్భంగా శారదా స్కూల్ పూర్వ విద్యార్థులు, ట్రస్ట్ సభ్యులు పుష్ప మరియు హెల్పింగ్ హ్యాండ్స్ సిబ్బందికి పాప తల్లిదండ్రుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

## వారం రోజులుగా మొరాయించిన బి.ఎస్.ఎన్.ఎల్ టవర్

గూడెం కొత్తవీధి ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త)



గూడెం కొత్తవీధి మండలం సిరిబాల గ్రామంలో వారం రోజులుగా చరవాహిని నిశబ్దమైంది. మారుమూల గ్రామాలు కావటంతో సిగ్నల్స్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సిరిబాల గ్రామానికి ఆనుకొని ఉన్న ఆరు గ్రామాలకు సిగ్నల్ లేకపోవటంతో అత్యవసర సమాచారం కూడా అందించుకునే మార్గం పోయిందని గ్రామస్థులు అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిఎస్ఎన్ఎల్ టవర్ మరమత్తులు చేయాలని కోరుతున్నారు.




## అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు

పాడేరు,ఫిబ్రవరి24,ప్రభాతవార్త



గిరిజన ఆరాధ్యదైవం కోరికలు తీర్చే కొంగు బంగారం పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వంజంగి కాంతమ్మ, విశ్రాంత ఏటిఓ రొబ్బ నాగభూషణ్ రాజు, జెడ్పిటిసి రొబ్బ ఉషారాణి చేతులు మీదుగా అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభించారు. మైదాన ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు, ఆలయ కమిటీ సభ్యులు చల్లా రామకృష్ణ, బోణింగి వెంకటరమణ, కొణతాల సతీష్, కిల్లు చంద్రమోహన్ కుమార్, గూడెపు సూర్య ప్రకాష్ ,లకే రత్నా బాయ్, పలాసి రమణమ్మ జంపారంగి సత్తిబాబు,కూర రాము, పాల్గొన్నారు.

## చింతచెట్టు నుండి జారిపడి గిరిజన యువకుడుకి తీవ్రగాయాలు... కాకినాడ తరలింపు



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

అటవీ ఫలసాయ సేకరణ కోసం చింత చెట్టు ఎక్కి ఆకస్మాత్తుగా జారిపడటంతో గిరిజన కొండరెడ్డి తెగకు చెందిన యువకుడుకి తీవ్రగాయాలు అయ్యాయి. మారేడుబాక పంచాయితీ కోసూరివారివీధి గ్రామానికి చెందిన కోసూరి జోగిరెడ్డి (30) సం. మంగళవారం మధ్యాహ్నం గ్రామంలో గల చింతచెట్టు ఎక్కి జారిపడటంతో జడ్డంగి పి. హెచ్. సి కి ప్రవేటు వాహనంలో తీసుకొని వచ్చారు. పి. హెచ్. సి. డా. నాగార్జున వైద్య పరీక్షలను చేసి ఎడమ కాలు, ఎడమచేయి విరిగినట్లు ధ్రువీకరించారు. మెడ భాగం కూడా కదపలేని స్థితిలో ఉన్నట్లు స్టాఫ్ నర్స్ నాగలక్ష్మి అన్నారు. అత్యవసర వైద్యానికి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. రాష్ట్ర గిరిజన సంఘ అధ్యక్షులు లోతా రామారావు జడ్డంగి పి. హెచ్. సి కి చేరుకొని జోగిరెడ్డి కుటుంబీకులను ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొన్నారు. రాజవొమ్మంగి పి. హెచ్. సి అంబులెన్సు ద్వారా కాకినాడ తరలించారు. ఈకార్యక్రమంలో డా. నాగార్జున, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు, కోసూరి అప్పలరాజు, స్టాఫ్ నర్స్ నాగలక్ష్మి, ఏ. ఎన్. యం. కుమారి, ఎఫ్. ఎన్. ఓ పాప, కోసూరివారివీధి గ్రామస్తులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవు - సి.ఐ సుధాకర్

గూడెం కొత్తవీధి,ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త)



మండలంలోని రింతాడ పంచాయతీ కట్టువీధి గ్రామంలో ప్రజలకు మైనర్లు (పిల్లలు) వాహనాలు అడిగితే బైకులు ఇతర వాహనాల తల్లిదండ్రులు ఇవ్వ వద్దని వాటివల్ల ప్రమాదాలు జరుగు తున్నాయని, పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని గూడెం కొత్తవీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మైనర్ అతి రాష్ డ్రైవింగ్ చేస్తున్నారని, లైసెన్స్ లేని వాహనదారులకు వాహనాలు ఇచ్చి ప్రమా దాలకు గురైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వాహనదారునికి,వాహన యజమానికి కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్ పిల్లలకు వాహనాలు కొనివ్వటం వంటి తప్పులు చేయరాదని, పిల్లలకు సర్దిచెప్తూ అవగాహన కల్పించాలని అన్నారు. గూడెం కొత్తవీధి సి.ఐ సుధాకర్, పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు:

### ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే లక్ష్యం : జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్



పాడేరు/చింతూరు ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

రెవెన్యూ శాఖలో పనితీరు మెరుగుపరచడం, ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా ప్రజల నుండి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సిబ్బంది పనితీరును అంచనా వేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ రంపచోడవరం నుండి రెవిన్యూ నిర్వహణపై పాడేరు పోలవరం జిల్లాల రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ సేవ పొందిన అనంతరం ప్రజలకు వచ్చే కాల్స్‌లో నెగటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మ్యుటేషన్లు, ఫీ-లైన్ సర్వేలు, రేషన్ పంపిణీ వంటి కీలక అంశాలపై తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాలనలో వేగం పెంచేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లోని పాత రికార్డులన్నింటినీ తక్షణమే స్కానింగ్ చేసి డిజిటలైజేషన్ చేయాలని ఆదేశించారు. ఇకపై అన్ని ఫైళ్లను కేవలం 'ఇ-ఆఫీస్ ద్వారానే పంపాలని, ఫిజికల్ ఫైళ్లకు స్వస్తి పలకాలని స్పష్టం చేశారు. అలాగే అవసరమైన అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గ్రామాల్లో డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించి ఈకెవైసి ప్రక్రియను పెండింగ్ లేకుండా వంద శాతం పూర్తి చేయాలి. జరుగుతున్న రీ-సర్వేలో ఎటువంటి తప్పులు దొర్లకుండా, సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వేపై సిబ్బందికి ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు, పనిలో నాణ్యత పెంచేందుకు జిల్లా రెవెన్యూ అధికారి, రెవిన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్ షాప్‌లు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజలకు జవాబు దారీగా ఉంటూ, రెవెన్యూ సేవలను ఎటువంటి జాప్యం లేకుండా అందించడమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశమని ఉన్నతాధికారులు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు, రెండు జిల్లాల రెవిన్యూ అధికారులు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ దశలవారీ పోరాటం

### 26,27 తేదీల్లో నిరసన కార్యక్రమాలు

పాడేరు,ఫిబ్రవరి24,ప్రభాతవార్త

12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించి, మధ్యంతర భృతి 30శాతం,పెండింగ్ డిఎలు, ప్రకటించాలనీ, అన్ని రకాల బకాయిలు విడుదల చేయాలని నెలవారీ పదోన్నతులు,సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26వ తేదీన అరకు, చింతపల్లి మండల తాలూకా కేంద్రం ఏంఆర్ఓ కార్యాలయం వద్ద 27న పాడేరు ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిరసన..దశాలవారీ పోరాటం చేస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రావుల జగన్ మోహన రావు, బౌడు గంగరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## తప్పుడు పత్రాలు చూపించి రిజిస్ట్రేషన్ చేసిన నిందితులు అరెస్టు : నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ

నర్సీపట్నం,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త



నాతవరం మండలం లింగంపేట గ్రామంలో తప్పుడు పత్రాలు చూపించి రిజిస్ట్రేషన్ చేసిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలి పారు. నర్సీపట్నం రూరల్ పోలీస్‌స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. నాతవరం మండలం లింగంపేట సర్వే నెంబరు 46లో గ్రామకంఠం భూమిని కొందరు వ్యక్తులు అసైన్మెంట్ మెంబర్లు, ఎలక్ట్రికల్ మీటర్ మెంబర్లు కలిగిన వేరొక ప్రాంతంలో ఉన్న ఇళ్లను చూపించి గ్రామ పంచాయతీకి చెందిన ఖాళీ గ్రామకంఠం భూమిని రిజిస్ట్రేషన్ చేశారన్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నాతవరం ఎస్సై తారకేశ్వరరావుకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారన్నారు. దీంతో కేసు నమోదు చేసి విచారణ చేసి లోకవరపు నూకరాజు, లోకవరపు కొండబాబు, లోకవరపు నారాయణమూర్తి, పైల సీతారామ నాగజమీలు, లోకవరపు వరహాలబాబులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం ఎస్సై తారకేశ్వరావు, తహశీల్దార్ చందన రేఖ, ఎంపిడిఒ ఎంఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పీ4 సర్వే బంగారు కుటుంబాల రిజిస్ట్రేషన్స్

## హాజరు ఆధారంగా సచివాలయ సిబ్బందికి వేతనాలు చెల్లింపు : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

పాడేరు/చింతూరు, ఫిబ్రవరి24, ప్రభాతవార్త



రోజువారీ హాజరు నమోదు చేయకుండా, సమయ పాలన లేకుండా, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సచివాలయ ఉద్యోగుల వేతనాలు నిలిపి వేయాలని, పర్యవేక్షణ చేయని మండల స్థాయి సచివాలయ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు జిల్లా నోడల్ అధికారి పి.యస్. కుమార్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం పోలవరం జిల్లా, రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సచివాలయ సిబ్బంది శతశాతం హాజరు ఏకీకృత కుటుంబ సర్వే, సిటిజన్,ఈ కేవైసీ, మన మిత్రా కాంపెయిన్‌లో వెనుకబడిన జి.మాడుగుల యం.పి.డి.ఓ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు మాసముల నుండి పనితీరు సక్రమంగా లేనందున అవసరమైతే యం.పి. డి.ఓ ను మార్చాలని జిల్లా పరిషత్ సి.ఇ.ఓ నుఆదేశించారు.పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, డిప్యూటీ యం.పి.డి.ఓలు, యం.పి.డి.ఓలు తరచుగా పర్యటించి, చెత్త నుండి సంపద కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. 100రోజులు పని దినాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సమీక్ష చేశారు. వేతనా దారులకు పని కల్పించడం, పనిచేసిన వారికి సకాలంలో వేతనాలు చెల్లించడం, నిర్ణీత వేతనం చెల్లింపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏ.పి.ఓ లు, యం.పి.డి.ఓ లను ఆదేశించారు. ఐ గాట్ కర్మయోగి పోర్టల్ ద్వారా అన్ని శాఖలలో ఎక్కువ మంది ఉద్యోగా ఉన్న శాఖల్లో ఎక్కువ మందిని ఓటర్లు చేర్చే విధంగా, పరిపాలనా నిర్వహణ, జీవోలు, సాంకేతిక నైపుణ్యాం మెరుగుపరచుకోవడం కోసం ఆర్డీఓ ను ప్రతి వారం సమీక్షించి నిర్ణీత సమయంలో హోటల్లో నమోదును పూర్తి చేయాలని ఆదేశించారు.పీ4 ద్వారా బంగారు కుటుంబల రిజిస్ట్రేషన్స్ శత శాతం ఉండే విధంగా చూడాలని సిపిఓ ని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు జిల్లా నోడల్ అధికారి పి. యస్. కుమార్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి చంద్రశేఖర్, డ్వామా ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, ఆర్.డి.ఓ లోకేశ్వర రావు, సిపిఓ, చీఫ్ ప్లానింగ్ అధికారి ప్రసాద్, రెండు జిల్లాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోస్, ఏపీవోలు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారిని కలిసిన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

పాడేరు,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:



అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడుని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాసాడ ఈశ్వరరావు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మాసాడ ఈశ్వరరావుని విద్యాశాఖాధికారి దుశ్శాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జరిగిన చర్చలో గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధి, పాఠశాలల బలోపేతం మరియు విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి పలు కీలక అంశాలపై డి.ఇ.ఓ ముఖ్యమైన సలహాలు, సూచనలు అందించారు. గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు సంఘం తరఫున కృషి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం పాడేరు జోన్ సెక్రటరీ చప్పలి యువరాజు, పెదబయలు జోన్ సెక్రటరీ పి.లింగన్న ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఐక్యంగా పోరాడండి - విజయం సాధించండి... ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ

ఎటపాక, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలను మంగళవారం ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టు స్థాయిలో గత రెండు రోజులుగా జరుగుతున్నాయని అన్నారు. 2023వ సంవత్సరం డిసెంబర్ నెలలో నలభై రెండు రోజులు చేసిన సమ్మె సందర్భంగా మీరు సాధించిన విజయాలు ఆచరణ రూపంలోకి రావాలంటే పోరాటం తప్పదన్నారు. ఈ నాటి వరకు అంగన్వాడీ కార్యకర్తలు ఐక్యంగా పోరాడి అనేక విజయాలు సాధించారని ఆమె అన్నారు. మీరు పోరాడి సాధించుకున్న ఫలాలు వృధా కాకూడదని అన్నారు. మీరు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ఐద్వా పోలవరం జిల్లా కమిటీ తరఫున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని ఆమె అన్నారు.దీక్షలు ప్రారంభానికి ముందు అంగన్వాడీ కార్యకర్తలకు ఆమె దండలు వేసి ఈరోజు దీక్షను ప్రారంభించారు. అలాగే భవన నిర్మాణ కార్మిక సంఘం పోలవరం జిల్లా అధ్యక్షులు తోట శ్రీను కూడా దండలు వేసి ఈరోజు దీక్షను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఐ.వి. మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో అంగన్వాడీలకు అన్యాయం జరిగిందని అన్నారు. అందుకే మార్చి 2న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని ఐ.వి. పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బి.సూర్యకుమారి, జి.సుశీల, తదితరులు పాల్గొన్నారు.

# పసిబిడ్డ కోసం చింతూరులో పరిమళించిన మానవత్వం.. పునర్విక కోసం దాతల విరాళాలు

చింతూరు ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



పసిబిడ్డ ప్రాణాలను ఎస్‌యంఏ అనే వ్యాధి పిడిస్తుంది, ఆ బిడ్డ ప్రాణాలు రక్షించుకోవాలంటే రూ 16 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని, అంత స్తోమత ఆ చిన్నారి తల్లిదండ్రులకు లేదన్న విషయం సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టింది.కర్నూలు జిల్లాకు చెందిన పునర్విక అనే 8 నెలల పాప ప్రాణాలను దక్కించుకోవడానికి ఆ కుటుంబం కన్నీటి బాధ సోషల్ మీడియా ప్రసారం కావడంతో మానవత్వంతో చాలా మంది దాతలు చెలించారు. సహాయం చేయాలన్న గుణం, ఆ తల్లిదండ్రుల కన్నీటి వేదన అర్థం చేసుకున్న చింతూరుకు చెందిన కొంతమంది యువకులు నడుం బిగించారు. గంటల వ్యవధిలో సుమారు లక్ష రూపాయల విరాళాన్ని సేకరించి ఆ నగదు మొత్తాన్ని పునర్విక తల్లిదండ్రులకు అందజేయనున్నారు. పునర్విక విషయాన్ని తెలుసుకున్న చిరు వ్యాపారులు కూడా తమ వంతు ముందుకు వచ్చి విరాళాలను అందజేశారు, చాలామంది సోషల్ మీడియాలో ఆ కథనాన్ని చూసి చెలిం చి ఆన్లైన్లో కూడా నగదును చెల్లించారు, ఏది ఏమైనా ఇటువంటి ఘటనలు బహిర్గతమైనప్పుడు మానవత్వంతో స్పందించి సహాయం చేయడానికి ముందుకు రావడం అనేది చాలా మంచి పరిణామం. ఆ పసి బిడ్డ ప్రాణాలను దేవుడు చల్లగా చూడాలని కోరుకుంటూ..

# కిడ్నీ వ్యాధితో వైద్యసేవలు పొందుతూ గిరిజన మహిళ మృతి

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



రాజవొమ్మంగి మండలం చెరుకుంపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ రెడ్డి గంగ (52) సం. కాకినాడ ప్రభుత్వం ఆసుపత్రిలో కిడ్నీ సమస్యతో వైద్య సేవలు పొందుతూ 23 తేదీ మధ్యాహ్నం మరణించిన్నట్లు కుమార్తె కమల తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు బి.పి.పరీక్షలు చేయకుండా ఇంజక్షన్‌లు చేశారని కమల ఆరోపించారు. వివరాలు ఇలా ఉన్నాయి. చెరుకుంపాలెం గ్రామానికి చెందిన రెడ్డి గంగ ఈనెల 12 తేదీన రంపచోడవరం వైద్యపరీక్షలకు వెళ్లగా కిడ్నీలు సమస్య ఉందని అన్నారని కమల వెల్లడించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఉండి వైద్యసేవలను పొందాలని వైద్యులు సూచించడంతో ఇంటికి తిరిగి వచ్చామన్నారు. 16 తేదీ యానాం ఆసుపత్రికి వెళ్లడం, అక్కడ నుండి కాకినాడ ఆసుపత్రిలో 20 తేదీన చేరామన్నారు. 23 తేదీన రక్తపూత సేకరణ అదే రోజు కనీసం బి. పి. పరీక్షలు చేయకుండా ఒకేసారి ఐదు ఇంజక్షన్ లు చేసారని మృతురాలి కుమార్తె కమల అన్నారు. కాకినాడ ఆసుపత్రిలో మాఅమ్మకు వైద్యులు వై ధ్యసేవలను అందించలేదని కమల ఆరోపించారు. మా అమ్మ చనిపోయిన తరువాత కిడ్నీ వ్యాధి ఐదో దశలో ఉందని, రెండు కిడ్నీలు పాడయి పోయాయని అన్నారని కమల కన్నీటి పర్యంతమవుతోంది. ఈ విషయంపై జడ్డంగి పి. హెచ్. సి.డా. పావనిను ప్రభాతవార్త వివరణ కోరగా గంగ దీర్ఘకాలిక రక్తహీనత వలన వ్యాధి నిరోధక శక్తి లోపించి నీరుడు సమస్య తీవ్రత పెరిగి కిడ్నీలు పాడయి మరణానికి కారణమని అన్నారు. రెడ్డి గంగ మృతి పట్ల చెరుకుంపాలెం గ్రామపంచాయితీ సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు, ఎంపిటిసి మీనవల్లి సుబ్బారావు, మార్కెట్ కమిటీ మెంబర్ గట్టు మాణిక్యంలు సంతాపం తెలిపారు.

# గంజాయితో పట్టుబడ్డ ఐదుగురు యువకులు కటకటాల్లోకి..

చింతూరు ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



గంజాయిని అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డ ఐదుగురు యువకులు కటకటాల్లో ఊసలు లెక్కేస్తున్నారు. చింతూరు మండలం కల్లేరు సమీపంలో ఒరిస్సా సరిహద్దు వద్ద చింతూరు పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టగా, రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేశారు. వారి వద్ద ప్లాస్టిక్ కవర్లో దాచిన ఏడు కేజీల గంజాయి బయటపడటంతో ఐదుగురు యువకులను అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలోఆరంగి లక్ష్మణ్, బాల మురుగన్ రాజు, మత్తారి వినయ్ కుమార్, పోలకి సాయికుమార్, రట్టి విష్ణు లు పట్టుబడ్డారు. పట్టు బడ్డ ఏడు కేజీల గంజాయి విలువ సుమారు 3. 5లక్షల రూపాయలు ఉంటుందని ఎస్సై రమేష్ తెలిపారు, గంజాయితో పాటు రెండు ద్విచక్ర వాహనాలు యువకుల వద్ద ఉన్న మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు.

# పొగమంచుతో బాటు నిద్రలేమి వల్లే కారు బోల్తా..

## జిల్లా రవాణా శాఖ అధికారి రాజేష్



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

ఈనెల 20 తేదీ ఉదయం జడ్డంగి గ్రామ శివారున కారు బోల్తా పడి కొండపల్లి గ్రామానికి చెందిన బీరబోయిన సీతా రత్నం మరణించడం, మరో నలుగురు గాయాలు అయిన విషయం తెలిసిందే. ప్రమాద ప్రాంతంలో ఉన్న కారుని మంగళవారం పోలవరం జిల్లా రవాణా శాఖ అధికారి రాజేష్ పరిశీలించారు. పొగమంచు, నిద్ర లేమి వల్ల ప్రమాదం జరిగినట్లు గుర్తించామన్నారు. కారు కండిషన్ లో ఉందన్నారు. సి బుక్, ఇన్సూరెన్స్ కూడా ఉన్నట్లు వివరించారు. అనంతరం ప్రభాతవార్తతో మాట్లాడుతూ పోలవరం జిల్లా ఫిబ్రవరి నెలలో ప్రమాదాలు తీవ్రత తగ్గిందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కోసం సారధి అనే యాప్‌లో అప్ లోడ్ చేసుకోవాలని అన్నారు. కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్, పేర్లు మార్పు, ఇతర వాటికి వాహన్ అనే యాప్ లో అప్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డి.టి.ఓ రాజేష్, జడ్డంగి ఎస్.ఐ చినబాబు, ఏ. ఎస్. ఐ.సురేష్ పాల్గొన్నారు.

# బోధనలో ప్రత్యేకతతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు..

## ప్యానల్ ఇన్సిఫెక్షన్ అధికారి సాగిన రామరాజుపడాల్

గూడెం కొత్త వీధి ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త).



విద్యాబోధనలో ప్రత్యేకత కనబరిచిన ఉపాధ్యాయులకే గుర్తింపు ఉంటుందని ప్యానెల్ ఇన్స్పెక్షన్ అధికారి సాగిన రామరాజుపడాల్ అన్నారు. మండలంలోని పెదవలస గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో మంగళవారం సబ్జెక్ట్ ఉపాధ్యాయుల బోధన తీరు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ పాడేరు ఉప సంచాలకులు ఆదేశాల మేరకు సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుపరిచేందుకు సబ్జెక్టుల వారీగా తనిఖీలు నిర్వహించి వారికి అవసరమైన సలహాలు సూచనలు అందించేందుకు ప్యానెల్ ఇన్స్పెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జికెవీధి, చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమన్నత పాఠశాలల్లో ఇతనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అందుకు ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి ఒక్క ఉపాధ్యాయుడు ప్యానెల్ ఇన్స్పెక్షన్ బృందంలో ఉంటారని పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు చెప్పే విధానాన్ని పరిశీలించి ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు తగిన సూచనలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా బోధన మెరుగుపడటంతో పాటు విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. తద్వారా పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా తనిఖీలు నిర్వహించి ఉపాధ్యాయుల తో పాటు విద్యార్థుల కు మేలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదవలస గిరిజన సంక్షేమ ఆశ్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శెట్టి మూర్తి, ప్యానెల్ ఇన్స్పెక్షన్ బృందంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పీఎం జన్మన్ గృహాల బిల్లుల బకాయిలపై 27న ఛలో ఐటీడీఏ

గూడెం కొత్తవీధి, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త)



పీఎం జన్మన్, గ్రామీణ హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం చెల్లించ వలసిన బకాయి బిల్లుల కోసం చలో ఐటిడిఏ కార్యక్రమాన్ని, విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన, పిఎం జన్మన్, హౌసింగ్ త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ అధికారులు పత్రిక ప్రకటనలు చేస్తున్నారు.. కానీ లబ్దిదారులు వారి యొక్క ఇల్లులను లబ్దిదారులు వర్షాలు ప్రారంభం కాకముందే ఇల్లును పూర్తి చేసుకోవాలని వారి అవకాశం మేరకు అప్పులు చేసి వివిధ స్టేజిలో ఇల్లును నిర్మాణం చేసుకుని ఎదురు చూస్తున్నారని తెలిపారు. బిల్లులు త్వరగా జరగక ఇల్లు పూర్తి చేయక ఉన్న ఇల్లును పీకి చాలా మంది గిరిజనులు చిన్న చిన్న పాకలు, పందిరిలు వేసుకొని ఉన్నారని అన్నారు. అలాగే గ్రామీణ హౌసింగ్స్ సంబంధించి ప్రభుత్వం మాటెలేదన్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో ఇల్లులను, ప్రస్తుతం ప్రభుత్వం చెల్లిస్తున్న, పిఎం జన్మన్‌కి, 1లక్ష రూపాయలు గ్రామీణ హసింగ్స్ , 75వేలు అదనంగా ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వాం నేటికీ చేయటం లేదని అన్నారు. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పెండింగ్ బిల్లులు , ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ తలపెట్టిన చలో ఐటిడిఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయలని కోరారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 24, ప్రభాత వార్త



రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ గురుకుల బాలికొన్నత కళాశాల ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రంలో మంగళవారం జరిగిన ఇంటర్ రెండో సంవత్సర తెలుగు పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ షీలా తెలిపారు. మూడు కళాశాలల నుండి 269 మందికి 264 మంది హాజరు కావడం జరిగిందన్నారు. ఒకేషనల్ కోర్సు విద్యార్థులంతా హాజరైనట్లు వివరించారు. రాజవొమ్మంగి ఎస్. ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులను నిర్వహించారు.

# గొలుసు దుకాణాలపై దాడులు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



మండలంలోని గుట్టు చప్పుడు కాకుండా నడుపుతున్న గొలుసు దుకాణాలపై సోమవారం రాత్రి సీఐ మురళి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. మండలంలోని దేవవరం, గొడిచర్ల గ్రామాల్లో 29 మద్యం సీసాలు స్వాధీనపరచుకొని అమ్మకం దారులు పై కేసు నమోదు చేసినట్లు మహిళ ఎస్సై సాహిబా అంజుమ్ తెలిపారు. ఈ దాడుల్లో రాజు తోపాటు కానిస్టేబుల్ ఉన్నారు.

# ఆటవిడుపులో పాల్గొన్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు

చోడవరం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజులపాటు నిర్వహించ తలపెట్టిన ఎమ్మెల్యేల ఆటవిడుపు క్రీడా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు లాంగ్ టెన్నిస్, క్రికెట్ పోటీలో పాల్గొనే ఉత్సాహంగా ఆడారు. ఈ కార్యక్రమాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు తదితరులు ప్రారంభిం చారు. నిత్యం బిజీగా ఉండే ఎమ్మెల్యేలు కూడా ఆటవిడుపు ఉండాలని వారిలో కూడా క్రీడా స్ఫూర్తి నింపాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

# వేములపూడి మోడల్ స్కూల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

నర్సీపట్నం,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త



నర్సీపట్నం మండలం వేములపూడి ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపల్ సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ మార్చి 31వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. www.cse.ap.gov.in, www.apms.apcfss.in వెబ్ సైట్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 12వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నర్సీపట్నం,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త



నర్సీపట్నం పరిధి గబ్బాడ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పీనారిపాలెంకు చెందిన గరగ శ్రీనివాసరావు తన ద్విచక్రవాహనంపై ఏటి గైరంపేట వైపు వెళ్తుండగా గబ్బాడ వద్ద టిప్పర్ లారీ ఢీ కొట్టింది. లారీ చక్రాలు అతని కాళ్లపై వెళ్లడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. వెంటనే అతన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి కేజీహెచ్కు తరలించారు. విషయం తెలుసుకున్న స్పీకర్ అయ్యన్న సతీమణి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ఆసుపత్రికి చేరుకుని వివరాలు ఆరా తీశారు.

# గురుకులాల్లో ప్రవేశానికి 8న రాత పరీక్ష.

నక్కపల్లి, (ప్రభాతవార్త)

నక్కపల్లి కేంద్రంలో ఉన్న డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలలో 6.7.8.9 తరగతులలో మిగిలిన ఖాళీలు భర్తీ కొరకు ప్రవేశ పరీక్ష ముందుగా ప్రకటించిన తేది మార్చి రెండవ తేదీకి వాయిదా వేస్తూ మార్చి ఎనిమిదో తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ సారింఘిక సంక్షేమ గురుకుల విద్యాలయా) సంస్థ, అమరావతి వారి ఆద్వర్యంలో నడపబడుచున్న అవకావల్లి జిల్లాలో గల డా.బి.ఆర్ అంబేద్మల్ గురుకులం( బాలికల) నక్కపల్లి పాఠశాలల్లో 2026 - 2027 విద్యా సంవత్సరమునాకు గాను 6.7.8, 9 తరగతులలో మిగిలియున్న సీట్ల భర్తీ కొరకు జరుగు--తున్న ప్రవేశ పరీక్ష తేది మార్చడం జరిగిందని పేర్కొన్నారు .

# కంచె చేను మేసింది!

## వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకన్న ఆరోపణ

అనకాపల్లి,ఫిబ్రవరి24:( ప్రభాత వార్త)



జిల్లా కలెక్టరే దేవుని మాన్యం ను ప్రైవేటు వ్యక్తులకు కట్ట బెట్టడం అంటే కంచె చేను మేసి నట్లు ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న పేర్కొన్నారు మంగళవారం అయిన ప్రకటన విడుదల చేసారు అనకాపల్లి నడి బోడ్డున ఎన్టీ ఆర్ మార్కెట్ యార్డ్ కోసం 30,37 ఎకారాలు ప్రభుత్వం భూమి సేక రించి భూ సేకరణలో పోయిన భూమి పోగా 1.38 ఎకరాల భూమి దూరి కామమ్మ సత్రం పేరిటే మిగిలి ఉన్న.ఈ భూమి దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్నట్టుగా 22 ఏ రికార్డులు చెబుతున్నాయని తెలిపారు. అయితే కొంత మంది అక్రమార్కులు గత 30 ఏళ్లగా ఈ భూమిని కాజేసే ప్రయత్నం లోనే ఉన్నారని అన్నారు. కానీ ఉమ్మడి విశాఖ కలెక్టర్లుగా వ్యవహరించిన వాళ్లెవరూ ఈదేవుని భూముల జోలికి పోలేదని అయితే ఈ భూమిని కాజేసే కుట్రలో భాగంగా సెప్టెంబర్ 6, 2022 న కాంద్రేగుల చినతల్లి పేరుతో ఈ భూమిని 22 (ఏ) నుంచి తొల గించాలని కలెక్టర్ కు ఒక దరఖాస్తు వచ్చింద న్నారు. అయితే అప్పటి కలెక్టర్ దీనిపై స్పందించ లేదని తెలిపారు కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ దరఖాస్తును జిల్లా కలెక్టర్ బయటకు తీసి దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి. జూన్ 21, 2024 న అనకాపల్లి తహసీల్దార్ నుంచి తనకు కావాల్సిన విధంగా రిపోర్ట్ రప్పిం చుకుని. అదే విధంగా మరో వారం రోజుల్లో ఆర్డీవో నివేదికను కూడా విజయ కృష్ణన్ రాయించేశారని తెలిపారు.అప్పటికే ఈ భూమి దేవదాయ శాఖ ఆస్తి కింద టైటిల్స్ ఖాయం చేస్తూ ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ తో పాటు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు కూడా అమల్లో ఉన్నప్పటికీ వాటిని కలెక్టర్ ఖాతరు చేయకుండా. దేవదాయ శాఖ ప్రమేయం లేకుండానే తన ఆధీనంలో పని చేసే ఆర్డీవో, మార్కెటింగ్ శాఖ ఏడీ, జోసల్ కమిషనర్,ను తహసీల్దార్లుతో కూడిన జాయింట్ ఇన్స్పెక్షన్ చేయించేసారని పేర్కొన్నారు. అంటే కలెక్టర్ ఒక ప్రైవేట్ పార్టీకి లబ్ధి చేకూర్చడం కోసం దేవదాయ శాఖను పూర్తిగా పక్కన పెట్టేసి నట్టు బలంగా కనిపిస్తుందని అన్నారు ఇదే స్పీడు సామాన్యులకు సంబంధించినటు వంటి 22-ఏ ఫైళ్ళ విషయంలోను జిల్లా కలెక్టర్ చొరవ చూపించ లేక పోతు న్నారని పేర్కొన్నారు, ప్రతి సోమవారం కలెక్టరేట్ చుట్టు తిరుగుతూ పీజీఆర్ఎస్ లో వందలాది మంది ధరఖాస్తులు పెట్టుకుని కన్నీరు కారుస్తూనే ఉన్నారని తెలిపారు దేవరాపల్లి మండల కేంద్రంలో సర్వే నెంబరు 280, 280/1 281/1,లలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు స్వాదినం చేసు కోవాలని ఎన్నిసార్లు పిర్యాదు చేసిన అక్రమణ దారుని రక్షించే ప్రయత్నంలో రెవెన్యూ అధికారులు ఉన్నారని తెలిపారు జిల్లా కేంద్రంలోనే దూరి కామమ్మ సత్రానికి చెందిన ఈదేవదాయ శాఖ భూమి విలువ దాదాపు 40 కోట్ల రూపాయలు ఉంటుందని. ఈ భూమిని కాజేయడం కోసం ప్రైవేట్ వ్యక్తులు చేసిన ప్రయత్నానికి ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన కలెక్టర్ ఏ ఈవిధంగా సహాయ పడ్డారో, ఆమె ఇచ్చిన ఆర్డర్ను చూస్తే అర్ధ మౌవుతుందని తెలిపారు దేవదాయ శాఖ భూములపై ఉత్తర్వు లిచ్చే అధికారం కలెక్టర్క్ లేనే లేదని.తెల్చి చేప్పారు ఎండో మెంట్ అదికారులకు మాత్రమే ఇటువంటి ఆర్డర్ ఇచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు అయితే జిల్లా కలెక్టర్ ఈ భూముల్ను ఇచ్చిన ఉత్తర్వులు పరిశీలించినప్పుడు సర్వే 1539/55 2.49 ఎకారాలకు తన అదికారాన్ని మొత్తం ఉప యోగించి భూమి ఇనామ్ వెట్ కింద ఉంది. ఎస్ఎఫ్ఏ ప్రకారం ఈ భూమి రైతు వారీ మెట్టు అని ఉందని. ఇందులో 1.38 ఎకరాల భూమి ఇజు= ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ అధీనంలో వారి ప్రహరీ గోడ లోపల ఉందని. ఇప్పుడు ఈ భూమిని 22-ఏలో నోటి ఫై చేయాలని ఇన్స్పెక్షన్ అధికారులు సూచించారని అన్నారు ఏదయితే కాంద్రేగుల చినతల్లి 22-ఏ నుంచి 1.11 ఎకరాల భూమిని మినహాయిం చాలని అడుగుతుందో అది ఇక్కడ వర్తించదని' కలెక్టర్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారని తెలిపారు అంటే చిన తల్లి అడిగిన భూమికి 22-ఏ వర్తించదు అని స్పష్టంగా తీర్పు ఇచ్చేశారని తెలిపారు.పైగా ఈ చిన తల్లి భర్త ఈభూమికి ఒకప్పుడు కౌలుదారుడు మాత్రమే గానీ యజమాని కానే కాదని. కేవలం చిన తల్లికి లబ్ది చేకూర్చడం కోసం కోట్లాది రూపాయల విలు వైన దేవదాయ శాఖ భూమిని ధారాదత్తం చేసే పనిని కలెక్టర్. పూను కున్నారని తెలిపారు కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల్ని చూసి దేవ దాయశాఖ అధికారులు కంగుతింటున్నారని తెలిపారు గత ముప్పై ఏళ్ళ నుంచీ ఈ భూమి దేవదాయ శాఖదే అన్న విషయం అందరికీ తెలిసిందేనని తెలిపారు జిల్లా కలెక్టర్ నియమించిన జాయింట్ ఇన్స్పెక్షన్ కమిటీ ఎందుకు ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేసిందని తన పరిధిలో లేని భూమిని 22 ఏ నుంచి మినహా యించే పనికి కలెక్టర్ ఎందుకు అంత శ్రద్ధ చూ పించారని ప్రశ్నించారు? దీనిపై సమగ్ర విచారణ జరపాలని కంచె చేనుమేసినట్లు ప్రభుత్వ హస్తులు కాపాడ వలసిన జిల్లా కలెక్టర్ ఈవిదమైన చర్యలకు పూనుకోవడం ప్రజల్లో ఐఎఎస్ అధికారులపై విశ్వాసం పోతుందని వెంకన్న అప్రకటనలో స్పష్టం చేశారు.

# గణితం ఒలింపిక్స్‌లో వర్షితకు రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు

## అభినందించిన ఉపాధ్యాయులు..

నక్కపల్లి రూరల్/ అడ్డు రోడ్డు, (ప్రభాతవార్త)



స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న పూడి వర్షిత్ 52వ గణిత ఒలింపిక్స్ లో రాష్ట్రస్థాయిలో సబ్ జూనియర్స్ నుంచి పాల్గొని రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా వర్షితని ఆర్ వి ఆర్, జెసి ఇంజనీరింగ్ కాలేజ్ గుంటూరుకు చెందిన అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఆ సందర్భంగా ఆమెకు మెడలను అందజేశారు. ఆరో ర్యాంకు సాధించిన వర్షితను కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తోపాటు గణిత ఉపాధ్యాయులు, పలు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

# విశాఖ నగర సుందరికరణకు రాత్రి పారిశుధ్యం

## వీధి దీపాల నిర్వహణే కీలక పాత్ర - రాత్రి పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :



విశాఖ నగర సుందరికరణకు రాత్రి పారిశుధ్యం,వీధి దీపాల నిర్వహణే కీలక పాత్ర అని, నగరంలోని రాత్రి వేళల్లో పారిశుధ్యం , వీధి దీపాల నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సోమవారం ఆయన తెలుగు తల్లి ఫ్లైఓవర్ పరిసరాలు, జగదాంబ జంక్షన్ నుండి పూర్ణ మార్కెట్ వరకు విస్తరించిన ప్రాంతం, బీచ్ రోడ్డు, ఎంవిపి కాలనీ,అప్పు ఘర్ సమీప ప్రాంతాలలో ఫీల్డ్ స్థాయిలో రాత్రిపూట జరుగుచున్న పనులను తనిఖీ చేస్తూ సమీక్షించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ, విశాఖ నగర సుందరీకరణకు ముఖ్యంగా నిత్యం రాత్రి పూట నిర్వహిస్తున్న రోడ్లు, ఫుట్ పాత్ లు, బహిరంగ ప్రదేశాలు లు,కాలువల పరిశుభ్రత,పారిశుద్ధ్య పనులు, వీధి దీపాలు నిర్వహణ ఎంతో కీలకమన్నారు. పారిశుద్ధ్య కార్మికులు విధులను నిబద్ధతతో , నిజాయితీతో నిర్వహించాలని ప్రోత్సహించారు. రాత్రి వేళల్లో నగర పరిశుభ్రతను కాపాడడంలో వారి పాత్రను ప్రశంసిస్తూ, రాత్రి పారిశుధ్య సిబ్బంది కృషిని అభినందించారు. పారిశుధ్య కార్మికులకు విధి నిర్వహణకు అవసరమగు పరికరాలు లోటు లేకుండా సమకూర్చాలని , వాణిజ్య సముదాయాల వ్యర్థాల సేకరణను మరింత బలోపేతం చేసి, వ్యాపారులు వ్యర్ధాలను బయట పడవేయకుండా నిత్యం జేబీఎంసీ వాహనాలకు అందించేలా అవగాహన పరుస్తూ పర్యవేక్షించేయాలని ,వీధి దీపాల నిర్వహణ , సమర్థవంతమైన పనితీరును పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు.విశాఖ నగరంలో పారిశుధ్యం , వీధి దీపాలు నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా నిరంతర పర్యవేక్షణ జరుపుతూ విశాఖ నగరాన్ని మరింత సుందరీకరణతో అభివృద్ధి పథంలో తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ అధికారులు ,ఉద్యోగులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధి నిర్వహణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

# విశాఖ హోం గార్డుల 'బి' కేటగిరీ పోస్టులకు దరఖాస్తులు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



విశాఖ నగరానికి చెందిన అభ్యర్థుల నుంచి హోం గార్డుల స్వచ్ఛంద సేవలో 'బి' కేటగిరీ (టెక్నికల్ ఇతర ట్రేడ్స్) కింద మొత్తం 32 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు.. వీటిలో సాధారణ టెక్నికల్ ట్రేడ్స్‌కు 19 పోస్టులు, సైబర్ క్రైమ్ దర్యాప్తు సహాయానికి 12 పోస్టులు, కంప్యూటర్ హార్డ్‌వేర్ రిపేర్‌కు ఒక పోస్టు ఉన్నాయి. ఎంపికైన వారికి రోజుకు రూ.710 విధి భత్యం చెల్లించనున్నారు.

### అర్హతలు

విశాఖపట్నం నగర నివాసులే దరఖాస్తు చేయాలి. వయస్సు 21--50 సంవత్సరాల మధ్య ఉండాలి. మంచి ప్రవర్తన, సంతృప్తికరమైన పూర్వచరిత్ర, వైద్యపరమైన దృఢత్వం తప్పనిసరి. ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ ఉండదు. అయితే నిపుణుల కమిటీ నిర్వహించే 100 మార్కుల పరీక్షలో అర్హత సాధించాలి. పురుషులు, మహిళలు ఇద్దరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

### విద్యార్హతలు

సాధారణ టెక్నికల్ ట్రేడ్స్ (19) పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ, హెవీ మోటార్ వాహన లైసెన్సుతో ఎస్ఎస్‌సీ (డ్రైవర్), ప్లంబర్/ఎలక్ట్రిషియన్/ఏసీ మెకానిక్ ట్రేడ్స్‌లో ఐటీఐ సర్టిఫికేట్ ఉండాలి..అలాగే సైబర్ క్రైమ్ సహాయం (12) పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు బీటెక్/బీఈ (సీఎస్ఈ/ఐటీ/ఈసీఈ/ఈఈఈ), బీసీఏ/ఎంసీఏ/బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్) లేదా కంప్యూటర్/ఐటీ సంబంధిత డిప్లొమా. ఇంగ్లీష్‌లో మాట్లాడటం, వ్రాయడంలో ప్రావీణ్యం అవసరం అయి ఉండాలి..అలాగే కంప్యూటర్ హార్డ్‌వేర్ రిపేర్ (1) పోస్ట్ కు దరఖాస్తు చేసుకునేవారు గుర్తింపు పొందిన సంస్థ నుంచి కంప్యూటర్ హార్డ్‌వేర్ రిపేర్‌లో ఐటీఐ సర్టిఫికెట్ పొంది ఉండాలి.

### దరఖాస్తు విధానం

ఫిబ్రవరి 25 నుంచి మార్చి 4, 2026 వరకు సూర్యాబాగ్‌లోని పోలీస్ కమిషనర్ కార్యాలయం ఇన్‌వర్డ్ విభాగంలో బయోడేటాతో దరఖాస్తులు సమర్పించాలి.

### షెడ్యూల్

దరఖాస్తుల చివరి తేదీ 04-03-2026,సర్టిఫికెట్ల పరిశీలన 05-03-2026 న నిర్వహిస్తారు. తదుపరి పరీక్షల తేదీలు తరువాత తెలియజేస్తారు. పరిశీలన సమయంలో విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్, జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని అధికారులు సూచించారు.

## హైకోర్టు నూతన న్యాయమూర్తి బాలాజీకి సత్కరించిన సీనియర్ న్యాయవాది డాక్టర్ మజ్జి



గరివిడి ఫిబ్రవరి,24 ప్రభాత వార్త

రాష్ట్ర హైకోర్టు నూతన న్యాయమూర్తి గా బాధ్యతలు చేపట్టిన మేడమిల్లి బాలాజీకి గరివిడికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది డా.మజ్జి సూరిబాబు దుస్సాలువ తో ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. నూతనంగా న్యాయమూర్తి పీఠాన్ని అధిష్టించిన బాలాజీ కి ఆయన సాదర స్వాగతం పలికారు. డాక్టర్ మజ్జి సూరిబాబు తో పాటు హైకోర్టు న్యాయవాదులు సువ్వాడ వెంకట దివ్య హరిత, మజ్జి వెంకట సూర్య రచన లు కూడా న్యాయమూర్తి కి సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## ప్రశాంతంగా ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక

### పారదర్శకంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు విధులు నిర్వహించాలి- డుమా పిడి శారదా దేవి

గరివిడి ఫిబ్రవరి,24 ప్రభాత వార్త



గరివిడిలో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. 1.04 .2024 నుండి 31.03.2025 వరకు 1488 పనులకు గాను 27 కోట్ల 36 లక్షలు 48 వేల 796 రూపాయలు నిధులు ఖర్చు చేశారు.మండలంలో 30 గ్రామ పంచాయతీలు 17 హేబిటేషన్ లలో చేపట్టిన ఎం జి ఎన్ ఆర్ జి ఎస్ పనులకు గాను 27 కోట్ల నిధులు వ్యయం చేశారు. ఈ నేపథ్యంలో నవంబర్ 1 2025 నుండి 2026 ఫిబ్రవరి,5 వరకు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పనులు నిర్వహణ, వేతన దారులకు అందిన పైకం, ఏ మేరకు పనులు జరిగాయో పరిశీలన,నిధులు ఖర్చు తదితర అనేక అంశాలపై నిర్వహించిన తుది పరిశీలన అనంతరం మంగళవారం జరిగిన ప్రజావేదిక కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ప్రజా వేదిక సభ లో పాల్గొన్న జిల్లా జల యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్.శారదా దేవి మాట్లాడుతూ ఉపాధి క్షేత్ర సహాయకులు నిబద్ధతతో పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎటువంటి అవినీతి కి తావివ్వకూడదని ఆమె స్పష్టం చేశారు. కాగా బొండ పల్లి ఫీల్డ్ ఆసిస్టెంట్ ఉపాధి వేతన దారులకు శత శాతం పనిదినాలు కల్పించడం పట్ల పిడి ఫీల్డ్ ఆసిస్టెంట్ ని అభినందించారు. ప్లాస్టిక్ బాటిల్ లను వినియోగించ వద్దని ఆమె పేర్కొన్నారు. ప్రజా వేదికలో ఎంపిపి మీసాల విజయ లక్ష్మి, ఎంపిడిఓ ఎం వి బి సుబ్రహ్మణ్యం, మాజీ ఏ ఎం సి చైర్మన్ మీసాల విశ్వేశ్వర రావు, వైస్ ఎంపీపీ గుడివాడ వెంకట శ్రీరాములు నాయుడు, అంబుడ్స్ మెన్ యాకూబ్ బాషా, విజిలెన్స్ అధికారి పి.వెంకట రమణ రావు,పి ఈ కె.బానోజీ, ఏ పి ఈ నారాయణ రావు, ఏపీవో కనక రాజు వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఉపాధి క్షేత్ర సహాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## నాగర్ కర్నూల్ నిందితులపై చర్యలు చేపట్టాలి

### రజక సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు డిమాండ్

నెల్లిమర్ల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న స్వామి జాతరలో చాకలి చంద్రకళను, ఆమె కుటుంబ సభ్యులను దారుణంగా కొట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని విజయనగరం ఉమ్మడి జిల్లా రజక కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తంగేటి భాస్కరరావు డిమాండ్ చేశారు. నెల్లిమర్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ దాడిలో కాలితో తన్నినందుకు రెండు నెలల చిన్నారి మృతి చెందిందని అన్నారు. బాధితులు ఫిర్యాదు చేసినా కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రకుల నాయకులకు భయపడి పోలీసులు పట్టించుకోకపోవడం విచారకరమని భాస్కరరావు ఆవేదన చెందారు.దీని మూలంగా ఈ నెల 25న బుధవారం భారీ ఎత్తున ర్యాలీ తీసి రజకులకు తగు న్యాయం చేసేంతవరకు పోరాడుతామని భాస్కరరావు స్పష్టం చేశారు. కూటమి పార్టీల పెద్దలు గతంలో ఇచ్చిన హామీ మేరకు రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## పెన్షనర్ల సంఘ అధ్యక్షుడుగా యజ్జిపురపు

గరివిడి ఫిబ్రవరి,24 ప్రభాత వార్త



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘ గరివిడి శాఖ అధ్యక్షునిగా సీనియర్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత యజ్జిపురపు సత్యం ఎన్నికయ్యారు. రాబోయే మూడు సంవత్సరాల కాలానికి ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో సత్యం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. అలాగే సంఘ కార్యదర్శిగా బి.మోహన రావు, కోశాధికారి గా కె. పైడినాయుడు, గౌరవాధ్యక్షులుగా జమ్ము మహాలక్ష్మి నాయుడు, సహ అధ్యక్షునిగా వి వి ఎస్ ఎస్ ఎన్ గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శి గా మీసాల వెంకట రమణ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా జిల్లా శాఖ అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు, కార్యదర్శి నారాయణ ల సమక్షంలో ఎన్నికలు జరిగాయి.

## మట్టి దొంగలు గ్యాంగ్‌పై కలక్టర్ చర్యలు తీసుకోవాలి..!

### జనసేన నాయకులు అడ్వకేట్ రేగు మహేష్ -రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ కార్యదర్శి గొంప ప్రకాష్



సాలూరు ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

గత వైసీపీ సర్కార్‌లో మట్టి ఇంకా ఇసుక అక్రమంగా కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాకు చిల్లుపెట్టిన మాఫియా గ్యాంగ్ పై విరుచుకుపడ్డ టీడీపీ నాయకులు ఇప్పుడు వారి కూటమి ప్రభుత్వంలో అర్ధరాత్రి మట్టి అలాగే ఇసుకను తరలిస్తుండగా టీడీపీ నేతలు కళ్ళకు గంతలు కట్టుకుని కూర్చున్నారా అని జనసేన నాయకులు అడ్వకేట్ రేగు.మహేష్ అలాగే రాష్ట్ర రిపబ్లికన్ ఇన్ పార్టీ కార్యదర్శి గొంప ప్రకాష్ విమర్శించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతు ఈమధ్య మట్టి దోపిడీ ఇంకా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని పలు పత్రికల్లో అలాగే సాలూరు చరవాణి గ్రూపులలో హల్చల్ చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే రెవెన్యూ అధికారులను దీనిపై ప్రశ్నిస్తే కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఆక్షేపించారు.అందువలన అన్ని ఆధారాలతో ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని అడ్వకేట్ రేగు మహేష్ ఇంకా రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ కార్యదర్శి గొంప ప్రకాష్ క్లారిటీ ఇచ్చారు.

## రామాలయ నిర్మాణానికి బంగార్రాజు రూ.50 వేల విరాళం

భోగాపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



మండలం లోని గుడివాడ గ్రామంలో జరుగుతున్న నూతన రామాలయ నిర్మాణానికి ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు 50 వేల రూపాయల విరాళాన్ని అందజే శారు. పోలిపల్లిలోని తన స్వగృహం వద్ద ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం ఈ మొత్తాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ సర్పంచ్ చిల్ల సురేష్ రెడ్డి ,గ్రామ టీడీపీ అధ్యక్షులు పరశురామ్ ,టీడీపీ నాయకులు రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి కోసం కృషి చేస్తా ఎంపీడీఓ అల్లు భాస్కరరావు



లక్క వరపు కోట ఫిబ్రవరి 24 ప్రభాత వార్త

లక్క వరపు కోట మండల అభివృద్ధి కి మండల నాయకులు అధికారుల ప్రజల సహకారం తో తన వంతు కృషి చేస్తాను అని నూతన ఎంపీడీఓ గా బాధ్యతలు స్వీకరించిన అల్లు భాస్కరరావు తెలిపారు తాను ఈ ఓ పి ఆర్ డి గా బొబ్బిలి మండలం లో అలాగే పలు మార్లు ఇంచార్జి ఎంపీడీఓ గా బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉందని ఎల్ కోట కి ఎంపీడీఓ ప్రమోషన్ రావడం ద్వారా వచ్చాను అని తాను పూర్తి గా క్షేత్ర స్థాయి లో గ్రామాలలో పర్యటన చేసి సమస్యలు తెలుసు కుని అందరి సహకారం తో వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తాను అన్నారు

## తమ తమ ప్రాంతాల్లో బాల్యవివాహాలు నిర్మూలనకై అవగాహన కల్పించాలి

### జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ అధికారి శ్రీధర్

పాచిపెంట ఫిబ్రవరి 24 ప్రభాత వార్త



బాల్యవివాహాలు నిర్మూలనకై విద్యార్థినీ విద్యార్థులు తమ తమ గ్రామాల్లో ఆడపిల్లల కన్న తల్లిదండ్రులకు అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ కం ప్రొబిషన్ అధికారి శ్రీధర్ అన్నారు. బాల్య వివాహాలపై అవగాహన సదస్సులు జిల్లా కలెక్టర్ ఎన్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డిఆదేశాల మేరకు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మంగళవారం కర్రీవలస కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బాల్యవివాహాలపై అనర్థాలను వివరిస్తూ ప్రస్తుత రోజుల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏ విధంగా పరిష్కరించుకోవాలని వారి హక్కులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు దృష్టి సారించి అనారోగ్యానికి గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి సూచించారు . వివిధ చట్టాలపై మరియు అనర్థాలు గూర్చి, పోక్స్ చట్టం 2012 కింద మంచి స్పర్శ--చెడు స్పర్శ , టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే నష్టాలు, మహిళలపై వేధింపులు, పోలీస్ సేవలు, వన్ స్టాప్ సెంటర్ సేవలు మరియు మిషన్ వాత్సల్య కార్యక్రమాలపై సమగ్ర , బాలబాలికలు లైఫ్ స్కిల్స్ పౌష్టికాహారం, ఆరోగ్యము మరియు విద్య,అవగాహన కల్పించారు. ముందుగా విద్యార్థినీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగ కౌన్సిలర్ నాయుడు, ఔట్‌రీచ్ వర్కర్ ఆర్. హరికృష్ణ, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తారపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



రామభద్రపురం మండలం ప్రభాతవార్త

తారపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి అమర శివ మాట్లాడుతూ రైతులు భూమి ఆరోగ్యం కాపాడుకోవాల్సిన తీసుకొని జాగ్రత్తలు అదేవిధంగా పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగాలు మరియు నానో యూరియా వాడే విధానం గురించి తెలిపారు అదే విధంగా పంట నమోదు వలన కలిగే ఉపయోగాలు,ఇ-క్రాఫ్= రైతు నమోదు అదేవిధంగా కేంద్ర రాష్ట్ర పథకాలు అయినటువంటి అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాలపై అవగాహన కల్పించాము ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది బి మాధురి వ్యవసాయ విస్తరణ అధికారి జి శరత్ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్లారమ్మ జాతర మహోత్సవం

### భక్తులతో కిక్కిరిసిన అమ్మవారి ఆలయం

శృంగవరపుకోట,ఫిబ్రవరి24,ప్రభాతవార్త..



ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన ఎస్.కోట నియోజకవర్గంలోని జామి మండల కేంద్రలో ఉన్న ఎల్లారమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవ కార్యక్రమం మంగళవారం అత్యంత ఘనంగా జరిగింది.ముందురోజు సోమవారం తొలేళ్ళ ఉత్సవంతో ప్రారంభమైన జాతర మహోత్సవం మంగళవారంతో ఘనంగా ముగిసింది.ఈనెల 25 బుధవారం చిన్న తీర్థంతో అమ్మవారి జాతర మహోత్సవం పూర్తిగా ముగియనుంది.ఇక మంగళవారం జరిగిన జాతర మహోత్సవంలో అమ్మవారి దర్శినం కోసం వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, పంచాయతీ సిబ్బంది ఘనంగా ఏర్పాట్లు చేశారు.అలాగే ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఆర్.గోవిందరావు ఆధ్వర్యంలో 200మందితో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.అదేవిధంగా సీసీ కెమెరాల అమర్చి గట్టి నిఘా ఏర్పాటు చేశారు.అలాగే జాతరలో జామి పీహెచ్ సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.జాతర సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.అమ్మవారి జాతరకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చినట్లు తెలుస్తోంది.మొత్తం మీద సంభందిత శాఖల అధికారులు అందరూ సమన్వాయంతో పనిచేసి జాతర మహోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు.

## ఘనంగా చిన్నమ్మ తల్లి అమ్మవారి పండగ



రామభద్రపురం, ఫిబ్రవరి24,ప్రభాతవార్త..

రామభద్రపురం గ్రామంలో చిన్నమ్మ తల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుండే చుట్టూ ప్రక్కల గ్రామాల భక్తులు క్యూ లైన్ లో నిలబడి అమ్మవారికి ప్రత్యేక పూజ లునిర్వహించి దర్శించుకున్నారు. అలాగే అమ్మవారి ఘటాలను పలు వీధుల్లో ఊరేగింపు జరిపి డీజే, చిరతలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ లు భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వెలమల ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు పలు వీధులకు చెందిన యువకులు పులిహోరం, మజ్జిగ వంటివి ఏర్పాటు చేశారు.కూరగాయల మార్కెట్లో లైటింగ్ సెట్టింగులు తో డాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. బుధవారం అంజలి రథం కార్యక్రమం అయినఅమ్మవారి ఘటాలను డొమ్మిరి మేళంతో అనుపో ఉత్సవంవంటి కార్యక్రమం చేస్తారు.



## జాతరలో జోరుగా పేకాటలు...

చీపురుపల్లి ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

చీపురుపల్లిలో వెలసిన శ్రీ శ్రీ కనకమాలక్ష్మి అమ్మవారి 28వ జాతర మహోత్సవంలో అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ విచ్చల విడిగా కొంతమంది పట్టి ఆటతో పాటు యదేచ్చగా పేకాట కూడా నిర్వహించడం పట్ల స్థానికులు పోలీసులు, నిర్వాహకుల పనితీరుని దుయ్య పడుతున్నారు. పోలీస్ ఉన్నత అధికారులు సైతం జాతరలో పేకాటకు అనుమతి లేదని ప్రకటన చేసినప్పటికీ ఎలా కొనసాగుతున్నాయని ప్రశ్నిస్తు న్నారు. అమాయక భక్తులను టార్గెట్ చేసుకొని నిర్వాహకులు అడ్డగోలుగా వారి దగ్గర నుంచి డబ్బులను దోచుకుంటున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్వాహకుల సదరు పైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

చీపురుపల్లి ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



చీపురుపల్లి పట్టణంలో వెలసిన శ్రీ శ్రీ కనకమాలక్ష్మి 28వ జాతర మహోత్సవాలు భాగంగా మంగళవారం పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. విజయనగరం జిల్లా డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, శాసనమండలి విపక్ష నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష, స్థానిక జడ్పిటిసి వల్లి రెడ్డి శిరీష దంపతులు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి దంపతులు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

మెరకముడిదాం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



మండలంలో గరుగుబిల్లి పంచాయతీ సర్పంచ్ ఆవాల అప్పలనాయుడు ఆధ్వర్యం లో రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి లేకుండా గ్రామంలో ఇంటిం టి కొళాయి మరమ్మతులు చేయడం కాకుండా, వాటర్ ట్యాంకులకు పెయింటింగ్ వేశారు. వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకుండా ముందు చూపు గా చర్యలు చేపడుతున్న సర్పంచ్ ఆవాల అప్పలనాయుడుని గ్రామస్తులు కొనియాడుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఉమా రామలింగేశ్వర ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి ప్రజా ప్రతినిధులు హాజరు

దత్తిరాజేరు, ఫిబ్రవరి24.ప్రభాతవార్త



మండలంలోని టీ బూర్జువలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి మరకత శివలింగ ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి సాలూరు నియోజకవర్గం వైయస్సార్ పార్టీ మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర మాజీ ఎంపీ బెల్లాన్ని చంద్రశేఖర్ గజపతినగరం మాజీ శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య టిడిపి మాజీ శాసనసభ్యులు కొండపల్లి అప్పలనాయుడు ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి హాజరయ్యారు వీరికి గ్రామం పెద్దలు ప్రజలు స్వాగతం పలికి పురోహితులు మంత్రోచ్చారణతో సన్నయ్య మేళంతో ఆలయంలోకి తీసుకువెళ్లారు ఆలయంలోని శివలింగాల మరియు చండీశ్వర విగ్రహాల వద్ద వేద పండితులు వీరికి గోత్రనామాలు చదివి ప్రత్యేక పూజలు జరిపి శివలింగాలకు పాలాభిషేక చేశారు అనంతరం వినాయకుడు పార్వతి దేవి కళ్యాణ వెంకటేశ్వర స్వామి సుబ్రహ్మణ్యస్వామి ఐదు గోపురాల వద్ద పూజలు చేసి శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి కరుణ కటాక్షం గ్రామ ప్రజలు పైన మనందరిపై ఉండాలని ప్రార్థించామన్నారుఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద శివాలయాలు నిర్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు ప్రజలకు దేవుని పూజిస్తే మనకి మేలు జరుగుతుందని ఆలోచన భావన ప్రతి భక్తుడు మనసులో కలిగిందని శివాలయానికి భక్తులువెళ్లి పూజలు చేస్తే సర్వ దోషాలు తొలుగుతాయనీ ప్రజల నమ్మకం.పురోహితులు వేద పండితులు శివాలయంలో గ్రామంలో ఉన్న దంపతులకు వారి యొక్క గోత్రనామాలు చదివి హోమాలు రుద్రాభిషేకం కలశం పూజలు చేశారు అంగరంగ వైభవంగా ప్రతిష్ట కార్యక్రమం జరుపబడుతుందని గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు తెలిపారు మూడో రోజు విగ్రహాల ప్రతిష్ట పూజలు నిర్వహిస్తామని అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసామని భక్తులందరూ పాల్గొని దేవుని ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు సేకరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మెంటాడ జడ్పిటిసి ప్రతినిధి లెశీక.రత్నాకర్ గ్రామ పెద్దలు ప్రజలు వివిధ హోదాల్లో ఉన్నప్రజాప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## వీఆర్వో సంఘ అధ్యక్షులుగా తిరుపతిరావు

మెరకముడిదాం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



మండలంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షునిగా ఆర్.తిరుపతిరావుని సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా జి ఆదినారాయణ, కార్యదర్శిగా బి శ్రీనివాసరావు, కోశాధికారిగా టి శ్రీలత, సంయుక్త కార్యదర్శి గా ఎస్ సావిత్రి ఎన్నిక కాబడ్డారు. నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులను మండల రెవెన్యూ తాహసిల్దార్ ఆకుల సులోచన రాణి అభినందించారు.



## మంత్రి జనార్ధన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కోళ్ల..

### రోడ్లు అభివృద్ధికి సహకరించాలి.

శృంగవరపుకోట,ఫిబ్రవరి24,ప్రభాతవార్త..

రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని పలు ప్రధాన రహదారుల అభివృద్ధి,విస్తరణ, మరమ్మతులు అలాగే రవాణా సౌకర్యాలు మెరుగు పరచాలని కోరుతూ మంత్రికి కోళ్ల వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు.

## సంపద సృష్టితోనే గ్రామాల అభివృద్ధి

దత్తిరాజేరు ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

పంచాయతీలో సంపదను సృష్టించి గ్రామాలను అభివృద్ధి పరచాలని అడ్మినిస్ట్రేషన్ అధికారి శివాజీ అన్నారు మంగళవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు సాంకేతి సహాయకులకు ఓన్ సోర్స్ రెవెన్యూ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ లక్ష్యాలు డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంటి పన్ను వసూలు వేలంపాట డిజిటలైజేషన్ ప్రక్రియ విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి పరిశుభ్రమైన తాగునీరు అందించే చర్యలు గ్రామాల సమగ్ర అభివృద్ధికి రూపొందించాల్సిన ప్రణాళికలపై ఆయన వివరించారు.


ఇండియన్ బ్యాంక్ | బొబ్బిలి బ్రాంచ్, కేరాఫ్ : వెంకట రమణ ఏజెన్సీస్, చర్చ్ సెంటర్, బలిజిపేట రోడ్డు, బొబ్బిలి, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 535558.

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన

"APPENDIX- IV-A" ( రూలు 8(6)కు నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

ఈ విధంగా సాధారణంగా ప్రజలకు మరియు ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు నోటీసులు ఇవ్వడమైనది. క్రింద వివరించిన స్థిరాస్తి సెక్యూర్డు క్రెడిటార్, తనఖా పెట్టిన వీటిని ఇండియన్ బ్యాంక్, బొబ్బిలి బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి తేది.04-03-2025న భౌతికంగా స్వాధీనతలోనికి తీసుకున్నారు. అమ్మకం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై ది.11-03-2026న అమ్మబడుతుంది. ఇండియన్ బ్యాంక్, బొబ్బిలి బ్రాంచ్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం ది.23-02-2026 నాటికి రూ.16,03,739/- (అక్షరాల పదహారు లక్షల మూడు వేల ఏడు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రము)+ తేది.24.02.2026 నుండి తదుపరి జమకూడు వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మొ॥నవి. ఋణగ్రహీత : మెస్సర్స్ రిషిక ఫాల్ జి బ్రిక్ ఇండస్ట్రీ, ప్రొప్రయిటర్ : అడబాల శ్రీనివాసరావు, ఫ్లాట్ నెం.48, ఏపిఐఐసి గ్రోత్ సెంటర్, బొబ్బిలి - 535558. శ్రీ అడబాల శ్రీనివాసరావు, తండ్రి : ఏ. సత్యనారాయణ (లేటు), నెం.25-1-20/20, ఫ్లాట్ నెం.201, సాయి భాస్కర్ హోమ్స్, వుడా కాలనీ, ఫేజ్-2, పెదగంట్యాడ, విశాఖపట్నం - 530044.

ఇ-వేలం ద్వారా అమ్మకానికి ప్రతిపాదించబడిన ఆస్తుల యొక్క నిర్దిష్ట వివరములు దిగువన పేర్కొనబడినవి

| ఆస్తి యొక్క పూర్తి వివరణ : | రిజర్వు ధర | ధరావత్తు | ఈ - వేలము తేది మరియు సమయం | ఆస్తిపై ఎన్‌కంబ్రెన్స్ |
|---|---|---|---|---|
| తనఖా ఆస్తులు: విజయనగరం జిల్లా - 535558, బొబ్బిలి సబ్ రిజిస్ట్రార్, బొబ్బిలి మండలం, గొల్లపల్లి గ్రామం, ఏపిఐఐసి గ్రోత్ సెంటర్, సర్వే నెం.22, ఫ్లాట్ నెం.48తో గల యావత్తు ఆస్తి. వ్యవసాయేతర భూమి విస్తీర్ణం 1500 చ॥గు॥లు., ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు : 24 మీ॥ల వెడల్పు రోడ్డు, పడమర : ఫ్లాట్ నెం.32, దక్షిణం : ఫ్లాట్ నెం.47, ఉత్తరం : ఫ్లాట్ నెం.49. ఆస్తి ఐడి నెం.: IDIB6810947059 | రూ. 43,58,000/- (అక్షరాల నలభై మూడు లక్షల యాభై ఎనిమిది వేల రూపాయలు మాత్రమే) | రూ. 4,35,800/- (అక్షరాల నాలుగు లక్షల ముప్పై ఐదు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే) | 11-03-2026 సమయం : ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/- (అక్షరాల పదివేల రూపాయలు) | లేదు |

ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి మొత్తాన్ని చెల్లించడానికి చివరి తేది మరియు సమయం : ది.10.03.2026 & సాయంత్రం గం.5 :00 ని॥లకు

వేలం బిడ్ ఫారం మరియు నియమనిబంధన వివరములను మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ M/s PSB Alliance వారి వెబ్‌సైట్ (www.baanknet.com) నందు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనుటకు చూడవలసినదిగా బిడ్డర్స్‌కు సలహానీయటమైనది. ఇ-వేలం పూర్తి విధానం సాంకేతిక సహాయం కొరకు M/s PSB Alliance హెల్ప్‌డెస్క్ నెం. 08291220220 మరియు సర్వీసు ప్రొవైడర్‌లో లభించు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్‌లను సంప్రదించండి. M/s PSB Alliance. రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం దయచేసి support.baanknet@psballiance.com మరియు ధరావత్తు స్టేటస్ కోసం దయచేసి support.baanknet@psballiance.com సంప్రదించవచ్చును. ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫొటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://baanknet.comను సంప్రదించండి. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణలకోసం హెల్ప్‌లైన్ నెంబర్ 08291220220 నందు సంప్రదించండి. https://baanknet.com లో వెబ్‌సైట్‌లోని ఆస్తికోసం చూస్తున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు చూడగలరు.

గమనిక : ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీ, ఐదిలీ ఛార్జీలు, ఫీజు వగైరాలు మరియు చట్టపరమైన/నాన్ స్టాట్యూవరి బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరాలు కొనుగోలు దారే భరించవలెను.

ప్రదేశం : బొబ్బిలి

తేది : 24-02-2026

సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్



ఇండియన్ బ్యాంక్ | బొబ్బిలి బ్రాంచ్, కేరాఫ్ : వెంకట రమణ ఏజెన్సీస్, చర్చ్ సెంటర్, బలిజిపేట రోడ్డు, బొబ్బిలి, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 535558.

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన

"APPENDIX- IV-A" ( రూలు 8(6)కు నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

ఈ విధంగా సాధారణంగా ప్రజలకు మరియు ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు నోటీసులు ఇవ్వడమైనది. క్రింద వివరించిన స్థిరాస్తి సెక్యూర్డు క్రెడిటార్, తనఖా పెట్టిన వీటిని ఇండియన్ బ్యాంక్, బొబ్బిలి బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి తేది.28-05-2024న భౌతికంగా స్వాధీనతలోనికి తీసుకున్నారు. అమ్మకం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై ది.11-03-2026న అమ్మబడుతుంది. ఇండియన్ బ్యాంక్, బొబ్బిలి బ్రాంచ్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం ది.23-02-2026 నాటికి రూ.24,86,602/- (అక్షరాల ఇరవై నాలుగు లక్షల ఎనభై ఆరు వేల ఆరు వందల రెండు రూపాయలు మాత్రము) + తేది.24.02.2026 నుండి తదుపరి జమకూడు వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మొ॥నవి. ఋణగ్రహీత : మెస్సర్స్ సిరి చరణ్ ఫాల్ జి బ్రిక్ ఇండస్ట్రీ, ప్రొప్రయిటర్ : అడబాల పార్వతీ దేవి, ఫ్లాట్ నెం.89, ఏపిఐఐసి గ్రోత్ సెంటర్, బొబ్బిలి - 535558. ప్రొప్రయిటర్: అడబాల పార్వతీ దేవి, భర్త : అడబాల శ్రీనివాసరావు, నెం. 25-1-20/20, ఫ్లాట్ నెం.201, సాయి భాస్కర్ హోమ్స్, వుడా కాలనీ, ఫేజ్-2, పెద గంట్యాడ, విశాఖపట్నం - 530044. హామీదారు: అడబాల శ్రీనివాసరావు, తండ్రి : ఎ. సత్యనారాయణ (లేటు), నెం. 25-1-20/20, ఫ్లాట్ నెం.201, సాయి భాస్కర్ హోమ్స్, వుడా కాలనీ, ఫేజ్-2, పెద గంట్యాడ, విశాఖపట్నం - 530044.

ఇ-వేలం ద్వారా అమ్మకానికి ప్రతిపాదించబడిన ఆస్తుల యొక్క నిర్దిష్ట వివరములు దిగువన పేర్కొనబడినవి

| ఆస్తి యొక్క పూర్తి వివరణ : | రిజర్వు ధర | ధరావత్తు | ఈ - వేలము తేది మరియు సమయం | ఆస్తిపై ఎన్‌కంబ్రెన్స్ |
|---|---|---|---|---|
| విజయనగరం జిల్లా, బొబ్బిలి సబ్ రిజిస్ట్రార్, బొబ్బిలి మండలం, గొల్లపల్లి గ్రామం, ఏపిఐఐసి గ్రోత్ సెంటర్, ఫ్లాట్ నెం.89, సర్వే నెం.23 లోని 1794 చ॥గు॥ల విస్తీర్ణం గల యావత్తు ఆస్తి. స్థలమునకు హద్దులు : తూర్పు : 24 మీ॥ల వెడల్పు రోడ్డు, పడమర : ఫ్లాట్ నెం.88, దక్షిణం: ఫ్లాట్ నెం.111, ఉత్తరం : 24 మీ॥ల వెడల్పు రోడ్డు. ఆస్తి ఐడి నెం.:IDIB6951532565 | రూ. 44,16,120/- (అక్షరాల నలభై నాలుగు లక్షల పదహారు వేల నూట ఇరవై రూపాయలు మాత్రమే) | రూ. 4,41,612/- (అక్షరాల నాలుగు లక్షల నలభై ఒక్క వేల ఆరు వందల పన్నెండు రూపాయలు మాత్రమే) | 11-03-2026 సమయం : ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు బిడ్ పెంపుదల మొత్తం: రూ. 10,000/- (అక్షరాల పదివేల రూపాయలు) | లేదు |

ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి మొత్తాన్ని చెల్లించడానికి చివరి తేది మరియు సమయం : ది.10.03.2026 & సాయంత్రం గం.5 :00 ని॥లకు

వేలం బిడ్ ఫారం మరియు నియమనిబంధన వివరములను మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ M/s PSB Alliance వారి వెబ్‌సైట్ (www.baanknet.com) నందు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనుటకు చూడవలసినదిగా బిడ్డర్స్‌కు సలహానీయటమైనది. ఇ-వేలం పూర్తి విధానం సాంకేతిక సహాయం కొరకు M/s PSB Alliance హెల్ప్‌డెస్క్ నెం. 08291220220 మరియు సర్వీసు ప్రొవైడర్‌లో లభించు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్‌లను సంప్రదించండి. M/s PSB Alliance. రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం దయచేసి support.baanknet@psballiance.com మరియు ధరావత్తు స్టేటస్ కోసం దయచేసి support.baanknet@psballiance.com సంప్రదించవచ్చును. ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫొటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://baanknet.comను సంప్రదించండి. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణలకోసం హెల్ప్‌లైన్ నెంబర్ 08291220220 నందు సంప్రదించండి. https://baanknet.com లో వెబ్‌సైట్‌లోని ఆస్తికోసం చూస్తున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు చూడగలరు.

గమనిక : ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీ, ఐదిలీ ఛార్జీలు, ఫీజు వగైరాలు మరియు చట్టపరమైన/నాన్ స్టాట్యూవరి బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరాలు కొనుగోలు దారే భరించవలెను.

ప్రదేశం : బొబ్బిలి

తేది : 24-02-2026

సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

## వేతనాలు పెంచాలి.. సమస్యలు తీర్చాలి

### మార్చి 5న ఛలో విజయవాడకు ఆశా వర్కర్ల పిలుపు



కొత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం మార్చి 5వ తేదీన నిర్వహించనున్న ఛలో విజయవాడకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపునిచ్చింది. కొత్తూరు మండలంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన యూనియన్ కమిటీ సమావేశంలో నాయకులు కె.జ్యోత్స్న, ఎస్.గౌరమ్మ, పి.జయలక్ష్మి, పూర్ణిమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు సంవత్సరాలు గడుస్తున్నా ఆశా వర్కర్లకు వేతనాలు పెంచకపోవడంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం వేతనాల పెంపును విస్మరించడం అన్యాయమని, కనీసం డీఏ కూడా అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.10,000 గౌరవ వేతనంలో ఆసుపత్రుల చుట్టూ తిరగడానికే రూ.3 నుండి 4 వేలు ఖర్చవుతున్నాయని వారు వివరించారు. గత 20 ఏళ్లుగా ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస సెలవులు లేకపోవడం వల్ల వారు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఆశాల సంఖ్యను పెంచాలని, పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే శిక్షణ పొందిన ఏఎన్ఎం, జీఎన్ఎం ఆశా వర్కర్లకు పర్మినెంట్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం కల్పించడంతో పాటు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించాలని, ప్రతి పీహెచ్సీ పర్యటనకు టీఏ, డీఏలు చెల్లించాలని ప్రభుత్వానికి విన్నవించారు. డిమాండ్ల సాధనలో భాగంగా మార్చి 5న విజయవాడలోని అలంకార్ సెంటర్ వద్ద జరిగే మహా ధర్నాలో ఆశా వర్కర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలపాలని నాయకులు కోరారు. రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం, నాణ్యమైన మొబైల్ ఫోన్లు, యూనిఫామ్ పంపిణీ వంటి అంశాలపై ప్రభుత్వం స్పందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుశీల, కళావతి, అప్పలమ్మ, క్రాంతికుమారి, భాగ్యం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ నిజాయితీ



కంచిలి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకొని శభాష్ అనిపించుకున్నాడు. కంచిలి గ్రామం బల్యాపుట్టుగ కాలనీలో నివసిస్తున్న ఆటో డ్రైవర్ కంచమ్మ తల్లి ఆటో యూనియన్ సభ్యుడు దుదిష్టి సాహు మంగళవారం ఉదయం సోంపేట రైల్వే స్టేషన్ నుండి ప్రయాణికులను తన ఆటోలో తలతంపర పంచాయితీ సూదిపుట్టుగ గ్రామానికి తీసుకువెళ్లాడు. వారిని దింపి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో చూసేసరికి ప్రయాణికుల పర్సు ఆటోలో పడి ఉండడం గమనించాడు. వెంటనే మనీ పర్స్ తెరిచి దానిలో 5000 రూపాయిలు నగదుతో పాటు రెండు తులాల బంగారం ఉండడంతో వెంటనే ఆటోను తిప్పి సూది పుట్టుగ గ్రామానికి వెళ్లి ఆటోలో ప్రయాణించిన వ్యక్తులకు అందించడంతో అందరూ ఆటో డ్రైవర్ను అభినందించారు. ఈ కాలంలో కూడా ఇటువంటి నిజాయితీపరులు, విలువలు కలిగిన వ్యక్తులు ఉండడం ఎంతో గొప్ప విషయమని పలువురు పేర్కొన్నారు. జరిగిన సంఘటనను ఆటో యూనియన్ సభ్యులు తెలుసుకొని ఆయనను అభినందించారు.

## గురుకులంలో ప్రవేశ పరీక్షలు

కంచిలి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

కంచిలి గొల్ల కంచిలి గ్రామం వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 6 నుండి 9వ తరగతులు ఖాళీల కొరకు ప్రవేశ పరీక్షలు మార్చి 2న రద్దుపరిచి మార్చి 8వ తేదీన ఆదివారం నిర్వహిస్తున్నట్లు గురుకుల సిబ్బంది పత్రిక ప్రకటనలో తెలియజేశారు.

## గ్రూప్-ఎ అధికారిగా గెడ్డవూరు వాసి



మందస, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

భారత రాష్ట్రపతి ఆమోదంతో విడుదలైన అధికారిక ఉత్తర్వుల మేరకు గెడ్డవూరు గ్రామానికి చెందిన వంక సురేష్ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కార్యాలయంలో ఉన్నత గణకాధికారి (గ్రూప్-ఎ)గా పదోన్నతి పొందినట్లు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ చదువు ప్రతి ఒక్కరి జీవితంలో మార్పును తీసుకొస్తుందని మన తలరాతను మార్చేది చదివేనని తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ మందస మండలం దున్నవూరు పంచాయతీ గెడ్డవూరు గ్రామంలో జన్మించి ఇంతటి ఉత్తమ స్థాయిలోకి రావడం గ్రామానికి గర్వకారణమని, ఈ సందర్భంగా వాల్తేరు డివిజన్ ఏడిఆర్ఎం కుందు రామారావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సురేష్ మాట్లాడుతూ రామారావు నాకు మంచి మార్గదర్శి అని తెలిపారు. నిరంతరం ఆయన సలహాలు సూచనలు పాటిస్తుంటానని తెలిపారు. సురేష్కి కొమర గోపాలరావు, భాస్కరరావు, జోగారావు కిరణ్ పాపారావు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామ ప్రజలతో పాటు పలువురు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

## కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు అసెంబ్లీలో ఎమ్మెల్యే కూన ప్రస్తావన

ఆమదాలవలస, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త)



రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో అసెంబ్లీ వేదికగా ప్రశ్నోత్తరాల సమయంలో స్థానిక ఎమ్మెల్యే శాసనసభ పియుసి కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ కేజీబీవీ ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించారు. కేజీబీవీ పాఠశాలలో పని చేస్తున్న ప్రిన్సిపల్స్ అతి తక్కువ వేతనం 30 వేల రూపాయలు, సి ఆర్ టి లకు 28 వేలు, సిబ్బందికి 14 వేలు తక్కువ వేతనం అందిస్తున్నారని సమాన పనికి సమాన వేతనం అందించి, ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలు నిర్వహిస్తున్న వారికి రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ ప్రిన్సిపల్ నియమించాలని సభలో ప్రస్తావించారు. అలాగే హోం శాఖ సంబంధించి చేపట్టిన చట్ట సవరణలపై అసెంబ్లీలో రవికుమార్ ప్రస్తావించారు. చట్ట సవరణలను అందరికీ అనుకూలంగా టెక్నాలజీని జోడిస్తూ కొత్తగా చట్టాన్ని తీసుకురావడంపై అభినందించారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను సవరించడం అభినందనీయం అంటూనే చట్ట సవరణపై అనేక సూచనలు తెలియజేశారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



సీతంపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

అంగనవాడి కార్యకర్తలకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి ఎం.కాంతారావు. ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారంనకు అంగన్వాడీ కార్యకర్తలు సిడిపిఓ కార్యాలయం ఆవరణలో రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మిగిలిన మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌గా మార్చాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని. కార్మిక చట్టాలు పతిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీతంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పార్వతి, దర్శమ్మి, కోశాధికారి అంజలి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

## చింతాడ ఆశీలు పాట తిరిగి నిర్వహించాలి

### డి పట్టా ఇంటికి సాల్వెన్సీ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన చింతాడ యువత

ఆముదాలవలస, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త)



శనివారం చింతాడ వారపు సంత ఆశీలు వసూళ్ల పాట పారదర్శకంగా నిర్వహించలేదని మునుపెన్నడు లేని విధంగా కేవలం ఇద్దరు వ్యక్తులతో గోప్యంగా వేలంపాట నిర్వహించటంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ చింతాడ గ్రామస్తులు బోర అభిషేక్ ఆధ్వర్యంలో గ్రామ యువత సుమారు 40 మంది మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందించారు. డి పట్టా ఇంటికి సాల్వెన్సీ ఎలా అనుమతించారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. గతంలో వేలంపాట నిర్వహించే ముందు గ్రామంలో దండోరా నిర్వహించే వారని, అలాగే పట్టణంలో మైక్ ద్వారా అనౌన్స్ చేసే వారని ఇవేవీ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిబంధనలను అనుసరించి మున్సిపల్ ఆదాయం పెరిగే విధంగా చింతాడ సంత పాట తిరిగి నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని అందించారు.

## జనవాణి-జనసేన భరోసాలో నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం




కొత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయం వేదికగా జరుగుతున్న 'జనవాణి జనసేన భరోసా' కార్యక్రమం రాష్ట్ర నలుమూలల నుండి బాధితులు, నేతలు తరలివస్తున్న ఈ క్రమంలో, పాతపట్నం నియోజకవర్గం, కొత్తూరు మండల సమస్యలు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ చెంతకు చేరాయి. సుడా ఛైర్మన్ కోరికాన రవి కుమార్ పర్యవేక్షణలో, కొత్తూరు మండల ఉపాధ్యక్షులు మరియు ఏఎంసీ డైరెక్టర్ అదపాక అశోక్ కుమార్ నియోజకవర్గ పరిస్థితులను,నియోజకవర్గంలో పేరుకుపోయిన కీలక సమస్యలపై డిప్యూటీ సీఎం కు కళ్ళకు కట్టినట్లు అశోక్ కుమార్ వివరించారు. నియోజకవర్గం లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, మౌలిక సదుపాయాల లేమిని వివరిస్తూ సిద్ధం చేసిన వినతిపత్రాలను నేరుగా డిప్యూటీ సీఎంకు అందజేశారు. క్షేత్రస్థాయిలో ప్రజల బాధలను విన్న పవన్ కళ్యాణ్, అశోక్ కుమార్ చొరవను అభినందించడమే కాకుండా, ఈ సమస్యలపై తక్షణమే సమీక్ష జరిపి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలకు కట్టుబడి, నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోసం 'ప్రజల పక్షాన నిలబడటమే మా లక్ష్యం' అని పేర్కొన్నారు. సుడా ఛైర్మన్ కోరికాన రవి కుమార్ సమక్షంలో జరిగిన ఈ భేటీ, నియోజకవర్గ రాజకీయాల్లో ఒక కొత్త ఆశను రేకెత్తించింది. తమ సమస్యలు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లడంతో కొత్తూరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీశ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రమదానం



మెళియాపుట్టి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

మెళియాపుట్టి మండల కేంద్రంలో గల ప్రసిద్ధి గాంచిన శ్రీశ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మరికొద్ది రోజులలో డోల్ ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా మంగళవారం శ్రీ శ్రీ వేణు గోపాలస్వామి ఆలయం ఆవరణలో మెళియాపుట్టి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరామ్ చాణుక్య, ఉపాధి వేతనదారులతో కలిసి శ్రమదానం కార్యక్రమం నిర్వహించి ఆలయ ఆవరణను దేవుడును భక్తులు దర్శనం చేసుకునేందుకు గాను వీలుగా శుభ్రం చేయడం జరిగినది. ఈ శ్రమదానం చేసిన ఉపాధి వేతనదారులకు శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆదేశానుసారం టిఫిన్స్, టీ, వాటర్ ప్యాకెట్లను శ్రీకాకుళం టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ కార్యనిర్వాహణ కార్యదర్శి అనపాన రాజశేఖర్ రెడ్డి ఉచితంగా అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రేఖాన వాసు, జిల్లా బిజెపి నాయకులు తాడేలా భూపతిరావు, యూనిట్ కో కన్వీనర్ దుక్క శంకర్ రెడ్డి, కాళ్ళ లచ్చుము, గాలి రామకృష్ణ, మనీ, మురళి, ఉపాధి మెట్లు దల్లి సుమా రెడ్డి, బి.సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో హిందువుల మనోభావాలు దెబ్బ తీశాయి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త) :



వైసీపీ పాలనలో హిందువుల మనోభావాలు దెబ్బతీశాయని రాష్ట్ర కళింగవైశ్య కార్పోరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవనంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఆరచకాలు, దోపిడీలు హిందువుల మనోబావాలు దెబ్బతీశాయని ఆయన ఖండించారు. అక్కడ తయారీ అయిన లడ్డులో నాశిరకం నెయ్యి కలిపి చెడ్డ పేరు తెచ్చేవిధంగా వ్యవహరించారు. కోర్టులు, కమిటీలు తీర్పులను కూడా అంగీకరించకుండా అసత్యాలు పలకడం వారికే చెల్లిందన్నారు. అక్కడ హుండీలో ఒక ఉద్యోగి విదేశి కరెన్సీ దొంగలించి సీసీ కెమెరా ద్వారా దొరికిపోయినప్పటికి ఆ కేసు రద్దు చేయటం బాధాకరమన్నారు. సుమారు రెండు కోట్లు విలువ చేసే తల నీలాలు ఎగుమతి చేస్తు పట్టుబడినా ఎలాంటి చర్యలు లేవన్నారు. సాక్షాత్తు శాసన సభలో వెంకటేశ్వర స్వామి చిత్రపటాలను చేతులతో పట్టుకొని కాళ్లకు పాదరక్షలు వేసుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. అప్పటి పాలనలో సుమారు 300 ఆలయాల్లో విగ్రహాలను కొట్టివేయటం హిందువులు బాదపడే విధంగా చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి హిందువు కాదు కాబట్టే ఇలాంటివి పట్టించుకోకపోవడం దీనికి నిదర్శనమన్నారు. స్వామి వారి మాడ వీధుల్లో జరిగే ఆద్యాత్మిక కార్యక్రమంలో వీధుల్లో చెప్పులు వేసుకొని తిరగడం ఏవత్తు హిందువులకు బాదను కలిగిందన్నారు. ఇలాంటి వన్ని హిందువులు గమనించినప్పటికీ ఆ వెంకటేశ్వరస్వామిని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఆరోపణలు చేయలేదన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పాగోటి ముత్తురాజు, మంగి రమణ, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్. రాంకుమార్ పాల్గొన్నారు.

## బూరగాంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



పాతపట్నం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

మండలంలోని బూరగాం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కే.సింహాచలం మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తప్పనిసరిగా క్షేత్ర పరిశీలన జరిపి పరిస్థితులను బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉన్నందున కాండం తొలుచు పురుగు (తెల్ల కంకి) మరియు పొట్టకుళ్ళు వచ్చే అవకాశం ఉన్నందున క్షేత్ర పరిశీలన జరిపి, ఒకవేళ ఆశించినట్లయితే లీటర్ నీటికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు మరియు ప్రోపి కొనజోల్ ఒక ఎంఎల్ లీటరు నీటికి కలిపి ఒక ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు వనజ, నరుసు నాయుడు రాధాకృష్ణ పొళ్ళాయి, రవి, ఉపేంద్ర, బరోడా, రాంబాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త) :



తమకు న్యాయబద్ధమైన ప్రభుత్వం నుంచి అందాల్సినవి అందించాలని మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం అంగన్వాడీ ఆయాలు రిలే నిరహారదీక్షలు చేపట్టారు. తమ సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనాలు, పెండింగ్‌లో ఉన్న సూపర్వైజర్ పోస్టులు, వేసవి సెలవులు, తదితర అన్ని పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ కార్యాలయంలో పరిధిలోని అంగన్వాడీ ఆయాలు పాల్గొన్నారు.

## పరామర్శ



కంచిలి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

కంచిలి మండలం, చిన్నకొజ్జిరియా పంచాయతీ, చంద్రుపుట్టుగ గ్రామానికి చెందిన చెత్తా మురళి (90) ఇటీవల అనారోగ్యంతో స్వర్గప్రాప్తి పొందారు. వారి చిత్రపటానికి నివాళులు అర్పించి, వారి కుటుంబీకులను పరామర్శించిన వారిలో కంచిలి మండల ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు వజ్జ మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొనపల సురేష్, స్థానిక సర్పంచ్ గొనప సీతారాం, వైస్ సర్పంచ్ చెత్తా మదన్, చెత్తా భీమారావు, చెత్తా భారత్ తదితర పెద్దలు, యువకులు ఉన్నారు.

## సబ్ జైలును సందర్శించిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ

పాతపట్నం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:



పాతపట్నం సబ్ జైలును మంగళవారం శ్రీకాకుళం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.హరిబాబు సందర్శించారు. జైల్లో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారిలో ఎవరికైనా అడ్వకేట్ లేకపోతే గవర్నమెంట్ అడ్వకేట్‌ను నియమిస్తామని తెలియజేశారు. వారి బేరక్ గదులను పరిశీలించారు. అలాగే రికార్డులను, వాష్ రూమ్, స్టోర్ రూంని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీరితో పాటు జైలు సూపరింటెండెంట్ సన్యాసిరావు, సిబ్బంది ఉన్నారు.

## జింకులోపంపై ప్రత్యేక చర్యలు : ఏవో శ్రీదేవి



కవిటి, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త)

పంట పొలాల్లో వరి పైరుకు జింక్ లోపం ఏర్పడితే తీసుకోవలసిన చర్యలపై శ్రీదేవి రైతులతో బొరివంక సమీపంలో గల పంట పొలాల్లో అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. జింకులోప నివారణకు 12 శాతం చినుకు పొడిని ఎకరాకు 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అలానే కాండము తొలుచు పురుగు తల్లి పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నందువలన లింగాకర్షణ బుట్టలను రాయితీపై సరఫరా చేస్తున్నామని రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు వీటి నివారణకు కార్బెండిజం ఒక గ్రామం లీటర్ నీటికి కలిపి పిసికారి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఏ శంకర్ ఏఈఓ కళ్యాణ్ బొరివంక గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిమాండ్

కొత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :



అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దండు ప్రకాశరావు డిమాండ్ చేశారు. కొత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద రెండో రోజు కొనసాగుతున్న అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలకు ఆయన సంఘీభావం ప్రకటించి ప్రసంగించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ఇబ్బందులను పట్టించుకోవాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో వాటికి అనుగుణంగా అంగన్వాడీల వేతనాలను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. కార్మికులు మరియు ఉద్యోగులు చేసే ప్రతి పోరాటంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వెన్నంటి ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.లక్ష్మి మాట్లాడుతూ గతంలో 42 రోజుల పాటు సాగిన సమ్మె సందర్భంగా వేతనాలు పెంచుతామని పాలకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఆ హామీ ఇచ్చి చాలా కాలం గడిచినా నేటికీ వేతనాల పెంపు అమలుకు నోచుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే వేతనాలు పెంచాలని లేని పక్షంలో మార్చి 5వ తేదీన విజయవాడలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ దీక్షా కార్యక్రమంలో యూనియన్ నాయకులతో పాటు ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# శ్రీకాకుళం వార్త



## పెద్ద చెరువు ఆక్రమణలు తొలగించండి..తహాశీల్దార్‌కు వినతి



వీరఘట్టం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

మండలంలోని నడిమికెల్ల రెవెన్యూలో పరిధిలోని సర్వేనెంబర్ 28లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంగల పెద్ద చెరువు ఆక్రమణలకు గురైందని తక్షణమే తొలగించాలని కోరుతూ మంగళవారం కడకెల్ల గ్రామానికి చెందిన ఇటుక చిట్టిబాబు తహశీల్దారు ఎ.సాయి కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఆక్రమణదారులు చెరువు గట్టును కూడా ఆనవాళ్లు లేకుండా చేశారని ఈ చెరువు ఆయకట్టు సుమారు 400 నుండి 500 ఎకరాల వరకు పంట సాగు అయ్యేదని, చెరువును పూర్తిగా ఆక్రమణ చేయడంతో పంట పొలాలకు సాగునీరు కరువైందని వినతిలో పేర్కొన్నారు. చెరువు ఆక్రమణలు తొలగిస్తే ఉపాధి కూడా దొరుకుతుందని చెరువు కబ్జా గురి కావడంతో ఉపాధి కూలీలు వలసబాట పడుతున్నట్లు ఆయన తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకొని ప్రభుత్వాస్తులు కాపాడి రైతులకు సహకరించాలని ఆయన కోరారు.

## అదుపులోనే అతిసారం

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్..ఇంటింటి సర్వేతో బాధితుల గుర్తింపు ..24 గంటలూ వైద్య సేవలు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:



జిల్లా కేంద్రంలోని దమ్మలవీధి, గుడివీధి, మంగువారి తోట, కాకివీధి ప్రాంతాల్లో ప్రబలిన అతిసారం ప్రస్తుతం అదుపులోనే ఉందని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23న కేసులు వెలుగుచూసిన వెంటనే అధికార యంత్రాం గం అప్రమత్తమైందని, వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, రెవెన్యూ శాఖల సమన్వయం తో క్షేత్రస్థాయిలో ముమ్మర చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 52 కేసులు నమోదు కాగా, బాధితులను రిమ్స్, కిమ్స్, జెమ్స్ వంటి ఆస్పత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నామని వివరించారు. దురదృష్టవశాత్తు ఒకరు మృతి చెందారని, ఐదుగురు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని అన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల పరిహారాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బాధితులకు అండగా ఉంటున్నామని కలెక్టర్ వివరించారు. అతిసార ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటల పాటు వైద్య శిబిరాలు, యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి వీధికి ఒక వైద్య బృందం, శానిటేషన్, ఇంజినీరింగ్, ప్లానింగ్ బృందాలను కేటాయించి పారిశుధ్య పనులు, పైపులైన్ల లీకేజీల తనిఖీలను వేగవంతం చేశామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, తొమ్మిది మంది కీలక అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. అత్యవసర పరిస్థితుల కోసం దమ్మల వీధిలో నాలుగు అంబులెన్స్‌లను నిరంతరం అందుబాటులో ఉంచామని, పరిస్థితి చక్కబడే వరకు వైద్య బృందాలు అక్కడే ఉండి సేవలు అందిస్తాయని స్పష్టం చేశారు. వ్యాధి నివారణకు ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తప్పనిసరిగా నీటిని కాచి చల్లార్చి తాగాలని కలెక్టర్ సూచించారు. సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీతో పాటు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. తాజా ఆహార పదార్థాలనే తీసుకోవాలని, ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో ఇప్పటికే కొందరు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని, మిగిలిన వారికి కూడా నిపుణులైన వైద్యులతో చికిత్స అందిస్తున్నామని, ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

## సమగ్ర సర్వే.. నివేదికలపై నిశిత దృష్టి

అతిసారం ప్రబలిన ప్రాంతాల్లో పరిస్థితిని చక్కదిద్దేందుకు జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిందని వివరించిన కలెక్టర్ ఇంకా ఏమన్నారంటే 'ప్రతి సచివాలయం పరిధిలో 10 ప్రత్యేక బృందాలతో ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, స్వల్ప లక్షణాలు ఉన్న వారిని సైతం గుర్తించి తక్షణ చికిత్స అందిస్తున్నాము. ముఖ్యంగా మంగువారితోట, దమ్మలవీధి, గుడివీధి, కాకివీధి ప్రాంతాల్లో వైద్య, శానిటేషన్, ఇంజినీరింగ్, ప్లానింగ్ విభాగాలతో కూడిన సమన్వయ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. అటు మున్సిపల్ నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసి, ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సేకరించిన నీటి నమూనాలను ఇప్పటికే ల్యాబ్‌కు పంపగా, ఆ నివేదికలు అందిన తర్వాత అతిసారానికి ప్రధాన కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించనున్నాము. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ కలిగిన అంబులెన్స్‌లను క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉంచడంతో పాటు, కంట్రోల్ రూమ్ ద్వారా తొమ్మిది మంది కీలక అధికారులు పరిస్థితిని 24 గంటలూ సమీక్షిస్తున్నారని కలెక్టర్ వివరించారు.

## అమరజ్యోతి పాఠశాలలో వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు



పాతపట్నం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

స్థానిక అమరజ్యోతి పాఠశాలలో శ్రీ సత్య సాయి సేవాసంస్థ వారు 7,8,9 తరగతులు చదువుతున్న సుమారు 300 విద్యార్థులకు మానవత్వ విలువలు మరియు వ్యక్తిత్వవికాస శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు ముఖ్యంగా ఉండవలసిన లక్షణాలు అయినటువంటి ధృతి, దృష్టి, మతి, దాక్ష్యం అంశాలను సోదాహరణంగా వివరించారు. వీటితోపాటు ద్యేయమాత, దేశమాత, గోమాత,భూమాత మరియు వేదమాత ఇలా పంచమాతలను గౌరవించాలి అలాగే భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి బోధనలో ప్రధానమైనది దకార పంచకం అని శ్రీ సత్యసాయి సేవాసంస్థ జిల్లా విద్యాజ్యోతి ఇంచార్జ్ ఎం.జనార్ధనరావు, మండల కన్వీనర్ అన్నంనాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం సోమేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఇప్పిలి మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## పునర్విక కోసం జోలి పట్టిన సోంపేట యువత

సోంపేట (ప్రభాతవార్త



నెల్లూరు జిల్లాకు చెందిన పునర్విక అనే ఆరు నెలల పాప అరుదైన శ్వాసకోసవ్యాధితో తీవ్ర ఇబ్బంది పడుతోంది. వైద్యులు పరీక్షించిన అనం తరం ఎస్ఎంఎ 1 అనే వ్యాధిగా నిర్ధారించారు. ప్రతి లక్ష మంది జనాభాలో పుట్టిన వెంటనే ఒకరికి అరుదుగా ఈ వ్యాధి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. పేద కుటుంబానికి చెందిన ఈ పసిపాప ప్రాణాలు కాపాడాలంటే 16 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు పేర్కొనడంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ పునర్విక కోసం జోలి పట్టి చందాలు వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే సోంపేటకు చెందిన పలువురు యువకులు కలిసి ఇదే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. మనసున్న ప్రతి ఒక్కరూ తోచిన సహాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. 16 కోట్ల రూపాయలతో విదేశాల నుంచి ఈ వ్యాధి నివారించేందుకు అవసరమైన ఒక ఇంజక్షన్ కొనుగోలు చేస్తారని స్థానిక యువకులు పేర్కొంటున్నారు.

## పశువైద్యుడిగా తన 34 సంవత్సరాల విజయవంతమైన సేవలకు గుర్తింపు



సోంపేట (ప్రభాతవార్త

డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఆత్మ కు పదోన్నతి పొందిన డాక్టర్ మట్ట రవికృష్ణ గారిని పలాస సబ్ డివిజనల్ మరియు నందిగాం సబ్ డివిజనల్ సిబ్బంది ఘనంగా సత్కరించడం జరిగినది.పశువైద్య అధికారులు, సిబ్బంది మరియు మొబైల్ సిబ్బంది క్షేత్ర పశు వైద్యుడిగా తన 34 సంవత్సరాల విజయవంతమైన సేవలను అందించారని తెలియజసారు .ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టెక్కలి డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు గారు పాల్గొనడం జరిగినది. అలాగే ఇన్‌ఛార్జ్ పలాస సహాయ సంచాలకులు డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖర్ గారు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు మరియు డాక్టర్ పాపారావు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఉమా భారతి, డాక్టర్ పాపారావు, డాక్టర్ మధుబాబు,డాక్టర్ చైతన్య, డాక్టర్ శిరీష, డాక్టర్ ఊహ మరియు పలాస సబ్ డివిజనల్ స్టాఫ్ మరియు నందిగామ సబ్ డివిజనల్ స్టాఫ్ పాల్గొనడం జరిగినది.

